ఆలయాలు దేవాలయాలు

CI

REH01A422
TEM/22

ఆలయాలు-దేవాలయాలు

Y.R. Rao
Reporter.
Andhra
prabha.

రచన:

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

మల్లంపల్లి శరభేశ్వర శర్మ

ప్రచురణ :

డైరెక్టర్,

సమాచార, పౌర సంబంధ శాఖ,

గృహకల్ప, హైదరాబాద్

వెల :

1170--1



తి రు ప తి

తిరుమల - తిరుపతి

జగత్ప్రసిద్ధమైన తిరుపతి క్షేత్రమును గూర్చి దిగ్మాత్ర పరిచయం చేయవలెనన్నా, వేయి నాల్కల వానికే సాధ్యమేమో! 'కలౌ వేంకట నాయక:' తెలుగు దేశంలోని సకల క్షేత్రాలకు సార్వభౌమ స్థానం తిరుపతిదే అనడం అతిశయోక్తి కాదు.

తిరుపతి చిత్తూరు జిల్లా చంద్రగిరి తాలూకాలో ఉన్నది. రేణిగుంట రైలు జంక్షనునకు ఆరుమైళ్లు. దిగువ తిరుపతికి ఎగువ తిరుపతి కొండ 14 మైళ్ళు. అదే తిరుమల. సముద్రపు మట్టానికి మూడువేల అడుగుల ఎత్తున ఉన్న తిరుమల మీద వేంకటేశ్వరస్వామి వెలసి ఉన్నాడు. ఆయన అర్చామూర్తి దర్శనలాభం కలుగవలేనంటే, ఏడు కొండలు ఎక్కాలి. ఈ కొండల వరుస పాము చుట్టుకొన్న చుట్లని స్ఫూర్తికి తెస్తూ వుంటుంది. శేషాద్రి, వెంకటాద్రి వృషభాద్రి, అంజనాద్రి అనేవి తిరుమల పేర్లు. పర్వత పంక్తి విష్ణువుయొక్క శేషతల్ప మనీ, శేషుని పుచ్ఛం శ్రీశైలమూ వీపు అహోబిలమూ కాగా ముఖం తిరుమల అనీ పురాణోక్తి.

శ్రీమన్నారాయణుడు వెంకటేశ్వరుడుగా ఇక్కడ అవతరించడానికి చెప్పే గాథ కలియుగంలో ప్రపంచమంతా ధర్మదూరమై అశాంతికి లోనై ఉంది. లోక కళ్యాణానికి సప్తర్షులు ఒక యాగం తలపెట్టి చేశారు. హవిర్భాగం దేవేంద్రునికి అర్పించే సమయంలో నారదుడు అక్కడికి వచ్చి ఇంద్రుడు భోగలాలసుడు, హవిర్భాగం గ్రహించడానికి అనర్హుడు, త్రిమూర్తులలో ఎవడు శాంతుడో నిర్ణయించి వానికీయడం న్యాయంఅన్నాడు న్యాయనిర్ణేతగా భృగు మహర్షి ముందు బ్రహ్మలోకానికి వెళ్లాడు. ఆయన మౌనంవహించి భృగువుని పలకరించనైనాలేదు. భృగువు కోపంతో భూలోకంలో నీకు పూజా పునస్కారాలు ఉండవని బ్రహ్మను శపించి, కైలాసం వెళ్లాడు. అక్కడ శివపార్వతులు తాండవంతో తన్మయులై భృగువు రాకను గమనించనే లేదు. మహర్షి అలిగి పట్టెడు మారేడు, పిడికెడు విభూతి తప్ప శివుడికి నైవేద్యం ఉండదని శపించినాడు. ఇంక త్రిమూర్తులలో నారాయణుడు ఉన్నాడు. భృగుమహర్షి వైకుంఠానికి వెళ్ళి చూడగా, లక్ష్మీనారాయణులు ఏకాంతంలో ఉన్నారు. ముని వచ్చిన

సంగతి గమనించ లేదు. భృగువు మండిపడి, కోపావేశంతో మహావిష్ణువు వక్షస్థలంపై తన్నినాడు. విష్ణువు ఏమీ తెలియని వాడివలె మహర్షి పాదాలు పట్టుకొని క్షమాపణ వేడాడు. భృగువు అరికాలిలో కన్ను ఉన్నది. మహాగర్వంతో ఉన్న ఋషికి పాద సేవ చేస్తున్నట్టే చేస్తూ విష్ణువు ఆ కన్ను చిదిమి వేశాడు. ఈ విధంగా గర్వభంగం జరిగి భృగువు బుద్ధి తెచ్చుకొని విష్ణువు పాదాలు పట్టుకొని శరణు వేడాడు. శరణాగత రక్షణ పరాయణుడు నారాయణుడు భృగువునకు అభయం ఇచ్చిపొమ్మన్నాడు. తన్నిన వానికి అభయ మివ్వటం లక్ష్మీదేవికి అసహ్యమై వైకుంఠం విడిచి, ఆమె భూలోకానికి వచ్చి చిత్తశుద్ధి కోసం తపస్సు చేయడం ఆరంభించినది. వైకుంఠములో నారాయణుడు లక్ష్మి వియోగం భరించలేక భూలోకానికి వచ్చి గిరులు అరణ్యాలు పట్టి సంచరిస్తూ వరాహస్వామి ఆశ్రమం చేరుకున్నాడు. అక్కడ వకుళమాత నారాయణుని ఆదరించి శ్రీనివాసుడనే పేరుపెట్టి పుత్రనిర్విశేషంగా చూచుకొంటూ ఉన్నది.

అక్కడ ఉండగానే ఆకాశరాజు కూతురైన పద్మావతిని శ్రీనివాసుడు వివాహం చేసుకొన్నాడు. పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణవార్త మహాలక్ష్మి విని అసూయపడి అక్కడికి వచ్చింది. కొన్నాళ్ళకు సవతులపోరు చూస్తూ భరించలేక శ్రీనివాసుడు శిలాకృతి వహించగా, అక్కడ తిరుపతి క్షేత్రం ఏర్పడింది. మహాలక్ష్మి దుఃఖంతో కలియుగాంతంవరకు భూలోకంలోనే భర్తతోపాటు ఉండిపోవాలని తానుకూడా శిలారూపంతో కరవీరపురంలో ఉండిపోయింది. అదే కొల్హాపూర్. అలాగే పద్మావతి వెలసిన స్థలం మంగాపురం. వకుళమాత వకుళ మాలికయై శ్రీనివాసునకు గళాభరణంగా ఉన్నది. ఆకాశరాజు అనంతరం అతని సోదరుడు శ్రీనివాసులకు ఆలయం నిర్మించాడు. నిత్య పూజా నైవేద్యాలు ఏర్పాటు చేశాడు. అతని రాజధాని నారాయణ వనం నుండి రహస్య బిల మార్గంలో స్వామి ఆలయానికి స్వయంగా వచ్చి అర్చించేవాడని చెబుతారు.

ఇక-చారిత్రకులు తిరుపతిని గూర్చి చాలా విషయాలు పరిశీలించి చెప్పారు. వెంకటేశ్వరుని ఆలయం ఎనిమిదవ శతాబ్దికి పూర్వమే ఉన్నట్లు శాసనాలు ఉన్నవి. పల్లవులు, చోళులు, యాదవులు, విజయనగర రాజులు, ఈ క్షేత్రము యొక్క ఉత్తరోత్తర నిర్మాణ విస్తృతికి బహువిధాల తోడ్పడ్డారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రాకార గోపురాల కుడ్యశిల్పాల పెంపు జరిగింది. రాయలవారు, వారి దేవేరులు తిరుమలదేవి, చిన్నాదేవి, స్వామివారికి సమర్పించుకొన్న కానుకలు ఎన్నో ఉన్నవి. గజపతులను జయించిన తర్వాత రాయలవారు స్వామికి

కనకాభిషేకము చేసినట్లూ, అలాగే మరొకసారి స్వామికి నవరత్న ఖచిత ఖడ్గం బహూకరించినట్లూ, చారిత్రక సత్యాలు లెక్కలేనన్ని ఉన్నవి. స్వామివారి ఆలయానికి వెళ్ళేముందు తిరుమలదేవి-చిన్నాదేవి విగ్రహాలు చూచినపుడు సాహితీ సమరాంగణ సార్వభౌముడు రాయలు సకుటుంబంగా శ్రీనివాసునకు అంకితమైన సుకృతాత్ముడనిపిస్తుంది. రాయలు ఆముక్త మాల్యద కావ్యం వేంకటరమణాంకితమైనదే కదా!

తిరుమల పరిసర తీర్థాలు మూడు వందల అరవై ఉన్నవని చెప్పుకుంటారు. ఆ తీర్థాలన్నీ స్వామి పుష్కరిణిలో సంగమించి ఉంటాయి. ఆకాశగంగ, పాపనాశనం, గోగర్భం—కొన్ని ప్రధాన తీర్థాలు. తిరుపతి వెంకటేశ్వర స్వామివారికి 'తలనీలాలు' ఇవ్వడమనేది ప్రీతికరమైనది. 'కళ్యాణకట్ట' లో కేశ సంపద స్వామివారికి అర్పించే భక్తులు యాత్రికుల్లో మూడు వంతులు ఉంటారు.

పుష్కరిణిలో స్నానం, భక్తశ్రేణి వరుసలో నిలబడి అనుధ్యానం, దానికి ఫలముగా స్వామివారి దివ్యమంగళ దర్శనలాభం క్షణకాలికమే అనుకున్నా, భక్తాంతరంగంలో ఆ అమృత క్షణం జన్మపర్యంత స్థాయి.

ఏమయినా, ఆ ఎత్తునుండి మన మనస్సు దిగువకు రాక తప్పడంలేదు. దిగువ తిరుపతిలో యాత్రికుల దర్శనీయ స్థలాలు గోవిందరాజస్వామి ఆలయం, కోదండ రామాలయం. శ్రీనివాసుడు పంపిన ధనం వెండి కుంచముతో కొలిచి కొలిచి అలసిపోయి, భార్యలిద్దరూ పాద సేవ చేస్తూ ఉంటే కుంచం తలక్రింద పెట్టుకుని శయనించి ఉన్న గోవిందరాజస్వామి విగ్రహం మహాగంభీరమూ, రమణీయమూ అయినది. ఇక్కడి ఆలయ ద్వార గోపుర నిర్మాణం విజయనగర ప్రభువుల కాలంనాటిది. కోదండ రామాలయం దిగువనున్న దేవాలయాలన్నింటిలోను సువిశాలమైనది. రామస్వామి, సీతా, లక్ష్మణుల విగ్రహాలు ఇక్కడ ఆరాధింపబడుతున్నవి. ఇక్కడి ముఖమండప స్తంభ శిల్పకళా వైభవం దర్శనీయమైనది. పద్మావతి దేవి ఆలయం దిగువ తిరుపతికి రెండు మైళ్ళ దూరాన ఉంటుంది. ఆ ఊరు తిరుచానూరు. శ్రీ అలివేలు మంగతాయారు - పద్మావతీదేవికి ఎన్నో రత్నాభరణాలు ఉన్నవి. పచ్చల గోవిందనామంతో అందగించే మణికిరీటము, దశావతారాలతో కనులపండువు చేసే బంగారు జడ-బింకా ఎన్నో కైసేతలు అమ్మవారివి.

పౌరాణికములు చారిత్రకములు అయిన కథలు, గాథలూ పడుగు పేకలుగా అల్లుకొని ఉండి, భారతీయ దేవాలయ సర్వస్వానికి తన ప్రాతినిధ్యం బహువిధాల ప్రదర్శిస్తూ ఉన్న తిరుపతి దేవస్థానం మానవాభ్యుదయానికి సర్వతో ముఖమైన దోహదం చేస్తున్న విషయం జగద్విదితం. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయము, శ్రీ వెంకటేశ్వర మూగ, బధిర అంధుల పాఠశాల, అన్నమాచార్య కళామందిరము, వేదవిద్వత్ సదస్సు, శిల్ప శిక్షణాలయాలు, పాశ్చాత్య కళాశాలలు, సంగీత కళాశాలలు — ఎన్నో లెక్కించజాలనన్ని సంస్థలు. ఈ దివ్య క్షేత్రము యొక్క కీర్తిధ్వజములు "హిందూధర్మ ప్రతిష్ఠానము" 1969 లో వైశాఖ పూర్ణిమనాడు శ్రీ వెంకటేశ్వర సంస్థానమైన తిరుమల కొండపై జగద్గురువులు శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరులచే ఆరంభించబడి, అవిచ్ఛిన్నంగా సేవ చేస్తున్నది. దేవాలయాలలో వేదపారాయణలు నిత్యమూ జరిపించే ఏర్పాటు చేయడము, ఆగమశాస్త్ర పాఠశాలలు, వేద పాఠశాలలు నెలకొల్పి విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడము — ఇట్టి సత్కార్యముల ద్వారా భారత వర్షము యొక్క ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను తిరుపతి దేవస్థానం పరిరక్షిస్తోంది.

తిరుపతి దేవస్థానము వారి సేవావైభవం ఒక భారత దేశమునకే పర్యాప్తం కాలేదు. ఖండాంతర ఖ్యాతి వహించి ఉన్నది. ఉత్తర అమెరికాలోని హిందూ దేవాలయ సంఘంవారు శ్రీ వెంకటేశ్వరస్వామి, పద్మావతి ఆండాళ్ల దేవాలయ నిర్మాణం తిరుపతి దేవస్థానమువారి ద్రవ్య సంపత్తితో నిర్మించారు. భారతీయులకు ప్రథమారాధ్యుడైన విఘ్నేశ్వరునకు న్యూయార్కులో ఆలయ నిర్మాణం జరిగింది. ఈ విధంగా శ్రీ వెంకటేశ్వరస్వామి దివ్యసందేశం ప్రపంచము ఎల్ల యెడల పరివ్యాప్తం కావడం శుభోదర్కము.

TEMY

5



భద్రాచలం

భద్రాచలం

వామాంక స్థితజానకీం పరిలసత్కోదండ దండం కరే
చక్రం చోర్ధ్వకరేణ బాహుయుగళే శంఖం శరం దక్షిణే
బిభ్రాణం జలజాత పత్రనయనం భద్రాద్రి మూర్ధ్ని స్థితం
కేయూరాది విభూషితం రఘుపతిం రామం భజే శ్యామలం।

చతుర్భుజమూర్తియైన వైకుంఠధాముడు శ్రీ సీతారామచంద్ర స్వామిగా వేంచేసి ఉన్న భద్రాద్రి సర్వభారతప్రసిద్ధమైన పుణ్యక్షేత్రం. ఒకప్పుడు గోదావరీ మండలాంతర్గత అయినా, ఇప్పుడు భద్రాచలం ఖమ్మం జిల్లాలో ఉన్నది. రాజమహేంద్రవరానికి నూటయిరవై మైళ్ల దూరాన గోదావరీ తీరాన ఉన్న భద్రాచలం వెళ్లడానికి బస్సు సదుపాయాలు ఉన్నవి. రాజమహేంద్రవరంనుంచి ప్రతిరోజూ లాంచీలు వెడుతూ ఉంటాయి.

భద్రాచల క్షేత్రము యొక్క ఉద్భవ ప్రాభవాలను గూర్చి పౌరాణికమైన తార్కాణములు కొన్ని ప్రసిద్ధాలు. బహు ప్రాచీన కాలంలో మేరువు తన భార్య మేనకాదేవితో సహా బ్రహ్మను గూర్చి పెద్దకాలం ఘోర తపస్సు చేశాడు. పరమేష్ఠి అతని తపోనిష్ఠకు మెచ్చి అభీష్టవరం కోరుకొమ్మన్నాడు. మేరువు రామభక్తి భరితుడైన ఒక పుత్రుణ్ణి కోరాడు. బ్రహ్మ అనుగ్రహించాడు. మేనకా మేరువులకు కుమారుడుగా జన్మించిన భద్రుడు రామభక్తి నిర్నిద్రుడై చిరపతస్సు చేసి అచలాకృతివహింప చతుర్భుజమూర్తి శ్రీ రామచంద్రుడు అతని శిరస్సు మీద స్థిరప్రతిష్ఠితు డయ్యాడు. కలియుగ వైకుంఠం భద్రాచలం చాలా కాలంవరకు అడవులలో అగోచరంగానే ఉండినది. ఇటీవల చరిత్ర ఈ రీతిగా ఉన్నది. భద్రాద్రి సమీపంలోని ఒక గ్రామంలో తమ్మాల దమ్మక్క అనే భక్తురాలు నివసించి ఉండేది. బహుజన్మల సంస్కారంతో అవ్యాజంగా ఏర్పడిన ఆమె భక్తికి సంతుష్టుడైన శ్రీ రామచంద్రుడు స్వప్నంలో కనబడి తన భద్రిస్థితిని లోకానికి తెలియబరిచి, నిత్యోత్సవాలు చేస్తూఉండమని ఆదేశించాడు. భక్తురాలు దమ్మక్క ఈ శుభవార్త నలుగురికీ చెప్పి భద్రాచల శిఖరంమీద వెదకి

1170—2

పచ్చని చెట్ల గుబురులలో ఉన్న శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహాలను చూచి సంప్రోక్షణాదులు చేయించి, ప్రతిష్ఠ చేసినదట. ఆనాడు స్వామి పర్ణశాలలో నివసించి ఉండేవాడని చెబుతారు.

ఇది యిలా ఉండగా 17 వ శతాబ్దిలో భద్రాచల ప్రాంతమంతా గోల్కొండ నవాబు తానీషా ఏలుబడిలో ఉండేది. అక్కన్న, మాదన్న అనే సోదరులు తానీషాకు మంత్రులు. గోపన్న వారి మేనల్లుడు. రామదాసుగా ఇప్పుడు మనం చెప్పుకుంటాము. ఆ గోపన్న తన మేనమామల ద్వారా నవాబు ఆశ్రయం సంపాదించి భద్రాచల ప్రాంతానికి తహసిల్దారుగా ఉద్యోగం చేస్తూవుండేవాడు. గోపన్న జన్మతః రామభక్తుడు. భద్రాద్రి రాముడు ఎండకు ఎండుతూ, వానకు నానుతూ ఉండడం లోకానికి క్షేమం కాదని ప్రజలనందరినీ రామభక్తిచే ఉత్తేజితుల్ని చేసి, కొన్ని సంవత్సరాలుగా వసూలు కాకున్న పన్నులు ఆరు లక్షలు వసూలు చేసి, ఆ ధనంతో భద్రాద్రి రామునకు గోపురప్రాకారాది నిర్మాణాలు చేయించాడు. ఆలయనిర్మాణం మేరకే కాక, రామదాసు రామచంద్రుడికి కలికితురాయి, సీతమ్మకు చింతాకు పతకం, మొలతాడు మొదలగు కైసేతలు చేయించాడు. వాహనాలు చేయించాడు. వాటిని ఇప్పటికీ యాత్రికులు నేత్రోత్సవంగా చూస్తూ ఉంటారు.

ఈ విధంగా ప్రభుత్వ ధనం వ్యయ పెట్టిన గోపన్నను నవాబు కారాగారంలో ఉంచమన్నాడు. చెరలో ఉన్న గోపన్న రామచంద్రుని గూర్చి మొరపెట్టుకుంటూ చెప్పిన కీర్తనలు తరచు మనం వింటూ ఉంటాము. గోపన్న రాముణ్ణి ఎంత వేడుకున్నా లాభం లేకపోయింది. ఆరు లక్షల ధనం నవాబుకు చెల్లించాలి. ప్రాణత్యాగానికే నిర్ణయించుకున్నాడు. భగవల్లీల ! ఆ రాత్రికి రాత్రి రామలక్ష్మణులు తానీషాకు ఈయవలసిన ఆరు లక్షలు ఇచ్చి వెళ్ళిపోయారు. మర్నాడు ఉదయం గోపన్న విడుదల చేయబడ్డాడు. గోపన్న రామదాసుగా విఖ్యాతుడయ్యాడు. తానీషా కూడ రామభక్తుడై, ప్రభుత్వపు ఖజానా నుంచి మందిర నిర్వహణకు ఏటా పదివేల వరహాలు ఏర్పాటు చేశాడు. గోపన్నకు తారకమంత్రం కబీరుదాసు ఉపదేశించాడని చెపుతారు. భద్రాద్రి విఖ్యాతితో రామదాసు పేరు శాశ్వతం అయింది.

భద్రాద్రి సమీపంలో గోదావరి గర్భంలో ఉష్ణగుండం ఒకటి ఉన్నది. దాని పేరు శేషేశ్వరం. నాగలోకాధిపతి శేషుడు రాక్షసులను ఎదుర్కొనే బలంలేక బ్రహ్మాను గూర్చి తపస్సు చేశాడు. బ్రహ్మ శేషుని అనుగ్రహించి

భూలోకంలోని భద్రాచలం చేరి గౌతమీ తీరంలో శివధ్యానం చేస్తే నీకు ఇష్టసిద్ధి అవుతుందని చెప్పాడట. శేషుడు శివుణ్ణి గూర్చి తపస్సు చేస్తూ అగ్ని గుండం నిర్మించి అభిచారహోమం చేయగా, శివుడు ప్రత్యక్షమై శత్రు సంహారకమైన ఒక శూలం ప్రసాదించాడు. శేషుడు శూలాయుధంతో అరివర్గ నిర్మూలనంచేసి, రాజ్యభోగాలు అనుభవించాడు శేష ప్రతిష్ఠితమైన ఈ శివక్షేత్రం శేషేశ్వరమనీ, అభిచారహోమం చేసినచోట ఉన్నగుండమని అంటారు.

భద్రాచలానికి పదిమైళ్ల దూరాన 'పంచవటి' ఉన్నది. మరికొంత దూరాన రాముడు అరణ్యవాసం చేసినప్పటి పర్ణశాల; జటాయువు సీతాపహరణ వార్త రాముడికి తెలియజేసి తను త్యాగం చేసిన శ్రీరామగిరి; ఈ విధంగా రామాయణంలోని కొన్ని అంశాలు భద్రాచల ప్రాంతంలోనే జరిగిన తార్కాణాలు చూపిస్తూ ఉంటారు.

భద్రాద్రి రామాలయం కొంత జీర్ణస్థితిలో ఉండడంవల్ల ప్రభుత్వము వారు పునరుద్ధారంచేసి, నేడు దానికి ఎన్నో వినూత్న సుందర నిర్మాణాలు జతచేశారు. తిరుపతి దేవస్థానం వారు ఆధునిక సౌకర్యాలు గల గదులతో పెద్ద సుందరమందిరాన్ని భద్రాద్రిలో నెలకొల్పారు. అన్నవరం దేవస్థానం వారిది, మైసూరు మహారాజా వారిది, ఇంక కొన్ని సత్రాలు ఉన్నవి. చంద్రమౌళి భవనం, రామదాసు ధ్యాన మందిరం మొదలైన నిర్మాణాలకు శిఖరాయమానంగా కల్యాణ మండపం దర్శించవచ్చు. అపూర్వ సుందర శిలాశిల్ప ఖండంగా ఉన్న శృంగార మండపంలో రామాయణ గాథా ఘట్టాలు పరికించవచ్చు.

ప్రతి సంవత్సరమూ చైత్రశుద్ధ ప్రతిపత్తు మొదలు నవమివరకూ బ్రహ్మోత్సవాలు అతివైభవంగా జరుపుతారు. వేలకొలదీ భక్తులతో శ్రీరామనవమి నాడు సీతా కళ్యాణం జగజ్జేగీయమానంగా జరుగుతుంది. హరికథలు, నృత్యవినోదాలు, నాటకాలు దేవస్థానం వారు ఏర్పాటు చేస్తారు. ముక్కోటి ఏకాదశినాడు కూడా అసంఖ్యాక ప్రజానీకం

భద్రాచల క్షేత్రానికి వస్తారు. ఉత్సవ దినాల్లోనే కాక నిత్యమూ యాత్రిక సందోహము కల్యాణ గుణాభిరాముడైన శ్రీరామచంద్రునకు, సీతమ్మవారికి కాన్కలు సమర్పించి ఆరాధనలు జరుపుకుంటారు.

భద్రాచల క్షేత్రంలో సీతారామచంద్ర సాన్నిధ్యంపొంది చిరంజీవి యైన రామదాసు గోపన్న దాశరథీ శతకం తెలుగువారి పారాయణంలో ఉన్న గ్రంథము.

శ్రీరమ సీతగాగ, నిజసేవక బృందము వీరవైష్ణవా
చారజనంబుగాగ, విరజానది గౌతమిగా, వికుంఠము
న్నారయ భద్రశైల శిఖరాగ్రముగాగ వసించు చేతనో
ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ। కరుణాపయోనిధీ।

11

అన్నవరం

తూర్పు గోదావరీ మండలము పంపానదీ తీరాన ఉన్న 'అన్నవరం' తెలుగు దేశంలో విశేష విఖ్యాతమైన క్షేత్రం. ఇక్కడ రత్నగిరిపై వెలసిన వేల్పు హరిహరహిరణ్య గర్భాత్మక శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి అమ్మవారు అనంతలక్ష్మి సత్యవతి. భక్తులకు ఇమ్మన్న వరాలు ఇచ్చే 'రత్నగిరి' అన్నవరంగా అన్వర్థమైనది. నిరతాన్నదానం కారణంగా 'అన్నవరం' పేరు స్థిరపడినదంటారు.

తూర్పు కనుమలు ఇక్కడనుండే ఆరంభం. పావనమైన పంపానది రత్నగిరి ప్రక్క సన్నగా ప్రవహిస్తూ ఉంటుంది. వర్షాకాలంలోనే దాని వెల్లువ స్ఫుటంగా స్నానానుకూలం అవుతుంది. సాధారణంగా అక్కడి బావులలోని నీరు తోడుకొని యాత్రికులు స్నానాలు చేస్తారు.

శ్రీరాముడు వనవాసకాలంలో ఈ ప్రాంతాన సంచరించినట్లు, సుగ్రీవాదులను అనుగ్రహించిన ప్రదేశం ఇదే అయినట్లు చెపుతారు. మేరువు కుమారుడు రత్నాకరుడు, ఆయన రత్నగిరిగా ఉండి తన శిరస్సుపై సత్యనారాయణస్వామికి స్థిరనివాసం ఏర్పరచాడని అంటారు. స్వామివారికి ఇప్పటి ఆలయాది నిర్మాణాలు అర్వాచీనమే అయినా ఆయన ఈ కొండపై వెలసినది ప్రాచీనకాలమందే. స్థానికులైన భక్తులకు స్వప్నంలో కనబడి రత్నగిరిమీద తన ఉనికినిగూర్చి సూచించినమీదట ఆలయనిర్మాణ ప్రతిష్ఠలు జరిగినవని తెలుస్తుంది. 1891లో ఖరనామ సంవత్సర శ్రావణ శుద్ధ ద్వితీయనాడు రామారాయణింగారిచే ప్రతిష్ఠితుడైన స్వామి భారతదేశము నలుమూలలాఉన్న లక్షలాది భక్త యాత్రికులను ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు.

ఈ క్షేత్రములో జరిగిన యంత్రప్రతిష్ఠ అపూర్వమైనది. అధర్వణ వేదంలోని దేవర్షి శాఖకు సంబంధించిన విధానంతో, త్రిపాద్విభూతి నారాయణోపనిషత్తు ఆధారంగా ఈ యంత్రం ప్రతిష్ఠితమయింది. దేవస్థానము రెండంతస్థులుగా ఉంటుంది. క్రిందిభాగంలో యంత్రప్రతిష్ఠ. సత్యనారాయణ స్వామివారి మూర్తి పైభాగములో ఉంటుంది. ఈ రెండింటికి మధ్య పానవట్టం వంటి నిర్మాణం. అందు త్రిపీఠములమీద బీజాక్షర సంపుటి

యంత్రం. బిందుస్థానమున ఏకశిలా స్తంభము. ఆ వైభాగములో స్వామి వారి విగ్రహం. ఒకప్రక్క అమ్మవారు అనంతలక్ష్మీ సత్యవతీదేవి. వేరొక వైపు శివలింగం. ఉగువభాగంలో ఆదిత్యుడు, గణనాథుడు, అంబిక, మహేశ్వరుకు నలువైపుల ఉన్నారు. యంత్రమునకు స్వామి మూర్తికి త్రికాలార్చనలు జరుగుతూ ఉండడమేకాక. స్ఫటిక శ్రీచక్రార్చనము, సాలగ్రామార్చనము నిత్యం చేయబడతవి. స్వామిపేర సృష్టి స్థితి లయ కారకులైన ముప్వురు మూర్తుల ఏకాకృతి ఈ రత్నగిరిమీద వెలసినదని విజ్ఞులు భావిస్తారు. ఈవిధంగా ధ్యానిస్తారు.

మూలతో బ్రహ్మరూపాయ
మధ్యత శ్శివరూపిణే
అగ్రతో విష్ణురూపాయ
త్రైక రూపాయతే నమః

ప్రధానాలయానికి కొంత దిగువ భాగాన రామాలయం, వనదుర్గా, కనకదుర్గాలయాలు ఉన్నవి. వనదుర్గ ఈ క్షేత్రంలో రాత్రులు సంచారం చేస్తూ ఉంటుందని ప్రతీతి.

అన్నవర క్షేత్రమునకు వచ్చి మొక్కుబడులు చెల్లించేవారి సంఖ్య నిత్యమూ అసంఖ్యాకముగా ఉంటుంది. పిల్లలకు నామకరణాలు, అక్షరా భ్యాసాలు, ఉపనయన వివాహాదులు జరుపుకుంటారు. తిరుపతిలో వలెనే కేశఖండనము జరిపించుకొనేవారు వస్తూ ఉంటారు. స్వామివారి కల్యాణం, నిత్యపూజ, సహస్రనామము, అష్టోత్తరము, అభిషేకము మొదలైనవానికి ప్రత్యేకముగా రుసుములు ఏర్పాటుచేసి ఉంచినారు. సత్యనారాయణస్వామి వారి ప్రసాదము ఆయన అనుగ్రహంవలెనే ఎంతో ప్రసన్న మధురంగా ఉంటుంది. వైకుంఠేకాదశి, భీష్మైకాదశి మొదలైన పర్వాలలో తండోప తండాలు భక్తులు వస్తారు. సామూహికముగా జరిగే సత్యనారాయణ వ్రతములు అన్నవర క్షేత్రంలో చూసితీరవలెను. శ్రేణులుకట్టి దంపతులు కూర్చుని ఉంటారు పూజాద్రవ్యములు దేవస్థానంవారే ఏర్పాటుచేస్తారు. పురోహితుడు ఉచ్చైస్స్వరంతో మంత్రాలు చెపుతుంటే ఎవరి పూజ వారు చేసుకుంటారు. సత్యనారాయణ వ్రతకల్పం స్కాంద పురాణములోని రేవా ఖండములో ఉన్నది. వ్రత మహాత్మ్యం వివరించే అందలి కథలు శ్రద్ధాభక్తు లతో అందరూ వింటారు. తెలుగునేలలో నాల్గు చెరగులా సత్యనారాయణ వ్రతం చేసుకొని అభీష్టసిద్ధి పొందుతున్నవారు ఉన్నారు. తెలుగువారే కాదు. ఇతర రాష్ట్రాలనుండి స్త్రీ పురుషులు ఎందరో స్వామి సన్నిధికి

వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఉంటుంది. దేవస్థానంవారి సత్రములు ఉన్నవి. అన్నవరంలో ఒక ఉన్నత పాఠశాల, ఒక సంస్కృత పాఠశాల దేవస్థానంవారు నడుపుతున్నారు.

వైశాఖ శుద్ధ ఏకాదశి మొదలు అయిదు రోజులు స్వామివారికి కల్యాణ మహోత్సవాలు చేస్తారు, ఈ ఉత్సవాలలో భక్త హృదయాకర్షకమైన కళాప్రదర్శనలు, హరికథలు మొదలైనవి ఉంటాయి. ముఖ్యంగా అనేకులు వేదశాస్త్ర విద్వాంసులకు దేవస్థానం వార్షికాలు ఇస్తుంది. సదస్యంనాడు వేదపండితుల స్వస్తివాచకములు, శాస్త్ర విద్వాంసుల వాక్యార్థములు, ఆసక్తులైనవారు వింటారు. చాలా కాలంనుంచి అన్నవరక్షేత్రంలో కవులకు గౌరవాదరాలు లభిస్తున్నవి. కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిగారు, శతావధాని చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రిగారు, పిసుపాటి చిదంబరశాస్త్రిగారు మొదలైన విద్వత్కవుల ఆధ్వర్యంలో కవితారచన పోటీలు జరపడం, అందులో ఉత్తీర్ణులైనవారికి వార్షికాలు ఏర్పాటుచేయడం ఉండేది. నేటికి కూడా దేవస్థానంవారు అముద్రితగ్రంథాల ముద్రణకు ద్రవ్యసహాయం చెయ్యడం, కవి సత్కారాలు మొదలైనవి జరిపిస్తున్నారు. వేంకట పార్వతీశ్వర కవులలో ఒకరైన ఓలేటి పార్వతీశ్వర కవిగారిని దేవస్థాన కవిగా నియమించి వారికి చాలాకాలం మాసభృతి ఇచ్చిన విషయం పెద్దలకు తెలిసిందే. "సత్యదేవ ప్రశస్తి" అనే పద్యకావ్యం వారు వ్రాసినది ముద్రితమైనది.

అన్నవరం కొండమీద ఆలయం ఎదుట ఉన్న మండపానికి పడమవైపు "సన్ డయల్" ఎండ గడియారము తప్పక చూడవలసిన యంత్రనిర్మాణం. జ్యోతిశ్శాస్త్రవేత్తలు పిడమర్తి కృష్ణమూర్తిశాస్త్రిగారి మేధాబలంతో ఇది ఈ క్షేత్రంలో స్వామి సన్నిధిని నెలకొల్పబడింది. దీనివల్ల పగటివేళ సూర్యాతపం ఆధారముగా కాలనిర్ణయం చేయవచ్చు.

ఒక శతాబ్దిలోపలనే ప్రతిష్ఠితమైనా అపూర్వ యంత్రనిర్మాణంతో మూర్తిత్రయాత్మకమై, నిత్యమూ సహస్రాధిక యాత్రికుల్ని ఆకర్షిస్తూ అనేకవిధాల సౌకర్యాలతో విస్తరింపబడిన అన్నవర సత్యదేవుని దేవస్థాన వైభవము చూచినవారికి ఇది తిరుపతికి సోదరక్షేత్రం అనిపిస్తుంది.

శ్రీరుచిర రత్నశైలా
గారా! సద్భక్త హృదయకమల విహారా!
కారుణ్యామృతమయ కా
సారా! శ్రీ సత్యదేవ! జగదాధారా!

రాజమహేంద్రవరం

శ్రీ ఉమాకోటిలింగేశ్వర స్వామి దేవస్థానము :

రాజమహేంద్రవరానికి ఉత్తరంగా గౌతమీ తీరస్థలమైన పురాతన క్షేత్రం కోటి లింగాలు త్రిపురాసుర యుద్ధంలో ఈశ్వరుడు కోటి మంది రాక్షసులను సంహరించాడు. వారికి బ్రహ్మ మోక్షం ప్రసాదించి లింగ రూపాలను ప్రసాదించి లింగ రూపాలను ఇచ్చాడు. ఈ ప్రదేశానికి శ్వేత పర్వతం అని పేరు. కోటి లింగాల క్షేత్రం ఇప్పటి పాత బ్రిడ్జి వరకూ వ్యాపించి ఉండేది. పూర్వం ఇక్కడి కోటి లింగాలలో ఒక దాన్ని కాకాసురుడు వాయస రూపంలో వచ్చి తీసుకొనిపోయి కాశీలో ప్రతిష్ఠించాడని చెపుతారు. కాశీలో ఆ లింగం ఉన్న ప్రాంతాన్ని ఉత్తర కాశీ అంటారుట. కోటిలింగాల్లో ఒకటి తక్కువ కావడం వల్ల బ్రహ్మ, విష్ణువు నర్మదా బాణాన్ని తెచ్చి అక్కడ ప్రతిష్ఠ చేయడం వల్ల కోటిలింగాలు పూర్తి అయినవి. ఇక్కడ శ్రీ విద్యారణ్య స్వామిచే ప్రతిష్ఠింపబడిన శ్రీచక్ర సహిత రాజ రాజేశ్వరీ పీఠ భువనేశ్వరి దేవి ఆలయం ఉన్నది. కోటి లింగాల క్షేత్రం దగ్గర గోదావరి స్నానంచేసి, కోటిలింగేశ్వర స్వామిని, భువనేశ్వరి దేవిని, శ్రీ సీతారామస్వామిని సేవించడంవల్ల సమస్త పాప నివృత్తి అవుతుందని భక్తుల విశ్వాసం.

శ్రీ ఉమా మార్కండేయ స్వామి దేవస్థానము :

గౌతమీ తీరంలో రాజమహేంద్రవరానికి ముఖ్యమైన స్థానంలో ఉన్న ఆలయం-మార్కండేశ్వస్వామి వారిది. మృకండ మహర్షి కుమారుడయిన మార్కండేయుడు గోదావరీ తీరంలో తపస్సు చేసినట్లు, అపుడు ఈశ్వరారాధన నిమిత్తం, ఈ లింగాన్ని ప్రతిష్ఠించి మార్కండేయుడనే పేరు పెట్టినట్లు చెపుతారు. యమ పాశ బద్ధుడైన మార్కండేయుడు ఇక్కడి శివ లింగాన్ని ఆలింగనం చేసుకుని శరణు వేడి, ఈశ్వరుని వల్ల ఆయువు పొందడం కారణంగా, ఈ పేరు వచ్చిందని అంటారు. అపమృత్యుపరిహారమునకు, సంతాన ప్రాప్తికి పేరు పడ్డ ఈ స్వామిని నిత్యమూ భక్తులు సేవిస్తూ ఉంటారు. వేదశాస్త్ర పరిషత్తు వారు కృష్ణాష్టమినాడు అనేకులు వేదశాస్త్ర విద్వాంసులకు వార్షిక సత్కారాలు ఈ ఆలయ ముఖమండపంలో జరుపుతూ ఉంటారు.

శ్రీ కాళహస్తి

ఏ వేదంబు పఠించెలూత? భుజగంబే శాస్త్రమున్ జూచె? తా
నే విద్యాభ్యసనం బొనర్చెగరి? చెంచే మంత్రమూహించె? బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా! కావు; నీ పాదరసం
సేవాసక్తియె కాక; జంతుతతికిన్ శ్రీ కాళహస్తీశ్వరా !

శ్రీ మల్లికార్జున స్వామి ప్రాభవం ఎవరికీ వచ్చేది కాదు - కాని శ్రీ కాళహస్తీశ్వరస్వామిని తలచుకున్నప్పుడు-ఎన్ని జన్మలకైనా పుడితే తెనుగు దేశంలోనే పుట్టాలనిపిస్తుంది. ఈ స్వామి తియ్యదనమే వేఱు. ఇది కేవలం అడవి తేనె! యీ తేనె తియ్యదనమంత తెనుగు భాషలో ఒక్క ధూర్జటి మాటలలోకే సరాసరి వచ్చిందేమోనని అనిపిస్తుంది. ఈ సొత్తపినాటి దైవము తెనుగుజాతికి, తెనుగు భాషకూ ఏనాటి చుట్టమో!

మొగలేటి ఒడ్డున కొండదరిని కల్జువ్వి క్రీనీడలో ఒంటరిగా ఎప్పటి నుంచి యీ స్వామి ప్రొద్దులు పుచ్చుతున్నాడో! ఈ స్వామికి అసలు వేళా ప్రొద్దూ అనే ఆదర ఉన్నట్లే తోచదు.

పురావిదులు ఇలా చెబుతున్నారు. విశ్వామిత్రుడు పూనిన పగవల్ల వశిష్ఠ మహర్షి కుమారులు వంద మందీ పోయారు. కామక్రోధాలను జయించినా ఆ బ్రహ్మర్షికి శోకం తప్ప లేదు. పుత్ర శోకం భరించలేక ఆత్మహత్యకు ఎన్నో విధాల ప్రయత్నించినాడు. అన్ని ప్రయత్నాలు విఫలమైనాయి. చివరికి కొండ ఎక్కి క్రిందికి ఉరికాడు. భూదేవి ఆ మహర్షిని తన చేతితో పట్టుకొని "ఓ వెర్రివాడా! కొడుకులందరూ పోయిన దుఃఖం చావుతో తీరుతుందనుకున్నావా? ఇవన్నీ అవాంతర దుఃఖాలు, వీటన్నిటికీ మూలమైన మొదటి దుఃఖం జన్మ! అది తీరటానికి శివ ధ్యానం కంటే శరణ్యం లేదు. నీకు నిజంగా సంసారం మీద రోత కలిగితే పార్వతీ పతియైన మహాదేవుణ్ణి సేవించు! జీవన్ముక్తి చేకూరుతుంది" అని బుజ్జగించింది.

భూదేవి ఆదేశం వల్ల వసిష్ఠ మహర్షి నానావిధ వాసనాస్పదమైన తన హృదయ పద్మాన్ని శివునికర్పించి రాజయోగ నిష్ఠుడై మహాతపస్సు చేయడం మొదలు పెట్టాడు. అడవి ఏనుగులు తొండాలతో నీళ్లు తెచ్చి తమంతటతాము ఆ బ్రహ్మనిష్ఠుణ్ని స్నానం చేయించేవి, చమరీ మృగాలు

1170—3

తమ తోక కుచ్చులతో ఆయనకు వీచేవి. కోతులు పండ్లు తెచ్చి కానుకలిచ్చేవి. కిరాతాంగనలు పరిచర్యలు చేసేవారు. పోను పోను ఆయన తపోనిష్ఠ పరాకాష్ఠ వహించింది. ఏనుగు గున్నలు వచ్చి శిలా భూతమైన ఆయన శరీరం మీద ఒరిగి తమ గండ స్థలాలు ఒరిసికొనేవి. చందన వృక్షం మీద మాదిరిగా ఆయన శరీరం మీద పాములు తిరిగేవి. ఆయన జడల్లో గూళ్లు పెట్టుకొని పక్షులు కాపురం చేసేవి.

ఆ తపస్సు స్థాణునిలో కదలిక కలిగించింది. పంచముఖ సర్పాకారమై పశ్చిమాభి ముఖమైన పరమ శివలింగ రూపంలో ప్రసన్నుడై వరం వేడుమన్నాడు. వసిష్ఠ మహర్షి బ్రహ్మ విద్యను భిక్షగా అర్థించాడు. ఆ మహాలింగం మధ్యంలో నుంచి దక్షిణామూర్తి స్వరూపంలో ఆవిష్కరించి శివుడు వశిష్ఠ మహర్షికి బ్రహ్మ విద్యోపదేశం చేసి అంతర్హితుడైనాడు.

ఈ విధంగా శ్రీ కాళహస్తి జ్ఞాన క్షేత్రమై వెలసింది. పరమేశ్వర విరహం భరింపలేక పార్వతీదేవి కైలాసం నుండి ప్రమధ పరివారంతో కదలి వచ్చి జ్ఞాన ప్రసూనాంబయై స్వామి సన్నిధిలో నిలిచింది. ఆది దంపతులిలా వసిష్ఠాశ్రమంలో స్థిరపడిపోగా కైలాస పర్వతం తల్లిదండ్రులను వెదకికొంటూ వచ్చే తనయుని వలె దక్షిణాశకు తరలి వచ్చింది. కైలాసం తోడి స్నేహం వల్ల మేరువు కూడ సూర్య చంద్రులతో సహా దక్షిణానికి వచ్చి అచ్చట పార్వతీ పరమేశ్వరులకు విహార స్థానమై తూర్పు వైపున నిలిచింది. ఇలా సపరివారంగా పరమ శివుడు దక్షిణాశా కుటుంబియై పోయినాడు. కొంత కాలానికి అచ్చటికి లోపాముద్రతో సహా అగస్త్య మహర్షి వచ్చి దక్షిణ కైలాస దర్శనం చేసి అయిదు పడగలతోడి ఆ మహాలింగాన్ని అర్చించాడు. జ్ఞాన ప్రసూనాంబను సేవించాడు. అచ్చట పరివార దేవతలందరినీ కొలిచాడు. ఆ మహా స్థలంలో పుణ్య నదీ ప్రవాహమేదీ లేకపోవడం ఆయనకు విచారం కలిగించింది, పరమేశ్వరుణ్ణి ఉద్దేశించి తపస్సు చేసి ఒక పుణ్య నదిని ప్రవహింప చెయ్యాలని సంకల్పించి అక్కడకు నాలుగామడల దూరంలో ఉన్న ఒక పెద్ద కొండ మీదకు వెళ్లి తపస్సు మొదలు పెట్టాడు. పరమ శివుడు ప్రసన్నుడై బ్రహ్మతో ఆకాశ గంగను పంపించాడు. అది స్వర్ణ కాంతితో, మహా ధ్వనితో ఆకాశం నుండి దిగి "స్వర్ణముఖరి" అనే పేరుతో ఆ మహా క్షేత్రంలో ఉత్తర వాహినియై ప్రవహించింది.

పూర్వం బ్రహ్మ వాంఛననుసరించి సరస్వతి శత రూపయై ఆయనతో క్రీడించినందువలన అతివేలమైన వారి కామ ప్రవృత్తి వలన ముప్పది వేల మంది రాక్షసులు పుట్టి లోక కంటకులుగా పరిణమించారు. భూదేవి ఆక్రోశించింది. ఆ రాక్షసుల సంహారార్థమై బ్రహ్మ తన కోపంలో నుంచి ఉగ్రుడనే కుమారుణ్ణి సృష్టించాడు. ఆ ఉగ్రుడు తన అన్నలైన ఆ ముప్పది వేల రాక్షసులను సంహరించాడు. చివరకు పుత్రశోక దగ్ధుడైన బ్రహ్మ కోప వీక్షణ వల్ల ఆ ఉగ్రుడు కూడా భస్మమైపోయినందువల్ల బ్రహ్మకు చిత్త శాంతి లోపించి యీ మహాక్షేత్రానికి వచ్చి తపస్సు చేసి 'ఋభు'డనే జ్ఞానమయుడైన పుత్రుణ్ణి శివానుగ్రహం వల్ల పొందాడు. ఆ ఋభువు సనకాదులలో బ్రహ్మ విద్యా సంప్రదాయాన్ని విస్తరింపజేసినాడు. ఇదంతా ఆదియుగంలో కథ! కృత యుగంలో 'శ్రీ' అనే సాలిపురుగు, త్రేతాయుగంలో 'కాళ'మనే సర్పమూ, ద్వాపరయుగంలో 'హస్తి' యీ స్వామిని మహా నిష్ఠతో కొలిచారు. ఆ ముగ్గురినీ శివుడు తన లింగాకారములో కూర్చుకొని భక్తైక శరీరుడైనాడు. అగాథలిలా ఉన్నాయి.

కృతయుగంలో ఒక సాలెపురుగు తన పూర్వవాసనా విశేషంవల్ల స్వామిని సేవింపవచ్చి స్వర్ణముఖరీ జలార్ద్ర శరీరమై తన నాభినుండి వచ్చే దారాలతో స్వామికి గుళ్ళూ గోపురాలూ కట్టింది. ఆ దారాల గుడులు ప్రొద్దుట మంచులో తడిసి ముత్యాల గుడులై కొంత సేపటికి సూర్యకిరణాలు పడి నవరత్నాల గుడులై చిత్రంగా మెరుస్తూ ఉండేవి. శివునికి దాని భక్తిని పరీక్షించాలని ముచ్చట వేసింది. ఆదారాల కట్టడాలకు గర్భగుడిలోని దీపజ్వాల అంటుకొని ఒక్క క్షణంలో అవన్నీ పొగలో కలిసిపోయాయి. సాలెపురుగుకు మహా దుఃఖమూ మహాక్రోధమూ ఒక్కసారే వచ్చాయి. ఈ గుళ్ళు కట్టడానికి నాకు ఏన్నో యేళ్ళు పట్టింది. ఈ దీపం ఒక్క క్షణంలో కాల్చివేసింది. 'కుమ్మరికొక యేడాదీ, గుడియకు ఒక పెట్టూ, అనే సామెత అనుభవంలోకి వచ్చింది. అని ఆ దీపాన్ని మ్రింగబోయింది. శివుడు ప్రసన్నుడై దాని కోరిక ప్రకారం కైవల్యం అనుగ్రహించాడు. త్రేతాంతంలో ఒక పాము రోజూ పాతాళం నుండి దివ్య మాణిక్యాలు తెచ్చి ప్రాతఃకాలంలో శీతాంశుశేఖరుణ్ణి సేవిస్తూ వుండేది. ఇలా వుండగా ద్వాపర యుగం మొదలైంది. అప్పుడు ఒక యేనుగు అక్కడికి వచ్చింది. ఆ యేనుగు మొగలేటిలో రోజూ స్నానం చేసేది. కానలూ కోనలూ

కలయతిరిగేది. మూరేడు కొమ్మలూ తామరలూ కలువలూ తెచ్చేది. పాము పేర్చిన మణులన్నీ త్రోసివేసేది. తొండంతో తెచ్చిన నీళ్ళతో దక్షిణ కైలాస నాథునికి తనివితీరా అభిషేకంచేసి పూజచేసి వెళ్ళేది.

మరునాడు ప్రొద్దున్నే పాము పడగమీద రత్నాలతోవచ్చి క్రింటి రోజు తాను పూజించిన మణులన్నీ చెల్లాచెదురై పోవడమేకాక స్వామి శిరస్సు మీద వాటికి బదులు ముళ్ళ కంపలూ, తామరతూడులూ ఉండటం చూచి మహా వ్యసనపడిపోయింది. తన పూజ పాడుచేస్తుకొని ఎవడో తనకు ద్రోహం చేస్తున్నాడనుకొంది. తన దురదృష్టానికి విచారించింది నెమ్మదిగా ఏనుగు పెట్టినవన్నీ ప్రక్కకు నెట్టి మనస్సులో రోషమూ భక్తీనుల్లాడగా మణులతో స్వామిని పూజించి వెళ్ళింది. పాముది ప్రాతఃకాలార్చనా, ఏనుగు చేసేది ప్రాహ్లార్చనా కావడంవల్ల రెండూ ఒకసారి తారసిల్లేవికావు. ఒకదాని పూజ ఒకదానికి నచ్చలేదు. రెండింటికీ నానాటికీ వైరం పెరిగింది. ఒకనాడు పాము పగతీర్చుకోవటాన్కి సంకల్పించి ఏనుగు పెట్టిన మారేడు ప్రతిలో తామరతూడుల్లో అనిగి పొంచివుంది. మామూలుగా ఏనుగు తన వేళకువచ్చి నిన్న తాను చేసిన పూజ స్వామి శిరస్సుపై నిలిచి ఉన్నందుకు సంతోషించి నదికి స్నానానికి వెళ్ళింది. తన శత్రువు ఎవరో పాముకు అర్థమయింది. చేరవచ్చిన శత్రువు దూరమైపోయాడే! అని మారేడు పత్రి అడుగున పాము బుసలుకొడుతూ వుంది. ఆ కీడు కని సెట్టలేక పూజా ద్రవ్యాలతో ఏనుగువచ్చి నిర్మాల్యము తియ్యడానికి లింగం మీదికి తొండం చాచింది. ఆ అవకాశానికి పాము సంతోషించి తొండం రంధ్రంలోనుంచి దూరి ఏనుగు కుంభస్థలములో తిరగడం మొదలుపెట్టింది. ఆ బాధ భరించలేక ఏనుగు ఘీంకరించింది. నిలువలేక పరువులు పెట్టింది. కుంభస్థలాన్ని చెట్లకు వేచి రాచింది. మొగలేటి నీళ్ళు తొండంతో పీల్చి గట్టిగా పైకెగసింది. బాధ పోయే ఉపాయం తోచక చివరికి ఆ కొండకు వేచి తన కుంభస్థలాన్ని పగులకొట్టుకొంది. ఏనుగుతోపాటు పామూ చచ్చింది. ఆ రెండూ ప్రథమ గణాకారం తాల్చి స్వామిని స్తోత్రం చేశాయి. పరమేశ్వరుడా రెండింటికీ తమ తమ రూపాలతో సాయుజ్యం యిచ్చి తనలో కలిపికొని లింగాకారమైనాడు. ఆనాటి నుంచీ స్వామి శ్రీకాళహస్తీశ్వరుడైనాడు.

ఇవన్నీ ఏవో గాథలు కావు. శుద్ధ సత్వంలో జ్ఞానం వెలిగే లక్షణాన్ని వసిష్ఠుని కథ రూపిస్తున్నది. కామ క్రోధాలలో చిక్కుకున్న మనస్సు వాటి వినాశంవల్ల జ్ఞానంలో ఎలా లీనమవుతోందో బ్రహ్మకథ

చూపిస్తోంది. జ్ఞానం కర్మమలయాన్ని ఎలా దగ్ధం చేస్తోందో సాలి పురుగు కథ చిత్రిస్తోంది. పాము రజోగుణానికీ ఏనుగు తమోగుణానికీ ప్రతిరూపాలు రజస్సు తమస్సులో దూరి. తమస్సు రజస్సును ప్రసరించనీయక. చివరికి రెండూ ఎలా నశిస్తాయో యీ కథ ప్రదర్శిస్తోంది.

కలిలో భక్తిని మించే శరణ్యంలేదు. అది పరమ ప్రేమ రూపమయినది. దీనికి నిదర్శనమే కన్నప్ప కథ! ఈ పరమ ప్రేమలోని తియ్యదనాన్ని మాటలు చెప్పలేవు. ఆ తియ్యదనమంతా యీ అడవిబోయ కథలో తేనెపట్టులో తేనెలాగె వ్యాపించివుంది.

తొలి యుగాల్లో జ్ఞానమయమైన ఆ మహా లింగం కలిలో ఈ ఆటవికుణ్ణి ఆకర్షించి అతని గుండెలోని తియ్యదనంలో భక్తిమయ లింగమై కరిగిపోయింది.

అందువల్లనే మహాజ్ఞానులైన శంకర భగవత్పాదులిలా అన్నారు. "అడవి త్రోవలన్నీ త్రొక్కివచ్చిన ఆ చెప్పు శివుని ఒంటికి దుమ్ముతుడిచే కుంచె అయింది. పుక్కిటి నీరు పురహారునకు దివ్యాభిషేక జలమయ్యింది. కొంచెం రుచి చూచి మిగిల్చిన మాంస కబళం నవ్యాహారమయింది. అహో! భక్తికి అసాధ్యమేమున్నది? దేనినైనా ఎలాగైనా మారుస్తుంది. అడవి బోయను భక్తావతంసంగా చేసింది!"

సాలెపురుగుకీ పాముకీ ఏనుగుకీ నిజరూపంలో సాయుజ్యమిచ్చి శ్రీ కాళహస్తీశ్వరుడైనా కన్నప్ప పుక్కిటి నీటిలో మునిగిపోయిన తరువాత మళ్ళీ శివుడు శివుడై కాళహస్తిలో 'కన్నప్ప శివుడు'గా మిగిలిపోయాడు.

ముందు కన్నప్పకు పూజచేయనిదే కాళహస్తిలో శివుడు పూజ స్వీకరింపడు. జ్ఞానం భక్తిలో కరిగిపోయింది. కాళహస్తిలోని 'కన్నప్ప శివుడు' తెనుగు నేలకూ తెనుగు జాతికీ తెనుగు భాషకూ కాణాచి!

దీన్ని వాయులింగం అంటారు. దీనికి నిదర్శనంగా నివాళమైన గర్భగుడిలోని దీపం ఎప్పుడూ రెపరెపలాడుతూ వుంటుంది. చిదంబరంలో ఆకాశలింగమూ, అరుణాచలంలో తేజోలింగమూ, జాబికేశ్వరంలో జలలింగమూ, కంచిలో పృధ్వి లింగమూ వున్నాయి.

స్వర్ణముఖి ఒడ్డున కొండకు పడమటి వైపున ఈ ఆలయం వుంది. గుడిలోకి వెళ్ళటానికి రెండు పెద్ద గోపురాలున్నాయి. ప్రాకారంలో మలుపుతిరిగిన తరువాత అక్కడ భూగర్భంలో ఒక విఘ్నేశ్వరుడి గుడివుంది. ఈయనను పాతాళ గణపతి అంటారు. నేలమట్టానికి 30 అడుగుల లోతున

ఈ గుడి ప్రక్కన పారే స్వర్ణముఖికి సమతలంలో వున్నదిట! గుడిలో కన్నప్ప విగ్రహాలు, వినాయకుని విగ్రహాలు అరవత్తుమూరు విగ్రహాలూ అతి ప్రాచీనమైనవీ, అందమైనవీ. గుడిద్వారం దక్షిణాభిముఖంగా వుంటుంది. ఇది దక్షిణామూర్తి ఆలయం అనటానికి నిదర్శనం లోపలికి ప్రవేశించేటప్పుడు పడమరగా విఘ్నేశ్వరుడున్నాడు. అక్కడే అప్పర్, సుందరర్, మాణిక్యవాచకర్ అనే నాయనార్ల విగ్రహాలున్నాయి. వారు ముగ్గురూ పూర్వం యీ క్షేత్రాన్ని సేవించారు. దీనికి తరువాత శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధి వస్తుంది. స్వామికెదురుగా కన్నప్ప విగ్రహం వుంటుంది. ఎన్నో అపూర్వమైన గణపతి విగ్రహాలున్నాయి. ఒక సహస్ర లింగేశ్వరస్వామి కూడా వున్నాడు.

శ్రీకాళహస్తి లింగం ఎత్తైన పీఠం మీద వుంటుంది. లింగం దంతాలతో కూడిన ఏనుగు తుండంవలె వుంటుంది. లింగం క్రిందిభాగంలో సాలీడు కనిపిస్తుంది. పై నుండి చూస్తే లింగం అయిదు పడగల పామువలె కనిపిస్తుంది. స్వామి పశ్చిమాభిముఖంగా తిరుపతి కొండల వైపు చూస్తూ వుంటాడు. స్వామికి ప్రక్కన అమ్మవారు జ్ఞానప్రసూనాంబ తూర్పు ముఖమై గోడవలె ఎదురుగా ఉన్న శ్రీకాళహస్తి కొండవంక చూస్తూ వుంటుంది. దీనికి కారణం యిలా చెబుతారు. అసలు తిరుపతి కొండల మీద ఉన్న దైవం బాలాత్రిపురసుందరి అని (బాలాజీ) స్వామి దృష్టి అక్కడ లగ్నమై ఉన్నందువల్ల అమ్మవారు అలిగి తూర్పువైపున కొండవంక చూస్తుందని—దీనికి తగినట్లు శ్రీ జ్ఞానప్రసూనాంబను తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి సోదరి అని అంటారు.

ఈ క్షేత్ర సన్నివేశాన్ని ధూర్జటి ఇలా రూపొందించారు.

'శమనాశారజతాద్రిమేను, శిరమాశంభుండు, దుర్గాద్రి నీ
లమహాద్రుల్ చనుదోయి, పొన్మఖరి లీలావేణి, బాహుత్రుములిం
ద్ర మయూరాఖ్య సహస్రలింగ పద భారద్వాజ తీర్థమ్ములై
యమరున్ ముక్తి వధూటి కన్నగిరి మాహాత్మ్యంబు సామాన్యమే!

ఆలయ ప్రాకారణంలోనే వున్న సూర్యపుష్కరిణి, చంద్రపుష్కరిణి కాక యీ కాళహస్తి కొండల్లో పన్నెండు తీర్థాలున్నాయి. అవి సుప్రసిద్ధములైనవి (1) హరిహర తీర్థము— ఇది కాళహస్తికి మూడు మైళ్ళలో వుంది 2) కళింగ తీర్థము—ఇది అయిదు మైళ్ళలో తూర్పున వుంది (3) సహస్రలింగ తీర్థము—ఇది నైరుతి మూలగా అయిదున్నర

మైళ్ళలో వుంది (4) మార్కండేయ తీర్థము—ఇది సహస్రలింగ తీర్థానికి ఆరున్నర మైళ్ళలో వుంది (5) మయూర తీర్థం—మయూర మహర్షి పేరిటిది (6) భారద్వాజ తీర్థము—ఇది ఆలయానికి మూడున్నర మైళ్లలో వుంది (7) నారద తీర్థం—ఊరి మధ్యలో వుంది (8) సరస్వతీ తీర్థం—ఈతీర్థం ప్రసాదంగా 40 రోజులు సేవిస్తే మూగవారికి మాటలు వస్తాయి. (9) శుక తీర్థము—శుకమహర్షి పేరిటిది (10) బ్రహ్మతీర్థం (11) మణికర్ణికా తీర్థం (12) తత్త్వప్రకాశ తీర్థము.

ఇచ్చట గుడి ఎప్పటినుంచి వున్నదో తెలియదు. స్కాందపురాణంలో శ్రీకాళహస్తి ప్రసక్తి వుంది. అర్జునుడు తీర్థయాత్రా సందర్భంగా వచ్చి ఈ క్షేత్రం సందర్శించి భారద్వాజ మహర్షి వల్ల ఈ స్థల మహిమను, స్వర్ణముఖీ మహిమను విన్నట్లు అందులో వున్నది.

చరిత్ర దృష్ట్యా నక్కీరుని కావ్యంలో దీని ప్రసక్తి వుంది. నక్కీరుడనే తమిళ కవి క్రీస్తుకు పూర్వం మూడవ శతాబ్దిలో తమిళ 'సంగం' కవులలో సుప్రసిద్ధుడు. అతడీ స్వామి అనుగ్రహం వల్ల వ్యాధి నిర్ముక్తుడై యీ క్షేత్రాన్ని దక్షిణ కైలాసంగా కీర్తించాడు, ప్రాచీన తమిళ శివభక్తులు సంబందర్, అప్పర్, మాణిక్కవాసగర్, సుందరమూర్తి అనే నలుగురూ ఈ క్షేత్రాన్ని దర్శించి తమ కృతుల్లో కీర్తించారు. ఆదిశంకరులు తను శివానందలహరిలో కన్నప్పను కీర్తించటాన్ని పట్టి వారు యీ క్షేత్రాన్ని సేవించినట్లు తోస్తుంది.

శ్రీకాళహస్తి ఆలయాన్ని కొండదరిని పల్లవరాజులూ, తరువాత తొండమాను చక్రవర్తి కట్టించాడు. ఆలయ ప్రాంగణంలో దక్షిణ ముఖంగావున్న గాలిగోపురాన్ని కులోత్తుంగ చోళుడు క్రీ.శ. 12 శతాబ్దిలో కట్టించాడు. క్రీ.శ. 12 శతాబ్దిలో వీరనరసింహ యాదవరాజు, ఇప్పటి ఆలయం వెలుపలి ప్రాకారాలను నాలుగు గోపురాలతో నిర్మించాడు. తరువాత విజయనగర రాజులు ఆలయంలోని పెక్కు మంటపాలను కట్టించారు. క్రీ.శ. 1516 లోని శ్రీకృష్ణదేవరాయల శాసనాన్ని పట్టి ఆయన నూరు స్తంభాల మంటపాన్ని పడమర నుంచి తూర్పు ముఖంగా వున్న గాలిగోపురాన్ని కట్టించినట్లు తెలుస్తోంది. అచ్యుత దేవరాయలు క్రీ.శ. 1529 లో శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధిలో ప్రప్రథమంగా తన పట్టాభిషేకోత్సవాన్ని జరిపించికొని తరువాత విజయనగర రాజధానిలో జరిపించినట్లు తెలుస్తోంది. తరువాత మహాశివభక్తులుగా సుప్రసిద్ధులైన దేవకోట్టై నోటు కొట్టై చెట్టియారులు క్రీ.శ. 1912లో 9 లక్షలు వ్యయించి బ్రహ్మాండమైన ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ స్వయంభూలింగాన్ని

ఇంతవరకూ మానవహస్తం స్పృశించలేదు. అభిషేకం పచ్చ కర్పూరం కలిపిన జలంతో, పాలతో, పంచామృతంతో జరుగుతుంది. ఆ అభిషేకమైనా భారద్వాజ గోత్రులూ ఆపస్తంబసూత్రులూ అయి విధివిహితమైన ప్రత్యేక దీక్షను పొందిన ఆలయార్చకులే చెయ్యాలి! గంధపుష్పాక్షతాదులు ఉత్సవ విగ్రహానికే. మూలవిరాట్టుకు కాదు.

ప్రధానోత్సవం మహాశివరాత్రి 10 రోజులు జరుగుతుంది. ఉత్సవం అయిదవ రోజున శివరాత్రి వస్తుంది. అప్పుడు యాత్రికులు స్వర్ణముఖిలో స్నానం చేసి ఉపవసించి రాత్రి జాగారం చేస్తారు. ఇంకొక మహోత్సవం కనుము నాడు జరుగుతుంది. అప్పుడు స్వామిని ఇరవై మైళ్ళ చుట్టుగల కొండ చుట్టూ ఊరేగిస్తారు. ఈ గిరి ప్రదక్షిణం ఏటా రెండుసార్లు జరుగుతుంది. సంక్రాంతికీ, శివరాత్రికీ. దీన్ని గూర్చి ఇలా చెబుతున్నారు. కనుము నాడు జరిగే మొదటి గిరి ప్రదక్షిణంలో స్వామి తన పెళ్ళికి సర్వ దేవతలనీ పిలవటానికి వెడుతున్నాడనీ — శివరాత్రి మరునాడు జరిగే ప్రదక్షిణం వారందరినీ స్వస్థానాల్లో దిగబెట్టడానికనీ బహు పురాణప్రసిద్ధమై అతి ప్రాచీన చరిత్రగల యీ క్షేత్రం సుప్రసిద్ధులైన నాయనార్ల చేత మహాకవుల చేత గానం చెయ్యబడింది. ఇది తిరుపతికి ముప్పై మైళ్ళ దూరంలో రేణిగుంట–తిరుపతి రైలుమార్గంలో వుంది. యాత్రికుల సౌకర్యాలకు దేవస్థానం సత్రాలు మొదలైనవన్నీ వున్నాయి. ప్రాచీనమైన ఈ ప్రసిద్ధక్షేత్రం నేటికీ వేలకొలదీ యాత్రికులనూ భక్తులనూ ఆకర్షిస్తోంది.



శ్రీశైలం దేవాలయం

1170—4

శ్రీశైలం

మల్లికా మాలికా మస్తకాభరణ !
మల్లికార్జున దేవ: మామేవవాహి!,
సిరిగిరి మల్లన్న శరణన్నం జాలు
పరమ పాతక కోట్లు భస్మమై పోలు!

దక్షిణ భారతము మధ్యలో నెలకొనివున్న పరమ ప్రాచీనమైన యీ మహాక్షేత్రము ఆంధ్ర కర్ణాటక తమిళ మహారాష్ట్ర దేశ ప్రజలకు అనాది కాలము నుండి యాత్రాస్థలమై వున్నది. ఉత్తర భారతములో గంగ ఒడ్డున వారాణాసియందు నెలకొనిన శ్రీ విశ్వేశ్వర మహాలింగమునకు ప్రతి, శ్రీ మల్లికార్జున మహాలింగము! 'స్పర్శవేదుల రాశి, ప్రత్యక్షకాశి!' అని ఈ క్షేత్రము కీర్తింపబడినది.

ఇది- "కరువు గట్టిన మహాకాశంబు! శ్రుతుల శిరము! ఘనీభవించిన పరంజ్యోతి! చలనంబులేని విజ్ఞానాబ్ధి! ముద్దగించిన దివ్యామృతమ్ము!" అని పాల్కురికి సోమనాథుని చేత గానం చేయబడిది! అట్టి ఈ శ్రీశైల శిఖరం మీద త్రిలోక విఖ్యాత యశః ప్రపూర్తియై శ్రీ స్వయం భూలింగ చక్రవర్తియై శ్రీమన్ మల్లికార్జున మహాలింగమూర్తి వెలుగుతున్నాడు!

ఇప్పటి ప్రయాణ సౌకర్యాలు ఏమీలేని ఆ వెనకటి రోజుల్లో కొండలలో, అడవులలో కాలినడకన మహారాష్ట్రం నుండి కన్నడదేశం నుండి తమిళ దేశం నుండి తెనుగు దేశం నుండి మహా శివరాత్రికి శ్రీశైల శిఖర దర్శనార్థమై తమ తమ భాషల్లో పాటలు పాడుకుటూ భక్తి పరవశులై వచ్చే లక్షలాది యాత్రికులను తలచుకొంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది! అది ఒక మహానుభూతి! ఆ మహానుభూతిని పొందే అవకాశం ఆధునిక ప్రయాణ సౌకర్యాల వల్ల నేటి తరాలకు లేకపోయిందికదా అని ఒకప్పుడు విచారం కూడా కలుగుతుంది. పాల్కురికి సోమనాథ కవి తన పండితారాధ్య చరిత్రంలోని పర్వత ప్రకరణం ద్వారా ఆ శ్రీశైల యాత్ర మహానుభవాన్ని ఆంధ్రజాతికి శాశ్వతమైన దానిగా చేసి పెట్టాడు. పర్వత ప్రకరణం చదువుతూ వుంటే అది మానసిక యాత్రకు కట్టడమే గాదు. తెనుగుజాతి పుట్టినప్పటినుండీ ఎన్నో తరాల నుండీ మనమందరమూ ఆ

యాత్ర చేస్తున్నట్లే అనిపిస్తుంది. అది ఒక చలన చిత్రాన్ని చూస్తున్నట్లే అనిపిస్తుంది. అది మల్లికార్జున స్వామి మహిమో, పాల్కురికి కవితా మహిమో మనం తెలిసికోలేము.

తెనుగు దేశం నుండి కన్నడ దేశానికి వెడుతూ వున్న మల్లికార్జున పండితుని చూపునకు శ్రీశైలం, శ్రీశైలం, అంతా ఒక దివ్య లింగాకారమై కనబడింది! శ్రీశైల ప్రాకృతులకు శిలానికరంగా కనిపిస్తూంది. సుకృతులకు లింగనికరమై కనిపిస్తుంది. అని పురాణ ప్రసిద్ధి! అలా పర్వతాన్ని చూస్తూవున్న పండితునకు ఆ క్షణంలో ఆయన చూపులే అభిషేక జలాలు అయినాయి. అవే శ్రీచందనానువేపం అయినాయి. అవే పూవులైనాయి. అవే ధూపధూమములై అల్లుకున్నాయి. అవ్వే నివ్వాళులై వెలిగాయి. అవే నైవేద్యం అయినాయి అవే పుష్పాంజలులైనాయి!! ఆయన ఇలా తన చూపులతోనే శివపూజ నిర్వర్తించాడట!

అలా కన్నులారా ఆ కొండవంక చూస్తూ పండితుడు తన శిష్యుడు దోనమహారాజును పిలిచి నీవు వెళ్ళి శ్రీమల్లికార్జున స్వామిని సేవించి భక్తులకు పండుగలు చేసి-అచ్చటి శివరాత్రి జాగారంచేసి-గిరి ప్రదక్షిణంచేసి మా వ్రత సమాప్తిని చెయ్యవలసిందని ఆదేశించాడు. దోనయ్య ప్రార్థనపై పండితుడు శ్రీశైలోత్పత్తిని యిలా సంకీర్తనం చేశాడు.

అనాదియుగంలో శిలాదుడనే ఋషి మహా తపస్సు చేసి శివుణ్ని మెప్పించి శివభక్తి పరిపూర్ణులైన కొడుకులు ఇద్దరిని తనకు ప్రసాదించమని ప్రార్థించినాడు.

నిత్యుడు, నిర్మలుడు, ధర్మదేవతా స్వరూపమూ అయిన నందీశ్వరుణ్ణి అగ్రనందనుణ్ణిగా శిలాదునకు శివుడు ప్రసాదించాడు. ఆ నందీశ్వరుడు అతి ఘోరమైన తపస్సు చేసి శివుణ్ణి మెప్పించి ద్వితీయ శంభుడై, ఆ శివునకు వాహనమై తనకు సర్వజ్ఞత్వము శైవాగమ విరచన శక్తి, ప్రమథాధిపత్యమూ. వరములుగా పొంది తమో విరహితుడై లోకంలో ధర్మదేవతా స్వరూపంతో నిత్యుడై వెలుగుతున్నాడు.

శివుడు శిలాదునకు రెండవ కుమారుడిగా పర్వతుడిని ప్రసాదించాడు. ఆ పర్వతుడు సర్వజ్ఞుడు, కలియుగ సదాశివుడు! లింగోత్తమాంగుడు, సకల ముముక్షువులకూ శరణ్యుడు. చతుర్దశ భువన వరేణ్యుడు! ఆయన తపస్సుకు ఉద్యుక్తుడై పూర్వ ఋషులు చేసిన తపస్సులను విచారించాడు. వారిలో పర్ణాదులూ, జలాదులూ, శిలాదులూ. కణాదులూ కనిపించారు. పర్వతుని దృష్టిలో-మేకలూ, చెట్లూ, పావురాలూ, చీమలూ మొదలైన

జీవరాసులకంటె ఆ ఋషీశ్వరుల తపస్సులో విశేషం ఏమీ కానరాలేదు. అందువల్ల తాను ఇంతకుపూర్వం ఎవ్వరూ చేయని నిరాహార వ్రతాన్ని స్వీకరించి 'పంచాగ్నిమధ్యము', మొదలైన మహా ఘోరతపస్సులన్నీ చెయ్యటం మొదలుపెట్టాడు. ఆవిధమైన తపస్సు చూచి ప్రమథులందరూ నివ్వెరపోయారు. దేవతాలంతా ఇది చాలా ఆశ్చర్యమన్నారు. రాక్షసు లిది చాలా చోద్యం అన్నారు. సనకాదు లిది అనుపమానమన్నారు. పరమ. మునులంతా ఇటువంటి తపస్సు చూడలేదంటే చూడలేదన్నారు. ఆ తపస్సుకి సముద్రాలు సంక్షోభించాయి. బడబాగ్ని ప్రజ్వరిల్లింది. చుక్కలు రాలాయి. ఆకాశం నేలమీద కొరిగింది, అన్ని లోకాల్లో పెద్ద కలవరం పుట్టింది. అప్పుడు అంతకొంతకంతైన శివుడు "మెచ్చితి మెచ్చితి! నీకు వరము లిచ్చెద!!" అంటూ పర్వతుని ఎదుట నిలిచాడు. అప్పుడు హృదయంలో వున్న పరమ శివుణ్ణి తన ఎదుట చూస్తూ బాష్ప రోమాంచ గద్గదములే తనకు అలంకారాలుగా అతను 'పర్వతాష్టకం' అనే స్తోత్రంతో స్తుతించి ఇలా ప్రార్థించాడు.

స్వామీ! నన్నిలా వున్న రీతిగానే ఒక కొండగా చేసి వైచి నా శిఖరం మీద దివ్య లింగాకారమై యెప్పుడూ నీవుండడమే!! అన్నాడు. నీకు కొండలంటే ఇష్టమే కానీ నేనెలా ఒప్పుకోను-కైలాసంమీద నీవు ప్రమథ గణాలతో వున్నట్లు వుంటే కాదు-మేరువు మీద దేవగణాలతో వున్నట్లు వుంటే కాదు-సర్వ జీవులలో 'అణోరణీయాన్' అన్నట్లుంటే కాదు - సనాదుల హృదయాంతరాళాల్లో వున్నట్లు కాదు. వశిష్ఠ గౌతమాగస్త్యాది పాశుపతుల సజ్జలలో వున్నట్లు కాదు-ఎప్పుడూ నా శిరస్సే నీకు దివ్య పీఠంగా-అవినాభావ నిత్య సంబంధమైన లింగాకార సన్నిధిగా వుండాలి!

"పర్వతః పాణి పాదంతః" అని శృతులు నిరూపించినట్లు నేను పర్వతాకారమై వున్నా - నా శరీరమంతా శిరస్సై నిన్ను ధరిస్తూ వుండాలి! నా శరీరమంతా కన్నులై నిన్ను చూస్తూ వుండాలి! శరీరమంతా జిహ్వలై నిన్ను స్తుతిస్తూ వుండాలి! నా శరీరమంతా చేతులై నిన్ను పూజిస్తూ వుండాలి! నా శరీరమంతా మనస్సై నిన్ను తలుస్తూ వుండాలి!

నా శిరస్సుమీద కైలాసాది సమస్త పుణ్య పర్వతములూ గంగాది సర్వ పుణ్యనది తీర్థములూ, ఎప్పుడూ మూర్తిమంతములై వుండాలి! మరియు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాది సత్కులజులైనా, దుష్కులజులైనా, మానవేతరులైనా సరే, నా కొండ మెట్టినంతనే వారి పురాకృత ఘోర కర్మములూ, పాతకకోట్లూ హరించి వారివారి అభీప్సిత సిద్ధులను

కరుణించాలి! ఇలా ఇస్తేనే ఇవ్వు! ఇంకే వరాలు నాకు వద్దు! కరుణింపు! కరుణింపు! కరుణింపు! మని ముమ్మాటికీ శివుని చేత వరముగు పొంది పర్వతాకారంలా మారిపోయాడు. శివుడు ఆ పర్వత శృంగోత్తమాంగమే తనకు పీఠంగా స్వయంభూలింగాకారమై వెలిశాడు! మూర్తిమంతమైన సర్వ పుణ్య పర్వతములూ, సకల పుణ్యస్థలములూ సకల తీర్థములూ సర్వ నదులూ సకల పుణ్య వనములూ సకల పుణ్య లోకములు ఆ గిరి శిఖరంమీద వెలిశాయి! ప్రముఖులందరూ ఇంక మాకిదే క్రీడాస్థానం! ఇదే ప్రత్యక్ష కైలాసం అన్నారు.

'చకిత మభి ధత్తే శ్రుతి' అని—'ఏనమేతన్ని బోధత'! అనీ—'అత్యతిష్ఠ ద్దశాంగుళం' అనీ—'స్మర్యతేన చదృశ్యతే' అనీ—బ్రహ్మాదులకు కూడ తెలియశక్యం కాని పరమేశ్వర స్వరూపం పర్వతుని కారణంగా సకల జీవ కోట్లకూ దివ్యలింగ స్వరూపంతో కరతలామలకమై కానవచ్చింది!

ఈ క్షేత్రానికి నాలుగు ద్వారాలు. త్రిపురాంతకం తూర్పుద్వారం. సిద్ధవటం దక్షిణ ద్వారం. అలంపురం పడమటి ద్వారం. మహేశ్వరం ఉత్తర ద్వారం. పూర్వం ఆంధ్ర ద్రవిడ కర్ణాట మహారాష్ట్ర దేశాల ప్రజలు కాలినడకన శ్రీశైలానికి వచ్చేటప్పుడు వరుసగా ఈ ద్వారాలలో నుంచి వచ్చేవారు. ఈ నాలుగూ వరుసగా తత్పురుష, అఘోర, సద్యోజాత, వామదేవ ముఖాలుగా శ్రీశైలం ఈశాన్య ముఖమై పరమ శివ స్వరూపం ఇలా ఆవిష్కరించిందంటారు. ఈ నాలుగుద్వారాలు కాక పక్ష ద్వారాలు ఇంకొక నాలుగున్నాయి. ఎనిమిది శిఖరాలు! పదహారు గవాక్షాలు! ప్రతి శిఖరంలోనూ మూడేసి పుణ్య తీర్థాలూ, శక్తులూ, అసంఖ్యాకములైన లింగములూ, స్పర్శవేదులూ, విభూతి పర్వతములూ, బిల్వ వనములూ, రుద్రాక్ష కాననములూ, సూర్యతాళ వనులూ, చంద్రతాళ వనులూ, నక్షత్రతాళవనులూ, తృణజ్యోతిస్సులూ, కాష్ఠ జ్యోతిస్సులూ, సంజీవినులూ, సాధకులకు అభీష్టప్రదములై వున్నాయంటారు.

తూర్పు ద్వారమైన త్రిపురాంతకంలో త్రిపురాంతకేశ్వరుడున్నాడు. ఇక్కడ శిఖరం వైఢూర్యమయం. తీర్థములు వరుణ, భారతీ, చారుఘోష. ఇక్కడ ఇంద్రుడుంటాడు.

ఆగ్నేయంలో స్కంద సోమేశ్వరం వుంది. అక్కడ కుమారస్వామి వుంటాడు. అక్కడ స్వర్ణమయమైన శిఖరం. తీర్థములు విచిత్ర, జాహ్నవి, తామ్ర అనేవి—

దక్షిణ ద్వారం సిద్ధవటం, అక్కడే ఛప్పగిరి వుంది. సిద్ధులూ కింపురుషులూ వుంటారు. శిఖరం విద్రుమమయం. తీర్థములు శుక్ల, క్షేమ, ఉత్సవ అనేవి.

నిర్వతి దిశలో అహోబలం వుంది. అక్కడ విష్ణువుంటాడు. శిఖరం మరకత మణిమయం. గోమతి, మంగళ, కీర్తి. అనేవి తీర్థాలు.

పడమర బ్రహ్మేశ్వరం వుంది (దీన్నే అలంపురం అంటారు). ఇక్కడ బ్రహ్మ వుంటాడు. శిఖరం ఇంద్రనీలమయం. భద్ర, విపుల, రమ్య అనేవి తీర్థాలు,

వాయవ్య దిశలో నంది మండలం వుంది (మహానంది) అక్కడ నందీశ్వరుడుంటాడు. శిఖరం వజ్రమయం, జయ, విజయ, జ్యోతి అనేవి తీర్థాలు. ఉత్తరాన మహేశ్వరం వుంది. అచ్చట ఊర్వశి మొదలైన అప్సరస లుంటారు. శిఖరం మణిమయం. అర్చిష్మతి, పృథువు, వక్ర అనేవి తీర్థాలు.

ఈశాన్య దిశలో ఏలేశ్వరం వుంది. ఇక్కడ యీశానుడుంటాడు. శిఖరం రజత మయం. ఆనంద, నందిని, శుక్ల అనేవి తీర్థాలు. ఈ క్షేత్ర మంతా ముప్ఫయి ఆమడల కైవారం. పర్వతం ఎత్తు ఒక ఆమడ అని పురాణాలు చెపుతున్నాయి. కేదారంలో స్నానంవల్ల, కాశీలో మరణం వల్ల, శ్రీశైలంలో శిఖర దర్శన మాత్రం చేత నే ముక్తి! "శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అని పురాణ ప్రసిద్ధి! పూర్వం వసుమతి అనే మునికన్య బ్రహ్మనుగూర్చి తపస్సుచేసి "శ్రీ" అనే పేరు తనకు వరంగా పొందింది. ఆ "శ్రీ" ఈ పర్వతం మీద ఎప్పుడు శివుని సేవిస్తూ ఉన్నందువల్ల దీనికి "శ్రీగిరి" అని పేరు వచ్చిందంటారు. భ్రమర రూపాన్ని ధరించి "అరుణు"డనే రాక్షసుని సంహరించినందువల్ల ఇక్కడి అమ్మవారు "భ్రమరాంబ" అయింది. ఇది అష్టాదశ శక్తి పీఠముల్లో రెండవది అంటారు.

స్వామికి "మల్లికార్జును"డనే పేరు—ఈ క్షేత్రమహిమను శివుడు పార్వతీదేవికి చెప్పేనాటికే వుంది. ఆ వెనుకటి యుగాల్లో ఎప్పుడో చంద్రగుప్తుడనే చంద్రవంశపురాజు వుండేవాడు (గుప్త వంశంవాడు కాదు). ఆ రాజు కూతురు చంద్రవతి! పరమ పుణ్యాత్మురాలు. ప్రతి రోజు చెలికత్తెతో వచ్చి స్వామివారిని సేవిస్తూ వుండేది. ఒకనాడు ఆమె మనస్సు పొంగి స్వామి సాన్నిధ్యంలో పరవశురాలై సకల ప్రాణి సమ్మోహనమైన సంగీతం పాడింది. పార్వతీ సహితుడై పరమేశ్వరుడు ఆ నాద సముద్రంలో కరిగిపోయి ప్రసన్నుడై చంద్రవతిని "నీకేమి కావాలో కోరు

కొమ్మన్నాడు. ఆమె 'ఇప్పుడు నేను మీ శిరస్సుమీద ఉంచిన మల్లెపూల దండ ఎప్పుడూ వాడకుండా ఇలాగే ఉండాలని' కోరింది. గంగా తరంగాలకు నెలవంకకు మధ్యగా ఆ మల్లెపూదండను స్వామి ధరించాడు. గంగాతరంగ డిండీరపాండురమైన ఆ మల్లెపూదండ వెలుగుల్లో స్వామి శరీరం అంతా మెరిసిపోయింది! అప్పటినుంచి "మల్లికార్జును" డయినాడు.

అభ్యంతర తీర్థాలలో భ్రూమధ్యంలో వారణాసి వుంటుందనీ శీర్ష స్థానంలో శ్రీశైలం వుంటుందనీ కాశీఖండం చెబుతోంది.

శ్రీ శంకర భగవత్పాదులు శ్రీశైలంలో కొన్నాళ్ళుండి తపస్సు చేశారనీ శివానందలహరి ఇక్కడే రచించారనీ తెలుస్తూంది.

"సంధ్యారంభ విజృంభితం శ్రుతి శిరస్థానంత రాధిష్ఠితం
సప్రేమ భ్రమరాభిరామ సకృత్సద్వాసనా శోభితం
భోగీంద్రాభరణం సమస్త సుమనః పూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం శివా లింగితమ్॥

అని మల్లెపూవుతో మనోహరంగా మల్లికార్జున మహాలింగానికీ అభేద కల్పనం చేసి చెప్పారు. సామాన్యంగా పూవు నాయికా, పుష్పంధయం నాయకుడూ, అవుతూ వుంటారు. ఇక్కడ నాయకుడైన "మల్లెపూవు"మీద నాయిక అయిన "భ్రమరి" వ్రాలింది! అయినా—తరువాతి శ్లోకంలో భగవత్పాదులు స్వామియొక్క "భ్రమరాధిప"త్వాన్ని మళ్ళీ ఇలా అనేక విధాల సమర్థించారు.

"భృంగిచ్ఛాటననోత్కటః కరిమద గ్రాహీ స్ఫురన్మాధవా
హ్లాదో నాదయుతో మహాసి తవపుః పంచేషుణాచాదృతః
సత్పక్షస్సుమనోవనేషు సపునస్సాక్షాన్మదీయే మనో
రాజీవే భ్రమరాధిపో విహరతాం శ్రీశైల వాసీ విభుః।

ఇచ్చటనే, వారు భ్రమరాంబాష్టకాన్ని కూడా రచించారు. శ్రీశైలప్రసక్తి మహాభారతం వన పర్వంలో ఇలా వుంది.

"శ్రీ పర్వతే మహాదేవో దేవ్యాసహా మహాద్యుతిః
న్యవసత్పరమ ప్రీతో బ్రహ్మా చ త్రిదశై స్సహా
తత్ర దేవహ్రదేస్నాత్వాశుచిః ప్రయతమానసః
అశ్వమేధ మవాప్నోతి కులంచైవ సముద్ధరేత్ ।

చంద్రగుప్తుని కూతురు ఈ పర్వతారణ్యాలలో స్వామిని ఆరాధించే నాటికి ఇక్కడ గుడి లేదంటారు. ఆమె ఒక మనఃక్లేశనంతో ఆవులమందతో ఒక గొల్లవానితోసహా వచ్చి ఇక్కడ వుండిపోయి శివుని సేవిస్తూ ఉండేదట. ఆమె ఆవుల్లో ఒక ఆవు తన పాలన్నీ ఒక శివలింగంమీద అభిషేకించటం. చూచి ఆ గొల్లవాడు ఆ విషయం ఆమెతో చెప్పాడనీ—ఒకనాడు ఆమె కూడా అది ప్రత్యక్షంగాచూచిందనీ, ఆరాత్రి స్వామిఆమెకు కలలోకనిపించి తనకు గుడి కట్టించమని చెప్పాడనీ, ఆమెయే మొట్టమొదటగా ఒక గుడి కట్టించిందనీ జనశ్రుతి. శ్రీశైల ప్రాకార శిల్పాలలో యీ గాథ రెండు శిలాశ్రేణులమీద చిత్రించబడి వుంది.

ఈ ఆలయాన్ని గురించి ఈ కొండల్లో నివసించే చెంచుజాతివారిలో ఒక గాథ వ్యాప్తిలో వుంది.

ఒకసారి పరమేశ్వరుడు ఈ శ్రీశైలం అడవుల్లోకి వేటాడటానికి వచ్చి ఒక అందమైన చెంచెతను చూచి వలచి పెళ్లి చేసుకున్నాడనీ-ఇద్దరూ అడవుల్లో కలిసి తిరుగుతూ వేటాడుతూ వుండేవారనీ అందుకనే నేటికీ యీ స్వామిని ఈ అడవి జాతుల్లో చెంచు మల్లయ్య అంటా నీ - ఈ గాధ కూడ ప్రాకారం మీద మనోహరంగా చెక్కబడివుంది. ఈ శిల్పంలో కిరాత వేషం లోవున్న శివుడు త్రిశూలంతో ఒక పులిని పొడుస్తున్నట్లు వుంది. శివుని వెంట ఆటవిక స్త్రీ వేషంలో చేతుల్లో బాణాలతో నాలుగు వేటకుక్కల మధ్య పార్వతి చిత్రించబడివుంది. దీనికి తగినట్లు నేటికీ ఇక్కడ చెంచులకు ఇక్కడి ఆలయంలో గర్భగుడిలోకి కూడ స్వేచ్ఛగా ప్రవేశం వుండటం గమనించదగిన విషయం. శివరాత్రి ఉత్సవంలోకి రథం లాగేది వీళ్లే! ఈ ఆలయంలో వీళ్లింకా ఎన్నో సేవలు చేస్తూ వుంటారు. శివరాత్రి ఉత్సవాల్లో యాత్రికులు పాతాళగంగ స్నానం చేసివచ్చి స్వామిని పూజించేటప్పుడు చెంచులు కూడ లోపలికి వెళ్లి పూజిస్తూ వుంటారు. ఇప్పటికీ వర్ణ భేదం స్త్రీపురుష భేదం లేకుండా అందరూ వెళ్ళి పాతాళగంగా జలాలతో స్వామికి అభిషేకం చెయ్యవచ్చును.

శ్రీశైల చరిత్ర బౌద్ధయుగంలో మహాయానానికి పూర్వం నుండి అంటే క్రీ.శ. 1 శతాబ్దం నుండి తెలియవస్తోంది. బౌద్ధ యాత్రికులు పాహియాన్, హ్యూయాన్ త్సాంగులు, నాగార్జునకొండతోపాటు కృష్ణ ఒడ్డునే వున్న శ్రీశైలాన్ని పేర్కొన్నారు.

బౌద్ధం పడిపోయిన పిమ్మట వేదమతం పునరుద్ధరింపబడినప్పటి నుండి అంటే ఆదిశంకరులనాటి నుండి శ్రీశైలం పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా,

శక్తి పీఠాల్లో ఒకటిగా. పరిగణింపబడుతున్నట్లు చరిత్రకారు లంటున్నారు. ఆ శక్తిని పూర్వం 'మాధవి' అనేవారట! తరువాత ఆమెకే 'భ్రమరాంబ' అనే వ్యవహారం వచ్చిందట!

బ్రాహ్మణులూ వీరశైవులు కూడా మల్లికార్జున స్వామిని 'స్వయంభూలింగమని' 'లింగ చక్రవర్తి' అనీ ఆరాధిస్తూ వుంటారు. ఇక్కడ ప్రసిద్ధమైన వీరశైవమఠం ఒకటి 'వీరశైవ సిద్ధి మఠమనీ' 'భిక్షావృత్తి మఠమనీ' ఉండేదనీ శాసనాల వల్ల తెలుస్తోంది.

14 శతాబ్దికి పూర్వపు శిలా శాసనాలేవీ ఈ ఆలయంలో భద్రపరుపబడిలేవు. వున్న వాటిలో కాకతి ప్రతాపరుద్రుని శాసనమే పాచీన తమం విజయనగర రాజులీ ఆలయానికి చాలా చేశారు. రెండవ హరిహరరాయలు క్రీ.శ. 1405 లో ఇక్కడ స్వామి ఆలయం ముందు ముఖ మంటపం కట్టించాడు. ప్రౌఢ దేవరాయలీ ఆలయాన్ని సందర్శించాడు సాళువ వంశజులు కూడా కొన్ని చెరువులు కట్టించారు. శ్రీకృష్ణ దేవరాయలీ ఆలయాన్ని సందర్శించి రథోత్సవం జరిగే వీధిలో రెండు వైపులా మందిర శ్రేణులను నిర్మించి సర్వ కర పరిహారంగా కొన్ని ఊళ్ళు సమర్పించి గుర్రాలకు, ఎడ్లకూ, గాడిదలకూ పన్ను లేకుండా చేశాడు. ఆయన సామంతుడు చంద్రశేఖర రాయలు నందిదీ, భృంగదీ, బంగారు ప్రతిమలు చేయించి ఆలయానికి సమర్పించాడు. 'శాంత లింగ' అనే సామంతుడు యాత్రికుల సౌకర్యానికి ఒక కాలువ త్రవ్వించి అనేక గ్రామాలు జంగములకు సమర్పించాడు. ఇతడు ముఖ మంటపాన్ని ద్వారాలనీ బాగు చేయించాడు. ఆలయానికి పాతాళగంగ రెండు మైళ్ళ దూరంలో వుంది. ఆలయం పాతాళ గంగాభిముఖంగా వుంటుంది. పాతాళ గంగ చుట్టూ అందమైన అడవులున్నాయి. ఆలయం తూర్పు వైపున నాగలూరి నుండి వచ్చే కాలిత్రోవ సరిగ్గా కొండ దిగువన పాతాళ గంగ యిసుకల దగ్గరకు వస్తుంది. ఇచ్చటి కృష్ణనే పాతాళ గంగ అంటారు. ఈ పాతాళ గంగ వద్దనే 'కర్మారి' అనే ఛాయ వుంది. దీన్ని 'కర్మారీశ్వర' మని కూడ అంటారు. శివరాత్రి పుణ్యసమయంలో పాతాళ గంగలో స్నానం చేసి శ్రీరుద్రపాదాభివందనం చేసి సాహసికులు ఈ కొండ చరియ మీది నుంచి క్రిందికి ఉరికి శరీర త్యాగం చేసేవారట! కొన్ని వేలమంది యాత్రికులలో అటువంటి సాహసికుడు ఒకడు ఉంటాడో ఉండడో! అటువంటిది పూర్వం ఇక్కడ ధనస్సు నుండి పుంఖాను పుంఖంగా వచ్చే బాణాల వలె పడిన దేహమూ, పడబోయే దేహమూ, పడుతూవున్న దేహమూగా ఎడ తెగకుండా యాత్రికులు పడేవారట. దీన్నే భృగు పతనం అంటారు.

ఆలయం దగ్గర నుంచి రెండు మైళ్లూ పాతాళగంగకు మెట్ల వరుసలున్నాయి. ఇవి కొండవీటిరెడ్డి రాజులు ప్రోలయ వేమారెడ్డి. ఆయన కుమారులు కట్టించినవని ఇచ్చటి శాసనాల వల్ల తెలుస్తోంది. ప్రోలవేమారెడ్డి కొడుకు అనవేమారెడ్డి 'వీరశిరోమంటపం' కట్టించాడు పూర్వం ప్రజలకు దైవికమైన అరిష్టం ఏదైనా సంభవించి నపుడు 'ఇది శాంతించినట్లయితే ఆత్మబలి ఇస్తాను' అని శపథం చేసే వారట! అటువంటి శపథం చేసిన వారినే 'వీరులు' అని అంటారు. వారి సంకల్ప శక్తివల్ల ప్రజలకు ఆ అరిష్టం శాంతించేది, ఆ వీరులు శ్రీశైలం వచ్చి శివరాత్రి పుణ్య సమయంలో ప్రతిజ్ఞానుసారంగా తమ శిరస్సు లిచ్చేవారట! అలా వీరులు తమ శిరస్సు లివ్వటానికి వీలుగా కట్టించిన మంటపమే వీరశిరోమంటపం! పూర్వం అటువంటి వీరులు ఎంత మంది వుండేవాడో! ప్రత్యేకించి వారికోసమై ఆ ప్రభువు ఒక మంటపమే కట్టించవలసి వచ్చింది!

పూర్వం జరిగినంత వైభవంగా ప్రస్తుతం ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు జరగటం లేదని ఇచ్చటి శాసనాలను పట్టే అనిపిస్తోంది. ఉత్సవం జరిగే రాత్రి నూరుగజాల పొడవుగల ఏక వస్త్రం ఆలయమందు ఉన్న పెద్ద నంది చుట్టూ చుట్టి విమానం మీద వున్న శిఖరానికి సరాసరి కడతారు. అంత మంది జనం అక్కడ ప్రతీక్షిస్తూ వుంటే ఎవరికీ తెలియకుండా ఎప్పుడు కడతారో తెలియ కుండా కడతారు. ఉత్సవాలకు ముందూ వెనకా కూడా ఇక్కడ చెంచులదే ప్రాధాన్యం! తరువాత ఒకటి రెండు నెలలకు భ్రమరాంబ ఉత్సవాలకు కన్నడదేశం నుండి జనసమూహం వస్తుంది. వీరిలో ఎక్కువ లింగాయతులు!

శ్రీశైలంలో ప్రాకార శిల్పాలు చాలా ముఖ్యమైనవి. భిక్షాటన లీల, గౌరీ కళ్యాణము, కిరాతార్జునీయమూ, మొదలైన వెన్నో శివ పురాణ గాథలు చెక్కబడివున్నాయి ఈ ఆలయంలో చాలా సుందరమైన నటరాజ స్వామి కంచు విగ్రహం ఒకటి వుంది. దాన్ని చూస్తే చాలు. ఎవరికైనా సరే భక్తి పుట్టుకు వస్తుంది. ప్రతిక్షణ ప్రవర్త మానములైన సృష్టి స్థితి లయాలకిది అద్భుతమైన రూపకల్పన. ఇంకొక శిల్పంలో దేవతా శిల్పియైన విశ్వకర్మ చిత్రించబడ్డాడు. ఆయన చేతిలో ఒక త్రాసు వుంటుంది. అందులో ఒక వైపున శివుడూ, ఇంకొక వైపున సమస్త దేవతలున్నూ! ఈ ప్రాకార శిల్పాలలో అతిప్రాచీనమైన మృగవ్యాధుని కథ ఒకటి చిత్రించ బడివుంది. అది శివరాత్రి మహిమ నిరూపిస్తూంది.

పూర్వం ఒక బోయవాడు అడవిలో వేటాడుతూ ఒక లేడిని గురిచూసి బాణం వేసి కొట్టాడు. ఆ లేడి శరీరంలో నుంచి బాణం దూసుకుపోయి

అచ్చటి పల్లవు నేలలో నిద్రపోతున్న ఒక పులి తలకు తగిలింది. ఉలిక్కిపడి పులి బోయవాని మీదికి ఉరికింది. వాడు భయభ్రాంతుడై పరుగెత్తుకు పోయి ఒక చెట్టు మీది కెక్కాడు. అది మారేడు చెట్టు! తల చుట్టూ కారుతున్న నెత్తురుతో పులి అక్కడికి వచ్చి ఆ చెట్టు మీద వున్న బోయ వాణ్ణి మాచి మండిపోతూ గాండ్రిస్తూ ఆ చెట్టు చుట్టూ తిరగటం ప్రారం భించింది. పులి చెట్టెక్కలేదు గదా! అరుస్తోంది ఉరిమురిమి చూస్తోంది. తోకతో చెట్టును కొడుతోంది! కొమ్మల మీదికి ఉరుకుతోంది. అక్కడ నుండి కదలటంలేదు. చెట్టు మీద వున్న బోయవాడికి ప్రాణభయంతో మతి పోయింది. పులి చెట్టెక్క లేదు గదా! అనే మాట గుర్తుకురాలేదు. "ఈ పులి ఎలాగూ వెళ్ళదు. ఉరికి చెట్టెక్కుతుంది! తన్ను పట్టుకుంటుంది! చీల్చి వేస్తుంది! తనకు చావు తప్పదు" అని బోయ ఏడవటం మొదలు పెట్టాడు. వాడి కన్నీళ్ళతో ఆ చెట్టు స్కంధం శివలింగంవలె తడిసిపోయింది. ఆనాడు శివరాత్రి. వాడు తోచక త్రుంచి వేస్తున్న మారేడు చిగుళ్ళు ఎడ తెగని పూజ అయింది. పులి క్రింద తిరుగుతూ వున్నందువల్ల వాడికి ఆహారానికి పోవటానికి వీలు లేక ఉపవాసమైంది. పీట పెట్టుకొని కూర్చున్న పులి వంక రెప్ప వాల్చ కుండా చూస్తున్నందు వల్ల వాడికి నిద్రలేదు. ఇలా తప్పని సరిగా సంభవించిన వాని పుణ్యానికి శివుడనుగ్రహించి బొందితో వాణ్ణి కైలాసానికి తీసుకు వెళ్ళాడు. పూర్వం పర్వతారణ్యాల మధ్య దుర్గముగా వుండి బహుప్రయాస సాధ్యమైన శ్రీశైలయాత్ర నేడు చాలా సులభమై పోయింది. ఇచ్చటికి కర్నూలు నుంచి గుంటూరు నుండి సరాసరి బస్సులున్నాయి. ఇటీవల దోరణాలనుండి వేసిన కొండ రోడ్డు సరాసరి ఆలయం ముందే దింపుతుంది. యాత్రికుల వసతి సౌకర్యాలకు కావలసినన్ని దేవస్థానం సత్రాలున్నాయి. ఏమీ చెల్లించనవసరం లేదు. రోజుకు 5 రూపాయలతో అన్ని ఆధునిక సౌకర్యాలతోనూ వున్న దేవస్థానం కాటేజస్ కూడా వున్నాయి, మంచి నీటి వసతి, ఎలక్ట్రిసిటీ ఉన్నాయి! కాలం ఎంత మారిపోయింది! కాని చెవులలో వెయ్యేళ్ల క్రిందటి ఆ యాత్రికుల పాటలే వినిపిస్తున్నాయి! చుక్కల కొండ మీద నుంచి!

"చేదుకో! చేదుకో! శ్రీగిరినాథ! చేదుకో మల్లయ్య
చేదుకొమ్మనుచు
చేదుకో! చేదుకో! శ్రీశైలనిలయ! చేదుకో మల్లయ్య
చేదుకొమ్మనుచు
చేదుకో! చేదుకో! చేనేతనాయక!
చేదుకోమల్లయ్య! చేదుకొమ్మనుచు"



సింహాచలం

సింహాచలం

విశాఖపట్టణమునకు ఉత్తరంగా 16 కిలోమీటర్ల దూరాన వున్న సింహాచలం గొప్ప వైష్ణవ క్షేత్రం. సముద్రపు మట్టానికి ఎనిమిది వందల అడుగుల ఎత్తునఉన్న ఈ కొండ కనులపండువైన ఫలవృక్షాలతో, పూలతీగ లతో, జలధారా గంభీరధ్వనులతో యాత్రికుల హృదయాలను దోచుకుంటుంది. సాధారణంగా నరసింహ దేవాలయాలు పర్వతోపరిభాగాన వుండడమే తెలుగు దేశంలో కనిపిస్తున్నది. మంగళగిరి, వేదగిరి, యాద గిరి గుట్ట, అహోబలం, నరసింహకొండ ఇత్యాదులు.

ఈ సింహాద్రిని అల్లంతదూరంలో వుండి చూస్తే, అచ్చంగా కూర్చున్న సింహం వలెనే కనిపిస్తుంది, సింహాచలం అనే పేరు అందుకే వచ్చినదని చెబుతారు. భక్తత్రాణపరాయణుడైన శ్రీ వరాహాలక్ష్మీ నరసింహ స్వామి ఈ కొండ మీద వెలసిన దైవము.

శ్రీ మహావిష్ణువు పరమ భాగవతుడైన ప్రహ్లాదుణ్ణి ఆపత్సముద్రము నుండి ఉద్ధరించి వుండిన క్షేత్రం. నరసింహావతారము. పూర్వము హిరణ్యాక్షున వధించిన వరాహమూర్తిని కూడా తనలో మిళితం చేసికొని లక్ష్మీసహితుడై వున్న స్వామి ఈయన, హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి ఒక రాతికి కట్టి సముద్రంలో పడవేస్తే, ప్రహ్లాదుడు ఇక్కడి కొండలోని ఒక పగులు ద్వారా బయటపడ్డాడని చెపుతారు. హిరణ్య కశిపుని సంహరించిన తరువాత నరసింహస్వామి ప్రహ్లాద ప్రార్థనతో ఈ కొండ మీద నివసించినట్లు స్థల పురాణం. ఉగ్రనరసింహామూర్తి చెంచు లక్ష్మిని పెళ్ళాడి ఇక్కడనే వుండి పోయాడని జానపదుల కథనం.

సింహాచలంలోని ఆలయ విమానం, ఆలయం చుట్టూ వున్న శిల్పాలు ఎంతసేపు చూచినా తనివి తీరదు. చారిత్రకులు ఈ ఆలయ నిర్మాణం పదకొండవ శతాబ్ది ప్రారంభంలో కటక గజపతి వల్ల జరిగి ఉంటుందని అంటారు. మరొక విశేషం. ఇది ఆనాడు శివాలయంగానే నిర్మితమైనట్లు, గర్భగుడిలో వున్న నరసింహామూర్తి లింగాకారంగానే ఇక్కడ ప్రతిష్ఠితుడైనట్లు చెబుతారు. కొంత కాలానికి శ్రీ రామానుజా చార్యులవారు యాత్రార్థముగా ఇక్కడకు వచ్చి దీన్ని వైష్ణవ క్షేత్రంగా మార్పుచేయడం జరిగిందని అంటారు. దీనికి సంబంధించిన కథలు కూడా ఒకటి రెండు వున్నవి. దాని సత్యాసత్యాలు ఏమైనా వరహానరసింహాస్వామి

మూర్తి గుప్తమై మంచిగంధపు పూతలో చూచేవారికి లింగాకారంగానే గోచరిస్తూంది. వైశాఖ శుద్ధ తృతీయనాడు (అక్షతృతీయ) గంధాన్ని ఒలిచి స్వామికి మరల అలంకరణం చేస్తారు. అదే ఒలుపు ఉత్సవం. మొక్కుబడులుగా కోడెదూడలను దేవునకు అర్పించడం, కామదహనోత్సవం అవి చేయడం, ఈ విధమైన శైవాచారాలు ఇప్పటికీ వున్నవి.

చైత్రి శుద్ధ ఏకాదశి మొదలు పౌర్ణమి వరకు సింహాచలంలో కళ్యాణోత్సవాలు అతివైభవంగా జరుగుతవి. వైశాఖశుద్ధం తదియనాడు నిజరూపదర్శనోత్సవం. ఆ నాడు ఒలిచిన స్వామి వారి చందనం మహాప్రసాదంగా భక్తులు స్వీకరించి ధరిస్తారు. ఆ చందనం తీర్థంలో కలిపి సేవించడం సమస్త పాపహారం; సర్వవ్యాధి నివారణం అని విశ్వాసం.

స్వామి ఒక అక్షతృతీయనాడు తప్ప మిగిలిన సంవత్సరమంతా చందనాచ్ఛాదిత రూపంలోనే మనకుదర్శనంఇస్తారు. చైత్రంలోను, వైశాఖంలోను జరిగే ప్రత్యేకోత్సవాలకు వేలకొలదీ యాత్రికులు వస్తూవుంటారు. ఈ ఉత్సవాలలో హరికథలు, భరతనాట్యాలు, సంగీత కచేరీలు విశేషంగా జరిపిస్తారు. ఆయా కళావేత్తలను సత్కరిస్తారు. సింహాచల దేవస్థానం వారు వేద సంస్కృత పాఠశాలలు, ఆంగ్ల, సంస్కృత సంగీత కళాశాలలు పోషిస్తూ అమోఘమై విద్యాప్రచారము చేస్తున్నారు. భక్తులు ప్రతి సంవత్సరం ఆషాడ శుద్ధ పూర్ణిమకు పర్వత ప్రదక్షిణం చేస్తూ వుంటారు. ఆలయం దగ్గరగా వున్న గంగధారలో స్నానం మాధవధారలో స్నానము పుణ్యప్రదమని అంటారు.

ఆలయంలో మూలవిరాట్ వున్న లోపలి భాగం పసిడిపూతగల గోడలతో ద్వారకవాటాలతో శోభాయమానంగా వుంటుంది. కళ్యాణ మండపం, అద్దాల మండపం, ఉద్యానం, ఆభరణాలు, వాహనాలు యాత్రికులు నేత్రపర్వంగా చూడవచ్చు.

సింహాచలం ఆలయప్రాకారాల మీద స్తంభాల మీద వున్న అనేక శాసనాలు చరిత్రకారులకు సహాయపడుతున్నవి. ఆంధ్రదేశములో ముఖ్యంగా కళింగప్రాంత చరిత్రకు ఈ శాసనాలు ఆధారం. 11వ శతాబ్దంలోని కులోత్తుంగ చోడుని విజయశాసనం మొదలు, విజయనగర ప్రభువు కృష్ణదేవరాయలు వ్రాయించిన విజయశాసనం వరకు చూస్తే సింహాచల క్షేత్రం ఎవరెవరు దర్శించారో స్వామికి ఎవరెవరు ఏయే కానుకలిచ్చారో స్పష్టపడుతుంది. తూర్పు గంగరాజు, వీరనరసింహ లాంగల గజపతి. అబ్బాయి సేనాపతులు, వీరభానుదేవుడు, కిమిడి ప్రభువు వల్లభసాహస మహామల్లుడు, కొండవీటిరెడ్డిరాజులు, శ్రీకృష్ణదేవరాయలు

వారి రాణి, కొంగుదేశపురాణి వీరందరూ నరసింహస్వామికి అర్పించిన దానాలు, కానుకలు, నిర్మాణాలు ఈ శాసనాల్లో లిఖితములై వున్నవి. 18 వ శతాబ్ది ప్రారంభంలో సింహాచలక్షేత్రం కటక గజపతుల అధికారం నుంచి విజయనగర ప్రభువుల ఏల్బడిలోనికి వచ్చింది. అప్పటిరాజు మొదటి విజయరామ గజపతి. ఆయన కాలంలో మహమ్మదీయ సైన్యం దేశం మీద దండెత్తడంజరిగింది. ముందుగా దేవాలయాలు భగ్నంచేయడంఆరంభించారు. సింహాచలం కొండ ఎక్కి రథాలు కళ్యాణమంటప స్తంభాలు కొంతవరకు ధ్వంసం చేశారు. గుడి తలుపులు పగులగొట్టి గర్భాలయంలో ప్రవేశించాలని యత్నించారు. ఇంతలో ఒక చిత్రం జరిగింది.

గోకులపాటి కూర్మనాథకవి, అదుర్తి హరిహరదాసు అనే ఇద్దరు భక్తులు, దేవస్థానార్చకులు మహమ్మదీయ సైన్యం ముట్టడించబోతుందని ముందుగా తెలుసుకొని గర్భాలయంలో కూర్చుని తలుపులు మూసుకొని స్వామి మీద ఒక శతకం చెప్పడానికి ఆరంభం చేశారు. కూర్మనాథకవి చెప్పడం హరిహరదాసు వ్రాయడం "వైరిహరరంహా, సింహాద్రి నారసింహా" అనే మకుటంతో సీస పద్యాలు శతకం అయింది. నరసింహస్వామివారి భక్తికి ఆనందపడి, ఆలయం ముట్టడిస్తున్న ముష్కరులను తరిమివేయడానికి తక్షణం వేలకొలది తేనెటీగలను సృష్టించాడట. అవి గుంపులు గుంపులుగా వచ్చి శత్రువుల్ని విశాఖపట్టణంలో వున్న "తుమ్మెదలమెట్ట" దాక తరిమివేసినవట. ఆర్తరక్షణ బిరుద ప్రసిద్ధుడైన సింహాచలస్వామి సన్నిధిలో కూర్మనాథకవి ఏమన్నాడో, చూడండి.

కాంతలఁ జెఱబట్టఁ గన్గొనుచుంటివి
    పాంచాలి వెత యెట్లు బాపినావు ?
గోవధ సేయఁ గనుగ్గొనుచుంటి విప్పుడు
    కరుణతోఁ గరినెట్లు కాచినావు ?
ద్విజులు బాధలు పడఁ దిలకించుచుంటివి
    భువిఁ గుచేలుని నెట్లు ప్రోచినావు ?
సత్ప్రభు రాజ్యనాశన మొందఁ గంటివి
    ధ్రువుని కెట్టిచ్చితో దొడ్డ పదవి ?
దుష్టశిక్షణ మొనరించి శిష్టరక్ష
జేయకుండినఁ బూర్వప్రసిద్ధి చెడును
ఆర్తరక్షణ బిరుదంబు హానిజెందు
వైరిహరరంహా ! సింహాద్రి నారసింహా !

1170—6

కాళేశ్వరం

తెలుగుదేశానికి త్రిలింగ దేశమనే పేరు రావడానికి కారణమైన మూడు క్షేత్రాలలో కాళేశ్వరము ఒకటి. కరీంనగరు జిల్లాలో మంథెన గ్రామానికి దరిదాపు ఇరవైయెనిమిది మైళ్ళ దూరంలో గోదావరి నది దక్షిణ తీరాన కాళేశ్వరము ఉన్నది. 'ప్రాణహిత' అనే ఉపనది ఇక్కడి నుండి గోదావరిలో కలుస్తుంది.

విశేషం – ఇది చిన్న గ్రామమే అయినా, శివ క్షేత్రాలలో మిన్న. ఇది ఒకటే కాక, వేంకటేశ్వరాలయం, సరస్వతి ఆలయం, బిందుమాధవ స్వామి ఆలయం, చంద్రశేఖరాలయం, సంగమేశ్వరాలయం, సోమేశ్వర ఆలయం–మొదలైనవి ఎన్నో ఉన్నవి. కాళేశ్వర సమీపంలో ముక్తేశ్వర ఆలయం ఉన్నది. ఒకే పానవట్టం మీద రెండు లింగాలు. ఒకటి కాళేశ్వర లింగం, రెండవది ముక్తేశ్వర లింగం. కాళేశ్వరుని ముందు పూజించి, తరువాత ముక్తేశ్వర పూజ చేస్తారు ఈ ఆలయంలోనే సూర్య విగ్రహం జయ విజయు విగ్రహాలు, మూడు గజాల పొడవు గల మత్స్య విగ్రహము ఉన్నాయి. అక్కడక్కడ జైన బౌద్ధ సంప్రదాయపు చిహ్నాలు కూడా గోచరిస్తాయి.

స్కాంద పురాణంలో కాళేశ్వర ప్రసక్తి ఉండటమే కాక, ప్రతాప రుద్ర యశోభూషణమనే అలంకార గ్రంథంలోను, కావ్యాలంకార చూడామణి, దశ కుమార చరిత్ర మొదలైన తెలుగు గ్రంథాలలో కూడా కాళేశ్వరం పేర్కొనబడినది.

అరసవిల్లి

శ్రీ సూర్యదేవాలయములు భారత దేశము మొత్తమునకే అరుదుగా ఉన్నవి. ఒరిస్సాలోని పూరీకి కొంత దూరమున గల 'కోణార్కాలయము' ప్రసిద్ధి చెందినది. మన తెలుగు నాట శ్రీకాకుళము జిల్లాలోని అరసవిల్లి గొప్ప-సూర్యక్షేత్రము. పురాణ గణ్యమైనది. ద్వాపరయుగములో బల రాముడు తీర్థయాత్రలకు బయలుదేరి కళింగ దేశానికి వచ్చాడు. అప్పటికి ఆ ప్రాంతము కరువు కాటకాలతో అలమట పడుచున్నది. దేశస్థుల ప్రార్థనతో బలరాముడు తన ఆయుధమైన నాగలితో భూమిని గ్రుచ్చి నీటి బుగ్గను పైకి తీసుకొని వచ్చాడు. అది 'నాగావళి' నది. బలరాముడు పంచ లింగ ప్రతిష్ఠ చేసే సంకల్పంతో నాగావళి ఒడ్డున రుద్రకోటీశ్వరాలయము స్థాపనకు ఏర్పాటు చేసి దేవతలను ఆహ్వానించాడు. అందరూ వచ్చారు. ఇంద్రుడు ఒక్కడూ వేళకు రాలేక పోయాడు. రాత్రి సమయాన చేరుకొని కోటీశ్వర దర్శనార్థం రాగా నందీశ్వరుడు ఇంద్రుణ్ణి అటకాయించాడు. ఇంద్రుడు కోపావేశంతో వజ్రాయధం ఎత్తగా, నందీశ్వరుడు కొమ్ములతో విసరి పారవైచినాడు. ఆ దెబ్బకు అరసవల్లి సమీపంలో స్పృహ తప్పి పడిపోయిన ఇందున్రికు సూర్యభగవానుడు కనపడి "నా విగ్రహం ఇక్కడ ప్రతిష్ఠించి ఆరాధించు. ఆరోగ్యవంతుడు వవుతావు" అని చెప్పి మాయమయ్యాడు. ఆయన చెప్పినట్లే అరసవల్లిలో సూర్య నారాయణ స్వామిని ప్రతిష్ఠించి ఆరాధించి ఆరోగ్యవంతుడై తన లోకానికి చేరుకున్నాడని చెప్పుకుంటారు. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అనేక ప్రాంతాల నుంచి నిత్యమూ యాత్రికులు అరసవల్లి వచ్చి నియమ నిష్ఠలతో ఆరాధించి ఆది వ్యాధుల నుండి విముక్తులవుతున్నారు.

అరసవిల్లి సూర్యాలయ శిల్పము కనుల పండువుగా ఉంటుంది. నిరం తరము ప్రశాంతమైన మనస్థితిని భక్తులకు కలిగించే ప్రాకారాంతర ప్రదేశం. సాష్టాంగ వందనములు చేసుకుంటూ ఆలయానికి ప్రదక్షిణాలు చేసే భక్తులు, అరుణ పారాయణాదులు జరుపుకునే శ్రోత్రియులు, ముఖ మండపంలో ప్రవేశించగానే మనకు గోచరిస్తారు.

గర్భాలయంలో స్వామి మూల విరాట్ విగ్రహము మనోహరము, పాపహరము అయినది. ఉషా, పద్మినీ, ఛాయాదేవీ మూర్తులను మనము దర్శింపవచ్చు.

ఈ సూర్యాలయ నిర్మాణంలో ఒక ప్రత్యేకత. ఉత్తరాయణ-దక్షిణాయనములు మార్పు చెందు కాలమున సూర్యకిరణాలు స్వామి వారి పాదాల మీద పడటం గమనించవచ్చు.

హర్ష వల్లీ పురీ వాసం
ఛాయోషా పద్మినీ యుతం:
సర్వ దేవనుతం నౌమి
భాస్కరం మంగళాకరమ్:

ముఖలింగం

శ్రీకాకుళం జిల్లాలో వంశధారానదికి ఎడమగట్టుని నగరికటకం, ముఖలింగం అనే రెండు గ్రామాలు ఉన్నవి. ఈ రెండు గ్రామాల నడుమ శిథిలములైన శిల్పఖండాలెన్నో ఉన్నవి. ముఖలింగంలో మూడు శైవ దేవాలయాలు ముఖ్యమైనవి. ముఖలింగేశ్వరాలయం, సోమేశ్వరాలయం, భీమేశ్వరాలయం. సోమేశ్వరాలయం శిల్ప ప్రతిమా లక్షణాన్ని అనుసరించి గాంగుల కాలంనాటి దని, 9 వ శతాబ్దికి చెందినదని చెపుతారు. భీమేశ్వరాలయం చాళుక్య సంప్రదాయంలో ఉండడం వల్ల 12 వ శతాబ్ది నాటిదని అంటారు.

ఈ ఆలయత్రయంలో బహు పురాతనము, చారిత్రక ప్రసిద్ధము అయినది మధుకేశ్వరాలయం. ముఖలింగం మధూకలింగ శబ్దం నుంచి పుట్టిన శబ్దమని పండితులు, ముక్కలింగం నుంచి ఉత్పన్నమైనదని కొందరు అంటారు.

ఈ ఆలయంలో ఉన్న అనేక శాసనాల్లో ప్రాచీనమైన శాసనం అనంత వర్మ తృతీయ వజ్రహస్త దేవుని రాణి దాన శాసనం. శిల్ప లక్షణాధారంతో 8 వ శతాబ్దిలో నిర్మాణం జరిగి ఉండవచ్చునని పరిశోధకులు అంటారు.

మధూకమనగా ఇప్పచెట్టు. మధుకేశ్వరుడనే పేరు రావడానికి పురాణ గాథ. ఆలయ ఫలకం మీద శిల్పాలననుసరించి చెపుతారు.

హిమాలయం మీద ఒకప్పుడు వైష్ణవయాగం జరిగింది. గంధర్వులు యాగానికి వచ్చిన సందర్భంలో అక్కడ శబర కాంతలను కామించారు. వామదేవ ఋషి ఈ చేసిన దోషానికి మీరు శబరయోనిలో పుట్టమని గంధర్వులను శపించాడు. ఆ విధంగా జన్మించిన వారిలో శబర నాయకుడు

చిత్రగ్రీవుడు. అతని రాణి చిత్తి. రెండవ భార్య చిత్కళ. ఈమె శివదీక్షా పరురాలు. శబరరాజు చిత్కళను పిలిచి వాకిటిలో ఉన్న ఇప్పచెట్టు కొమ్మలు రెండు వంచి రాలిన పువ్వులు ఏరుకుని బతకమన్నాడట. చిత్కళను ఆశ్చర్యకరంగా ఆ రాలిన పువ్వులు బంగారు పువ్వులయేవి. ఆ పూవులు ఆమె సుమంత పురంలో అమ్ముతూ ఉండేదట. ఇది సవతుల జగడానికి కారణంకాగా, శబరరాజు ఆ మధూక వృక్షం నరికి వేయడానికి సిద్ధపడ్డాడు. అపుడు శివుడు రౌద్రాకారంలో ఆ చెట్టు మొదట కనిపించగా శబరరాజు మూర్ఛపోయాడు, ఇంతకీ—చిత్కళయే కారణమని శబరులు ఆమెను చంపబోయారు. పరమ శివుడు ప్రత్యక్షమై శబర రూపులైన గంధర్వులను శాపవిముక్తులుగా అనుగ్రహించాడు. మధూక వృక్షంలో సాక్షాత్కరించిన శివుడు మధుకేశ్వరుడుగా వెలసినాడు.

మధుకేశ్వరాలయ ద్వారశిల్పం ఈ గాథకు ఆధారంగా చూపబడుతున్నది. మధుకేశ్వరాలయానికి ముందు పెద్ద నంది విగ్రహము. గర్భాలయంలోని ముఖలింగేశ్వర లింగం తెల్లని శిల.

ముఖలింగేశ్వరుడు మధూక లింగేశ్వరుడుగా శబర దైవంగా ఆరాధింప బడటం గిరిజనుల అవ్యాజ భక్తి సంస్కృతులకు నిదర్శనం.



ద్రాక్షారామం

ద్రాక్షారామం

ప్రతాపరుద్ర యశోభూషణమనే అలంకార గ్రంథం వ్రాసిన విద్యానాథుడు "శ్రీశైల కాళేశ్వర ద్రాక్షారామ నివాసినః ప్రతిదినం త్వచ్ఛ్రేయసే జాగ్రత !" అని అన్నాడు. మనదేశానికి త్రిలింగదేశమని పేరు రావడానికి హేతువైన క్షేత్రత్రయంలో దక్షారామం ఒకటి.

ఉత్తర భారతంలో వారణాసి ఎట్టిదో, దక్షిణాపథానికి దక్షారామం అట్టిది. అందుకే 'దక్షిణ కాశీ' అనే వ్యవహార రూఢి ఏర్పడింది. 'దక్షుని సవనాగారము దక్షారామంబు' అని శ్రీనాథుడు అనడం, దక్షారామం, అని మాత్రమే శాసనాలలో ఉండడం చూస్తే బహుశః రేఫ యుక్తంగా 'ద్రాక్షారామం' అనేక్వచిద్వ్యవహారానికి హేతువు ఒక్కప్పుడు ఆ గ్రామంలో ద్రాక్ష తోటలు విరివిగా ఉండటం అని భావించవచ్చు. ఇప్పటికీ తమలపాకులకు ద్రాక్షారామం పేరు పడ్డది. తములపు తీగలూ, ద్రాక్ష లతలూ ఒకేచోట పెరగడం సామాన్యం. 'దక్షారామం' సంస్కృత పదం. కొన్ని శాసనాలలో దీనికి పర్యాయంగా డాకరేమి, పెదడాకరేమి అని తెలుగు వ్యవహారం ఉన్నది.

ఆంధ్రదేశములో పంచారామములుగా సుప్రసిద్ధములైన పుణ్య క్షేత్రాలలో ఇది ఒకటి. మిగిలిన నాలుగు కుమారారామం, క్షీరారామం, సోమారామం, అమరారామం అనేవి. ఈ అయిదింటిలో అమరారామం కృష్ణా తీరస్థము. తక్కిన నాల్గు గోదావరీ తీరస్థములు. కుమారారామం సామర్లకోట, భీమవరం. దీనికి స్కందారామమనికూడ వ్యవహారము. క్షీరారామం పశ్చిమగోదావరి మండలములోని పాలకొల్లు. ఇక్కడ రామలింగేశ్వరుడు. సోమారామం గునుపూడి భీమవరం. గునుపూడిలో సోమేశ్వరుడు. అమరారామం అమరావతి. ఇక్కడ అమరేశ్వరుడు.

దక్షారామ భీమశ్వరుని పేరుతో 'భీమమండలం' ఏర్పాటయినది. శ్రీనాథుని భీమేశ్వర పురాణము భీమఖండ వైశిష్ట్యమునకు, భీమనాథుని మహామహిమ వైభవానికి దర్పణం పట్టిన గ్రంథం. స్కంద పురాణంలోని గోదావరీ ఖండం దానికి మూలం. భీమమండల సీమా విభాగం తెలిసికోగినది. దక్షారామానికి అన్ని దిక్కులందు మూడేసి యోజనాల మేరలో ఉన్న భూమిని భీమ మండలం అంటారు.

"అంబుధి మేర తూర్పునకు, నబ్ధియ సీమటుయామ్యదిగ్విభా
గంబునకుం; బ్రతీచికిని గౌతమి సీమ యుదీచికం; బ్రమా
ణంబు త్రియోజనంబు; సురనాథుడు దక్షిణకాశి భీమ లిం
గంబున కేక భోగముగం గట్టడంజేసె వసుంధరా స్థలిన్."

శ్రీనాథుని ఈ పద్యం భీమ మండలపు సరిహద్దులు స్పష్టంగా చెప్పింది.

తూర్పున సముద్రము సరిహద్దు ; అనగా గౌతమి సాగర సంగమం చేసిన ప్రదేశం. భైరవపాలెం. ఇక్కడ భైరవేశ్వరుడు. వశిష్ఠాసాగర సంగమ స్థలమైన అంతర్వేది దక్షిణాబ్ధి సీమ. నీలకంఠేశ్వరుడు, నృసింహ స్వామి అంతర్వేది తీర్థాధి దైవతాలు. భీమ మండలపు పశ్చిమ సీమ అఖండ గౌతమి రాజమహేంద్రవరమున గల మార్కండేయేశ్వరుడు అక్కడి అధి దైవతం. ఇక ఉత్తరాన సరిహద్దు మూడు యోజనాల దూరము పిఠాపురం పాద గయా క్షేత్రం. కుక్కుటేశ్వరుడు, కుంతీ మాధవస్వామి ఇక్కడి దైవతములు. కుమారా రామ భీమేశ్వర క్షేత్రం కూడ ఈ నడుమనే ఉన్నది.

దక్షా రామ భీమనాథుడు ఇంతటి విశాలమైన మండలమునకు అధి పత్యం వహించిన దేవతా సార్వభౌముడు. ఈ మండలంలో ఉన్న అనేక దేవతలు భీమేశ్వరునకు సామంతులు. ఉప కంఠ బాంధవులు. ఆంధ్ర భూమీ మధ్య స్థమైన భీమ మండలాన్ని ఒక 'పుండరీకం' భావన చేసిన శ్రీనాథుని పద్యం చూడండి.

ఆంధ్ర భూభవన మధ్యము పుండరీకము
సప్త గోదావర జలము తేనె
బ్రహ్మ సంవేద్యాది బహు తీర్థములు రేకు
లకరులు చారు దివ్య స్థలములు
నాళంబు లవణాబ్ధి వేలా విభాగంబు
కల్యాణ భోగ మోక్షములు తావి
దక్షవాటీ మహా స్థానంబు కర్ణిక
హంసంబు భీమ నాయకుడు శివుడు

గౌతమీ సింధు కౌంతేయ కణ్వ నదులు
తుల్య భాగయు నేలేరుఁ దుమ్మి కొనలు
భువన సంభావ్యమైన యీ పుణ్య భూమి
యనఘ ! సంసార తాప శాంత్యాప దంబు

భీమనాథుని కంటె పెద్ద వేల్పు, దక్షవాటి కంటె ఉత్తమధామం, సప్త గోదావరం కంటె తీర్థ రాజం జగత్తులో లేదని స్కంద పురాణోక్తి. తెనుగులో శ్రీనాధుని భీమేశ్వర పురాణం భీమ ఖండానికి భౌగోళికమైన రేఖా చిత్రం రస భావ సమ్మిళితం చేసి చూపించింది.

దక్షారామం ఒకప్పుడు బౌద్ధారామమని, విష్ణుకుందినుల కాలంలో శైవ క్షేత్రంగా వెలసినదనీ, చాళుక్యుల పలుకుబడిలో బహు విధ ప్రశస్తి పొందినదని అంటారు. చాళుక్య భీమేశ్వరుని పేరే భీమేశ్వరుడనీ చెపుతారు.

పౌరాణికమైన గాథ యిలా ఉంది. పూర్వం తారకాసురుని కంఠంలోని అమృత లింగాన్ని కుమారస్వామి పంచ ఖండాలుగా భేదించాడు. వానిలో రెండవ ఖండం దక్ష వాటికలో వచ్చిపడి స్వయం ప్రతిష్ఠితమైనది. భరద్వాజాదులు సప్తర్షులు భీమలింగ ప్రతిష్ఠ చేయాలని సుముహూర్తం పెట్టుకొని, తెల్లవారేలోగా గోదావరిని దక్షారామానికి తీసుకువెళ్ళాలని సంకల్పించారు. స్నాన ధ్యానాదులు నిర్వర్తించుకొని, శుచులై మంత్ర పుష్పార్చన పురస్సరంగా గోదావరిని ఆహ్వానించారు. ఇంద్రుని సహాయంతో ఈ ఆహ్వానం దవళేశ్వరం వద్ద జరిగింది. సప్తర్షులు గోదావరిని తీసుకు వెడుతున్నారు. గంగమ్మ పొంగి పొరలుతూ దారిలో తనకు అడ్డు వచ్చిన ఒక ఆశ్రమాన్ని ముంచి వేసింది. అది తుల్యుడనే ఒక అసుర ఋషి యాగం చేస్తున్న స్థానం. యాగ భంగం జరగడంతో కుపితులై రాక్షసమునులు తమ మంత్ర శక్తిచే ప్రవాహాన్ని ఆపి వేశారు. సప్తఋషులకు, వాళ్ళకి వాదాలు పెరిగాయి. గోదావరి 'ఇష్కరోయ' అవుతుందని దానవులు శపించారు. శాప ప్రతి శాపాలు అయిన తర్వాత చివరికి, పరమార్థ వేత్త అయిన తుల్యభాగుని పక్షపాత రహితమైన మధ్యవర్తిత్వముతో వ్యాసానుగ్రహంతో అంతర్వాహినియై సప్తసింధువు భీమేశ్వర క్షేత్రానికి చేరుకుంది.

సప్తర్షులు దక్షారామం సుముహూర్తానికి చేరుకోలేదు. దారిలో వచ్చిన అంతరాయం కారణంగా ఆలసించి వచ్చారు. ఈలోగా శుభ వేళ తప్పకుండా అమృత లింగమైన భీమ నాయకుడు దక్ష వాటికలో ఆత్మ

సంస్థాపితుడై ఉండడం చూచి వారు అబ్బురపడ్డారు. తాము నిశ్చయించిన ప్రధాన ముహూర్తానికే భీమనాథుడు సంప్రతిష్ఠితుడైనందుకు సంతోషం కలిగినా తాము తల పెట్టిన సంస్కారాన్ని అన్యథాకరించినందుకు సప్తర్షులు రోషా విష్టులయ్యారు. అది సూర్య భగవానుడు కనిపెట్టి వారికి అభివాదనం చేసి "మునీంద్రులారా ! మీకు కాల విలంబనం జరిగింది. మేలు కలిగించే శోభన కాలం సరిగడవరాదని భీమేశ్వరుడు తనకు తానే ప్రతిష్ఠితుడయ్యాడు. కారుణ్యాసమున్న వితమతి దక్షారామ విభునకు ప్రథమారాధనం చేసే భాగధేయం నాకు కలిగింది. అంతే కాని, మీ ప్రతిష్ఠా ప్రారంభానికి అడ్డురావడం కాదు. నా తరువాత భీమ నాథుణ్ణి హరి, పరమేష్ఠి ఇద్దరూ అర్చించారు. వారి వెంబడి దేవతలు, గంధర్వులు సేవించారు. కాలయాపన చేయకుండా మీరు కూడా మీ ఆరాధనలు జరుపుకోనండి."——

ఇలా అనగానే, సప్తర్షులు శివసంప్రతిష్ఠాపన యోగం తమకు సిద్ధించ నందుకు సంతాపపడ్డారు. అపుడు ఆకాశవాణి అన్నది "మీరు చేసిన భక్తి అల్పంకాదు. గౌతమీ మహాతరంగిణిని భీమేశ్వరుని మూర్ధాభిషేకార్థమై ఇక్కడకు తెచ్చారు. అంతకంటె ఏమి కావాలి. మీరు ఏడుగురు, ప్రతిష్ఠారంభాభిషేకం చేసిన సూర్యునితో మీరెనమండుగురు. దక్షారామ భీమేశ్వరుని సన్నిధిని పాశుపతులను నెలకొల్పండి. వీరు అష్టమూర్తులుగా శివుణ్ణి పూజిస్తూ ఉంటారు".

ఈ అశరీరవాణి సప్తమహర్షులు, సూర్యుడు విన్నారు. సప్త గోదావరీ తీర్థజలంతో భీమేశ్వరునకు మహాన్యాసాభిషేక పురస్సరంగా అర్చనలు చేశారు. సప్తర్షులచే సమాన్వితమైన నదికి సప్త గోదావరి అని పేరు. సప్త గోదావరం భీమేశ్వరుని ఆలయ ప్రాకారాన్ని ఆనుకొని ఉంటుంది.

నేటికీ అష్టమూర్తుల గోత్రాలవారే ఇచ్చట అర్చకులుగా ఉంటారు. ఆలయంలో నవగ్రహాలు, అష్టదిక్పాలకులు వెలసినారు. భీమలింగ ప్రతిష్ఠానంతరం సూర్యుడు పార్వతీ పరమేశ్వరుల నాహ్వానించాడుట. మార్గశిరశుద్ధ చతుర్దశినాడు రోహిణీ నక్షత్రంలో ఆదిదేవుడు గౌరీసహితుడై భీమలింగంలో లీనమైనట్లు చెబుతారు ఈ క్షేత్రంలో మాఘశుద్ధ ఏకాదశికి కల్యాణోత్సవం జరుగుతుంది. ఆ పూర్ణిమనాడు రథోత్సవము.

దక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబికా సహితుడైన భీమేశ్వరుణ్ణి కొలుస్తారు. భారతదేశంలోని అష్టాదశ శక్తి పీఠాలలో మాణిక్యాంబికా

శక్తి పీఠం ఒకటి. ఈమె భీమేశ్వరునకు ఉత్తర దిక్కున ఉన్న తిరుచుట్టు మాలెలో వెలసి ఉంది. భీమలింగ సన్నిధిని ఈనాడు పార్వతీదేవి విగ్రహం కొంచెమివతల సతీ విగ్రహం ఉన్నవి. కల్యాణోత్సవం మాత్రం మాణిక్యాంబికా సమేతుడైన భీమేశ్వరునికే జరుగుతూ ఉంటుంది.

భీమేశ్వరస్వామిని దర్శించవలెనన్నా, పూజాభిషేకాదులు చేయవలెనన్నా, స్వామివారి ప్రాకారం ఎక్కాలి. అక్కడ భీమేశ్వరలింగం మూలపీఠంమీద ఎనిమిది అడుగుల ఎత్తు కలిగి ఉంటుంది. లింగాగ్రం చుట్టుకైవారం మూడు అడుగులు ఉంటుంది. స్ఫటికచ్ఛవులు మోర్చే భీమలింగమంతటా శ్యామరేఖల వంటివి గోచరిస్తాయి. అది ఈశ్వరుని వ్యాఘ్రాజినధారణాన్ని సూచిస్తున్న దంటారు. లింగాగ్రమున రెండు నొక్కులు ఉన్నట్లు కనిపిస్తాయి. ముందున్న నొక్కు పార్థప్రహారానికి, రెండవది–మీదికి పెరిగి పోకుండా నాటిన చీలకూ, శార్కాణములైన చిన్నెలుగా అభివర్ణిస్తారు. సౌధము క్రింద ఉన్న లింగమూలపీఠ స్థానం 'చీకటికోణం'. అక్కడ ఒకప్పుడు మాణిక్యదీపాలు ఉండేవట. ఆ స్థానంలో ఇప్పుడు కనిపించేని జాతిభూమికెలు! ఆలయ ప్రాకారంలోని ఒక స్తంభం వ్యాస విగ్రహాన్ని ఆవిష్కరించింది. భక్తులు దానికి ప్రదక్షిణ నమస్కారాలు చేస్తారు. కాశీలో తనకు, తన శిష్యులకు భిక్షపుట్టని కారణంగా అలిగి శాపోద్యుక్తుడైన వ్యాసుణ్ణి విశ్వేశ్వరుడు వారణాసి విడిచి పొమ్మన్నాడు. పోఅన్నపూర్ణ భర్తను శాంతపరిచింది. వ్యాసుడు పాప పరిహారార్థమై తీర్థ యాత్రలు చేస్తూ వచ్చి దక్షిణ కాశియైన దక్షారామంలో భీమేశ్వర సాన్నిధ్యం కలిగించుకొని చరితార్థుడైనట్లు పౌరాణిక గాథ. లోపాముద్రా సహితుడైన అగస్త్యుడు వ్యాసునకు దక్షారామ క్షేత్ర మహాత్మ్యం, భీమ మండల వైభవము అభివర్ణించి చెప్పాడు.

నిరంతరమూ భక్తబృందం దక్షారామ క్షేత్రానికి వచ్చి స్వామికి అభిషేకాదులు జరుపుకొని జన్మ చరితార్థము అయినదని, కలిదోష నిర్మూలనం చేసుకున్నామని ఆనంద మగ్నులు అవుతూ ఉంటారు.

శ్రీ రామాయణమును ద
క్షారామాయణము (గలిమలాపహములు స
త్సారమతులు వాల్మీకికిఁ
బారశర్యునకు వినుతి పాత్రములయ్యెన్.

('భీమఖండము')



ర్యాలివద్ద జగన్మోహిని కేశవస్వామి

ర్యాలి

మానవుని ఆధ్యాత్మిక చింతనకు కళ యొక్క తోడ్పాటు అసాధారణ మైనది. శిల్పాచార్యుల కళా ప్రతిభ పరాకష్ఠకు వచ్చిన విగ్రహము దర్శించవలెనంటే, జగన్మోహినీ కేశవ స్వామిని చూడవచ్చును.

కేశవ స్వామి ఆలయము తూర్పు గోదావరి జిల్లాలో కొత్త పేటకు పదిమైళ్ల దూరాన గల ర్యాలి అనే గ్రామంలో ఉన్నది. స్వామి వారి విగ్రహం సుమారు అయిదు అడుగుల ఎత్తు. నల్లటి శిల. చూడగానే మనో నయనాలను ఆకర్షించే ఆ శిల్ప సౌందర్యం వర్ణనా తీతం. జగన్మోహనమైన ఆ మూర్తి మన హృదయంలో హత్తుకొనడం సరే. భక్తుని ప్రతి బింబము ఆ దివ్య విగ్రహ శిలా స్నిగ్ధ కళాఖండములో స్పష్టంగా చూచుకోవచ్చు. శిల్ప సౌందర్యం, సత్య శివ స్వరూపంతో తాదాత్మ్యం పొందిన అనుభవం కలుగుతుంది.

కేశవ స్వామి హస్తములు, పాదములు-ప్రత్యవయవము ఎంతో సహజ సుందరముగా చెక్కబడిన వైఖరిని గమనిస్తాము. అరచేతులలోని రేఖలు, స్వామి కంఠ సీమ మీది ముడతలు-కళా నైపుణ్యాన్ని పట్టిచూపుతవి. ఈ విగ్రహంలో ఒక ప్రత్యేకత ఉంది. శంఖ చక్ర గదా పద్మాలు నాలుగు చేతుల్లోను తాల్చిన కేశవ మూర్తిని దర్శించగానే, ఆయన పాద పద్మాల నుండి ఉద్భవించే జలం మనల్ని ఆకర్షిస్తుంది; ఆశ్చర్యం అనిపిస్తుంది. విష్ణు పాదోద్భవా గంగా అంటారు కదా? నిత్యము కొంచెము కొంచెముగా చెమరించే స్వామి పాదోదకం గంగా తీర్థంగా భావిస్తారు.

విశేషం ఏమిటంటే-ఎదుటి భాగంలో కేశవ స్వామి రూపం, వెనుక వైపు మోహినీ రూపం. చాలా ముచ్చటగా ఉంటుంది. జగన్మోహిని పశ్చాద్భాగమే శిల్పములో చూడవచ్చు. ఆమె సిగ, అలంకారములు శిల్పి చాతుర్య ద్యోతకాలు. పద్మినీ జాతి స్త్రీకి సహజంగా ఉండే, పుట్టు మచ్చ వెనుక భాగాన శిల్పంలో చూపబడటం విశేషం. ప్రపంచ సృష్టికి మూల భూతమైన స్త్రీ పుంసాత్మకమై నట్టి జగన్మోహన శిల్పం మరెక్కడా వినలేదు. పూర్వం ర్యాలి ప్రాంతమంతా అడవులు.

ఘంట చోళుడనే రాజు విష్ణు భక్తుడు వేట నిమిత్తంగా ఆ అరణ్యానికి పోయి అలసట పడి ఒక చెట్టునీడన విశ్రమించాడు.

భక్తులు చాలా మంది హరినామ కీర్తనం చేస్తున్న ఘోష వినబడింది. కళ్లు తెరచి చూచాడు. ఎవ్వరూ కనబడలేదు. ధ్వని మాత్రం వినిపిస్తోంది. వింతగా తోచి, మహారాజు వేట చాలించి రాజధానికి చేరుకున్నాడు. ఆ రాత్రి స్వప్నంలో మహా విష్ణువు కనపడి ఒక రథం "సిద్ధం చేయించి దానిని ఈ రాజ్యంలో నడిపించు. రథ చక్రం శిల ఎక్కడ ఊడి పడుతుందో అక్కడ విగ్రహం కనిపిస్తుంది. దానిని అక్కడే ప్రతిష్ఠ చేసి ధన్యుడవగు" మని చెప్పాడట. ఘంటాచోళ చక్రవర్తి మేల్కొని భగవంతుని ఆదేశానుసారం ఈ విగ్రహం ప్రతిష్ఠించాడని చెప్పుకుంటారు.

పాల సముద్రం తరచినపుడు పుట్టిన అమృతాన్ని విష్ణువు జగన్మోహిని రూపంలో పంచుతుండగా దానవులు ఆమె రూపం చూసి పరవశులై అమృతాన్ని కోల్పోయారన్న వార్త శివుడు విని జగన్మోహన రూపం ఒక సారి నాకు చూపించమని కోరినాడట. విష్ణువు బదులు చెప్పకుండా మాయమై పోయినాడు. శివుడు అతని కోసం వెదుకు తుండగా మోహిని కనబడింది. ఆమె రూపానికి వశుడై మరులు గొని వెంబడించాడు. పుట్టలు, గుట్టలు దాటి ఆమె పరుగెత్తుతూ ఉంటే శివుడు ఆశ్చర్య పడి ఈమె విష్ణు మాయ కాదు గదా ; అనుకున్నాడు. దూరాన ఉన్న మోహిని శివుని వైపు తిరిగి 'జగన్మోహిని కేశవ స్వామిని నే నే' అని అక్కడి కక్కడే శిలాకృతి వహించినట్లు కథ చెపుతారు. దానికి తగినట్టు ఈ ఆలయానికి ఎదురుగా శివాలయం కూడా ర్యాలిలో ఉంది, ఉమా కమండలీశ్వరుడు.

శిల్ప కళారమణీయతకు ర్యాలి 'జగన్మోహినీ కేశవస్వామి' తెలుగు వాట పేరు మోసిన దైవము.

విజయవాడ

అన్నివిధాల ఆంధ్రదేశానికి నడిగడ్డలో వుంది విజయవాడ. మద్రాసు నుండి కలకత్తాకు, ఢిల్లీకి వెళ్ళే రైలుమార్గాలకిది పెద్ద కూడలి. ఆంధ్ర దేశములో ప్రధానమైన పట్నము. ఇచ్చట ముఖ్యమైన గుడులు మూడు. కనకదుర్గ గుడి, మల్లేశ్వరస్వామి గుడి, విజయేశ్వరస్వామి గుడి.

పురాణాలలో ఇది విజయవాటిగా ప్రసిద్ధము. కొన్ని శాసనాల్లో 'రాజేంద్ర చోళపురము' అని కూడ పేర్కొనబడింది. కృష్ణఒడ్డున ప్రసిద్ధ యాత్రాస్థలమైన యీ ప్రదేశంలో శివునికి మల్లేశ్వరుడనే పేర ఆలయం ఉంది. ఈ స్వామికి 'జయసేను' డని కూడ ప్రసిద్ధి. అగస్త్య మహర్షి యీ స్వామి వివిధ లీలలకు సాక్షియైన గొప్పభక్తుడు.

కనకదుర్గ యిచ్చట ఎప్పుడు వెలిసిందో తెలియదు. ఆమె తనకుతానే వెలిసింది. దక్షిణాపథవాసులను పీడిస్తున్న దుర్గమాసురుణ్ని చండీ స్వరూపంలో ఇచ్చట సంహరించింది.

మల్లికార్జునుడనీ, మల్లేశ్వరుడనీ పురాణాల్లో వినబడే యీ స్వామిని తమ దక్షిణాపథ విజయచిహ్నంగా పాండవాగ్రజుడైన యుధిష్ఠిరుడు ప్రతిష్ఠించినట్లు తెలుస్తున్నది.

చరిత్రననుబట్టి క్రీ.శ. 10వ శతాబ్దంలో పశ్చిమ చాళుక్య ప్రభువు త్రిభువన మల్లుడు ఈ గుడిని నిర్మించాడు.

విజయేశ్వర ప్రతిష్ఠ అర్జునుడు చేసిందంటారు (కిరాత రూపంలో వచ్చిన శివునిపై తన విజయచిహ్నంగా). ఈ ప్రదేశమంతా చిన్న చిన్న కొండలతో చుట్టబడి వుంటుంది అన్నింటిలోను పెద్దది సీతానగరం కొండ. చిన్నది కనకదుర్గ. దీనిని 'కనక కొండ' అని కూడా అంటారు, దుర్గ గుడికి దక్షిణంవైపున చిన్న గుట్ట వుంది. దానినిండా శిల్పాలు, శాసనాలు వివిధ దేవతలవి వారివారి పేర్లతో చెక్కి ఉన్నాయి. చాలా ప్రతిమలు దుర్గవే. అవన్నీ మంత్రశాస్త్రానికి సంబంధించినవి. పూర్వం యీ కొండలన్నీ వరసగా కలిసి ఉండేవనీ – పరమేశ్వరుని ఆజ్ఞ వేత కృష్ణ ప్రవహించటానికి వీలుగా ప్రక్క ప్రక్కలకు తప్పుకున్నాయనీ అంటారు.

ఈ కొండల్లో ఒకటి 'ఇంద్రకీల' మనే పేరుతో మహాభారతంలో పేర్కొనబడింది. ఈ కొండమీదనే అర్జునునకు శివుడు పాశుపత మనే పరమాస్త్రాన్ని అనుగ్రహించాడు. అనుగ్రహించటానికి ముందు శివుడు అర్జునుని యెదుట కిరాతరూపంలో నిలిచాడు. ఈ కథను 'కిరాతార్జునీయం'గా భారవి శాశ్వతం చేశాడు.

తన పాశుపతాస్త్రసిద్ధికి స్మృతి చిహ్నంగా ఇచ్చట 'విజయేశ్వరుడిని' అర్జునుడు ప్రతిష్ఠించాడంటారు. మిగిలిన మహాభారతం కథానన్ని వేశాలతో సహా కిరాతార్జునీయం యీ గుడిలో శిల్పరూపంలో నెలకొని వున్నది. ఆ గాథ యిది.

పాండవుల వనవాసంలో వేదవ్యాసమహర్షి వచ్చి శత్రువిజయార్థమై పాశుపతాస్త్రసిద్ధికై శివుడినిగూర్చి తపస్సు చేయవలసినదిగా ఆదేశించాడు. ధర్మరాజు అర్జునుని నియోగించాడు. అర్జునుడీ ఇంద్రకీల శిఖరంమీద ఒంటి కాలిపై నిలిచి ఊర్ధ్వబాహుడై పంచాగ్నిమధ్య తపస్సు మొదలుపెట్టాడు. ఘోరమైన ఆ తపస్సుకు పరమేశ్వరుడు సంతోషించాడు. అర్జునుడిని పరీక్షించవలెననిపించింది. కిరాతవేషం ధరించాడు. పార్వతి కిరాతివేషం ధరించింది. ప్రమధులంతా రకరకాల వేషాలు ధరించారు. వేదాలు వేటకుక్కలైనాయి. ఇలా యింద్రకీలంమీద శివుడు వేటాడుతూ ఒక అడవి పందిని అర్జునుని ముందుకు తరుముకు వచ్చాడు. అడవిపంది అర్జునునికి దగ్గరగా వచ్చింది. ఆయన మహావీరుడు కదా ! గాండీవం తీసుకొని ఒక్క బాణంతో దాన్ని కొట్టాడు. తరుముకు వస్తున్న కిరాతుడు అదేసమయంలో ఒక బాణంతో కొట్టాడు. రెండువ్రక్కల రెండు బాణాలు గ్రుచ్చుకొని 'గురగుర' ధ్వనితో 'గిరగిరా' తిరిగి ఆ అడవిపంది నేలకొరిగింది. నా బాణంతో చచ్చిందంటే నా బాణంతోనే చచ్చిందని తగాదా మొదలైంది. "నేను తరుముకువచ్చే పందిని కొట్టటానికి నీవెవడవురా ! నా వేట తమక మంతా చెడకొట్టావు. ఈ కిరాతిముందు నాకు తలవంపులైంది. అసలు తపస్సు చేసుకునేవాడివి నీవు పందిని కొట్టడం దేనికి ? ఈ వేషం నిన్ను కాపాడింది. లేకపోతే నేడు పందితోసహా నిన్నిక్కడ చంపియుండేవాడిని". అంటూ కిరాతుడు అర్జునుడిని రెచ్చగొట్టాడు. మహావీరుడైన అర్జునుడు ఈ బోయవాడు చేసిన తిరస్కారానికి మండిపోయాడు. అయినా నిగ్రహించుకొని 'పో! పోరా ! కోయవాడివి నీతో నాకేమిటి ? నా శివపూజకు ఆలస్యమవుతోంది' అన్నాడు కిరాతుడు. పట్టు విడువలేదు నిలబడి అర్జునుని

తిట్టసాగం మొదలుపెట్టాడు. పందిని కొట్టి వేట తమకం అంతా పాడుచేసి నందుకు ప్రాయశ్చిత్తంగా తన కోయసాని ఎదుట కుస్తీకి రమ్మన్నాడు. నీ శివ పూజ ఎక్కడికీ పోదులే ; అన్నాడు. ఈ కోయ సాని ఎదుట నీతో యుద్ధము చేయటానికి మనస్సు పొంగుతున్నది. నా పందిని కొట్టిన నేరానికి నీకిది తప్పదన్నాడు. చేసేదిలేక అర్జునుడు కిరాతునితో మల్లయుద్ధానికి సిద్ధమయ్యాడు.ఎంత మహావీరుడైనా అర్జునుడు పరమేశ్వరునిముందు తట్టుకోలేక పోయాడు. వెంటనే ఆయాసం వచ్చింది. డస్సిపోయాడు. ప్రాణానికి తెగించి పోరాడుతున్నా మనస్సులో శివుని మీద ఏకాగ్రత చెదరలేదు. ఇంతలో ఒకచిత్రం జరిగింది. ప్రాతఃకాలా ర్చనలో తానుశివలింగం మీద ఏ పూవులతో పూజించాడో ఆ పూవులు తాను పోరాడుతున్న కిరాతుని శరీరము మీదనుండి రాలటం కనబడింది.

ఆ కిరాతుడు సాక్షాత్పరమేశ్వరుడని తెలిసింది. వెంటనే కిరాతుడు మాయమైపోయాడు. ఎదుట తమ సమస్త పరివారంతో శివుడు నిలిచాడు. పాశుపతం అతనికి ప్రసాదించబడినది. ఈపరమ సన్నివేశానికి తార్కాణంగా యీ ఇంద్రకీలాద్రిమీద అర్జునుడు 'విజయేశ్వరలింగాన్ని' ప్రతిష్ఠించాడు. ఈ ఇంద్రకీలం మీద కొండలలో నిలిచిన ప్రాచీన దేవాలయాలెన్నో వున్నాయి. అవన్నీ కాలక్రమంలో శిథిలములై పూడిపోయినాయి. ఇళ్ళ రాళ్ళకోసం బెజవాడ కొండలు పగులగొట్టటంలో అవి బయటపడ్డాయి. అవన్నీ భద్రపరుపబడ్డాయి. విజయేశ్వరాలయంలో అద్భుతమైన శిలా శిల్పం ఒకటివుంది. దానిమీద నాలుగువైపులా కిరాతార్జునీయ కథ చెక్క బడివుంది.

మల్లేశ్వరస్వామి ఆలయముగూర్చి కొన్ని గాథలున్నాయి. ఇది కలి యుగానికిముందేవుంది. అగస్త్య మహర్షి యీ స్వామికి 'జయసేను'డని పేరుపెట్టాడు. మహాభారత వీరుడైన అర్జునుడు మల్లయుద్ధంలో గట్టి వాడు ! తన అనుభవాన్నిబట్టి అతడే స్వామికి మల్లేశ్వరుడని పేరు పెట్టాడు. ఆ స్వామి తన సాన్నిధ్యంచేత కృష్ణ ఒడ్డున వున్న విజయవాటిని అనుగ్రహిస్తున్నాడు.

ఇంకొక గాథలో యిలా వుంది. కలియుగంలో శాలివాహన శకం మొదట 117వ సంవత్సరంలో మాధవ వర్మ అనే ప్రసిద్ధుడైన రాజువుండే వాడు. చింతకాయలమ్ముకొని బ్రతికే ఒక స్త్రీ కొడుకు ప్రమాద వశాత్తు రాజకుమారుని రథం క్రింద పడి మరణించాడు. న్యాయార్థినియై వచ్చిన ఆ స్త్రీ మొఱ ఆలకించి ధార్మికుడైన ఆ రాజు తన కొడుకుకి మరణశిక్ష

విధించాడు. అతని ధర్మబుద్ధికానందించి మల్లేశ్వర స్వామి అతనిమీద కనక వర్షం కురిపించాడు. ఆ కనక వర్షం వల్ల ఆ అవ్వకొడుకూ, రాజకుమారుడూ పునరుజ్జీవితులైనారు. ఆ రీతిగా పరమేశ్వరుడు ఆ మహారాజు పేరు భూమిమీద శాశ్వతంగా నిలిపాడు. తరువాతి కాలంలో పండితారాధ్యుడనే మహా భక్తుడు శివభక్తులు ఋషీశ్వరులకంటే గొప్ప వారని లోకానికిచాటి దానికి నిదర్శనంగా జమ్మిచెట్టు కొమ్మకు 'కణకణ'లాడే పండు బొగ్గులు వస్త్రంలో కట్టి వ్రేలాడదీశాడు. ఆ వస్త్రంకాని చెట్టుకాని కాలిపో లేదు. మల్లేశ్వరస్వామి ప్రసన్నుడై తన భక్తుని ఎదుట సాక్షాత్కరించాడు. జన సామాన్యంలో ప్రచురమైన గాథను బట్టి యీ స్వామి 'మహాదేవమల్లేశ్వరుడు'! భక్త ప్రియుడు ఆయనను సేవించి పూర్వరాజులు వర్ధిల్లారు.

ఈ ఆలయంలో ఒక శాసనం తెలుగు లిపిలో వుంది. క్రీ॥శ॥ ౯వ శతాబ్దం నాటిది. ఈ శాసనం చిత్రంగా క్రిందనుండి పైకి చెక్కబడి వుంది. సారాంశం ఇది—

'పెచ్చవాడ కలియబోయ కుమారుడు త్రికోటిబోయి' అనే వాడు తన పేర తన కుల ప్రసిద్ధికై యీ స్థంభాన్ని నెలకొల్పాడు. శాసనంలో "త్రికోటిబోయి" అర్జునునికి ఇంద్రకీల మార్గం చూపడానికి ఇంద్రునిచే నియోగింపబడిన గుహ్యక యక్షుడుగా గుర్తింప బడినాడు అర్జునునికి మార్గం చూపిన సుకృతం వల్ల 'త్రికోటిబోయికి' పూర్వజ్ఞానం కలిగి అర్జునుడు తపస్సు చేసిన ప్రదేశంలో ఈ స్థంభాన్ని నెలకొల్పాడు. ఈ గుహ్యక వృత్తాంతం మహాభారతంలో లేదు. భారవిలో వుంది కాబట్టి ఇది భారవికి పూర్వంది.

పౌరాణిక ప్రశస్తి అలా వుండగా విజయవాడ ఆంధ్ర సంస్కృతికి ప్రధాన కేంద్రంగా గోచరిస్తుంది. ఒకప్పుడు కళ్యాణి చాళుక్యులు దీన్ని పలినారు. ప్రసిద్ధుడైన చైనా యాత్రికుడు 'హుయ్యాన్‌త్సాంగ్' ఈ ప్రదేశాన్ని క్రీ॥శ॥ ౬౩౯లో బౌద్ధమతం సదమోచ్చదశలోవున్న దినాల్లో దర్శించాడు.

ఇన్ని విధాల ప్రసిద్ధమైన విజయవాడ పెక్కుప్రాచీన దేవాలయాలకు నిలయమైవుంది, వానిలో ప్రధానంగా శ్రీకనకదుర్గాలయం మహిమాన్వితమై వేలకొలదీ యాత్రికులను నేటికీ ఆకర్షిస్తోంది

మంగళగిరి

బెజవాడ నుండి గుంటూరు వెళ్లే త్రోవలో బెజవాడకు 8 మైళ్ళ దూరంలో ఉన్నది మంగళగిరి. ఈ కొండ చరియ మీదనే వేంచేసి యున్నాడు తెలుగు నాట సుప్రసిద్ధ దైవమైన శ్రీ పానకాల నరసింహ స్వామి. ఏనాటి నుండియో యీ స్వామి దేశం నాలుగు చెఱగుల నుండీ తైర్థికులను ఆకర్షిస్తున్నాడు. రైలుస్టేషను దగ్గఱేవుంది. ఈ క్షేత్రానికి బెజవాడలో గాని గుంటూరులో గాని దిగి బస్సు మీద రావటం కూడా సులభమే. దేవస్థానం సత్రాలు మూడున్నాయి. అవికాక లోకల్ ఫండు సత్రం ఒక్కటీ, వైశ్యుల సత్రమూ, మాధ్వుల సత్రమూ, బ్రాహ్మణ సత్రమూ వున్నాయి. యాత్రికులు సుఖంగా ఉండవచ్చును.

నరసింహ స్వరూపంలో సేవలందుకొనుచున్న యీ నారాయణునకు పానకమంటే పరమ ప్రీతి. సరాసరి తన నోటిలో పానకంలో సగ పాలు ఈ స్వామి ప్రసాద చిహ్నంగా భక్తులకు అనుగ్రహిస్తూ ఉంటాడు. స్వామి త్రాగుచున్నట్లు "గుట గుట" శబ్దం వినవస్తుంది. ఆశబ్దం ఆగే సరికి పానకం వెలికి చిమ్ముతుంది. ఈ అద్భుతం రోజుకు ఎప్పుడో ఒకసారి మాత్రమే కాదు, ప్రతి యాత్రికుడు వచ్చినప్పుడూ జరుగ తూనే ఉంటుంది. ఒక్క చీమ అయినా దరిదాపులలో ఎక్కడా కనిపించదు. ఈ విశేషం వల్లనే యీదైవం "పానకాల స్వామి" గా ప్రసిద్ధుడయినాడు. ఈ క్షేత్ర చరిత్ర బ్రహ్మ. వైవర్త. పురాణంలో ఉన్నది. 'మంగళగిరి' అంటే 'శుభప్రదమైనకొండ' అని అర్థం. ఇది తూర్పు కనుమల వరుసలోనిదే, భారతవర్షంలోని ఎనిమిది మహాస్థలాలలో ఇదిఒకటి అంటారు. భక్తానుగ్రహార్థంస్వామి దీనిని నివాసంగా చేసుకున్నాడు. కృతయుగంనుండీ పానకాలస్వామి మహిమ వినవస్తూఉన్నది.

దూరానికి యీకొండ ఏనుగు ఆకారంలో కనిపిస్తుంది. దగ్గర నుంచి కూడా యీకొండ ఒరిగిన ఏనుగునే తలపిస్తుంది. స్థలపురాణం యిలా చెబుతున్నది.

పూర్వం పారియాత్రుడనే రాజు. ఆ రాజుకొడుకు 'హ్రస్వశృంగి' అంగవైకల్యంతో జన్మించినాడు. దానిని పోగొట్టుకోవడానికి తీర్థయాత్రలన్నీ తిరిగి తిరిగి చివరకు హ్రస్వశృంగి యీ స్థలానికి వచ్చి దేవతలఆదేశం ప్రకారం మూడేళ్ళు తపోనిష్టలో ఉండిపోయాడు. కొడుకు తీవ్ర తపోనిష్టకు తండ్రీ అలమటించాడు. బుజ్జగించి ఎలాగైనా తీసుకు వెడదామని వచ్చి కనిపెట్టుకొనియున్నాడు. తండ్రివెంట వెళ్లడాని ష్టంలేక హ్రస్వశృంగి ఏనుగువలె ఒదిగి కొండగా మారిపోయాడు. తన శరీరం స్వామికి నివాసమై పోవాలని అతని ఆకాంక్ష. భక్తుని అభిలాష మన్నించి శ్రీనరసింహస్వామి లక్ష్మీదేవితోసహా అచ్చటనే ఉండిపోయాడు.

తరువాత స్వామి అచ్చట 'నముచి' అనే రాక్షసుడిని తన చక్రంతో సంహరించటం జరిగింది.

ఈ స్వామికి కృతయుగంలో తేనె, త్రేతాయుగంలో నెయ్యీ, ద్వాపరయుగంలో పాలూ, కలియుగంలో పానకమూ నైవేద్యమని చెప్పుకుంటారు. ఇప్పటికీ శంఖంతో పానకం స్వామినోటిలో పోస్తారు. అందులో సగము స్వీకరించి సగము భక్తులకు ప్రసాదముగా అనుగ్రహిస్తాడు. ఈకొండ ఏనుగు ఆకారంగా ఉంటుంది కదా ఈగుడి సరిగా ఆ ఏనుగునోరువలె ఉంటుంది.

ఈ పానకం నోటిలో పోయటమూ, గుట గట 'శబ్దమూ', ఈ విశేషము యిలాఉండగా—ఇంకొక విగ్రహమేదీ యీకొండమీదలేదు. స్వామిముఖంమాత్రం అదే కొండలోనే చెక్కబడి ఉండటం మరీవిచిత్రం.

ఇంకొకగాథ త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు తానెంత ధర్మంగా పరిపాలించినా తరించలేక వచ్చి యీకొండను సందర్శించాడట. అందువల్లనే దీనికి 'తోతాద్రి' అనేపేరు వచ్చినట్లు చెబుతారు.

పూర్వం పాలసముద్రం తఱచినప్పుడు అందులోనుండి శ్రీమహాలక్ష్మి అవతరించింది. దేవతలు అన్ని పుణ్యనదుల తీర్థములూ తెచ్చి ఒక పుష్కరిణిని నిర్మించారు. శ్రీమహాలక్ష్మి ఆ పుష్కరిణిలో మునిగి శ్రీమన్నారాయణునికి తనను సమర్పించుకున్నది. ఆ పుష్కరిణి మంగళగిరిలో ఉన్నదంటారు. నేటికీ దానిని 'లక్ష్మీపుష్కరిణి' అనే పిలుస్తున్నారు.

కొండ దిగువన ఇంకొక గుడి ఉంది. అది యుధిష్ఠిర ప్రతిష్ఠ అంటారు. అక్కడకు ఆమడ దూరంలో ఉన్న ఇంద్ర కీలాద్రి మీదనే కదా పాశుపతం కోసం అర్జునుని తపస్సు! కిరాతార్జునీయం అక్కడి ముచ్చటే

గిదా! మంగళగిరికీ బెజవాడకూ యీ అన్నా దమ్ముల సంబంధం విస్పష్టంగా కనిపిస్తోంది పై లక్ష్మీనరసింహ స్వామినే కొండ దిగువన యుధిష్ఠిరుడు ప్రతిష్ఠించాడు.

ఈ క్షేత్ర పాలకుడు ఆంజనేయ స్వామి. శ్రీరామచంద్రునితో వైకుంఠానికి అనుగమించ నున్న ఆంజనేయ స్వామిని యీ లోక కల్యాణార్థమై మంగళగిరిలో ఉండవలసినదిగా ఆయన ఆదేశించినాడట!

శ్రీ చైతన్య మహా ప్రభువు (క్రీ. శ. 1312) ఈ ఆలయాన్ని దర్శించి నందుకు నిదర్శనంగా ఆయన పాద చిహ్నాలు, ఆయనపై చెప్పబడిన శ్లోకము, ఈ గుడిలో నేఁడు కానవస్తాయి? శ్రీ కృష్ణదేవరాయల శాసనం ఒకటి ఉంది. రాయలు ఈ ఆలయాన్ని దర్శించినట్లు తెలుస్తుంది.

దిగువన ఉన్న ఆలయానికి తూర్పున బ్రహ్మాండమయిన గాలిగోపురం ఒకటి కనిపిస్తుంది. అది 170 ఏండ్ల క్రింద అమరావతి ప్రభువు శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుగారు కట్టించినది. అది 11 అంతస్తుల గోపురం! ప్రాచీనమైన ఒక రథం ఉంది. భారత భాగవత రామాయణ గాథలు దానిమీద అద్భుతమైన దారు శిల్పంతో ఉన్నాయి. ఫాల్గుణ మాసంలో యిచ్చట 12 రోజులు బ్రహ్మోత్సవం జరుగుతుంది వైకుంఠైకాదశీ, శ్రీరామ నవమి, హనుమజ్జయంతీ, నరసింహ జయంతీ సరేసరి. బ్రహ్మాండమైన గాలి గోపురమూ, కొండమీది శ్రీ నరసింహ స్వామీ, ఎంతదూరం నుంచియైనా యాత్రికులను ఆకర్షిస్తూ ఉంటాయి. పౌరాణికంగా, చారిత్రకంగా ప్రసిద్ధమైన మంగళగిరి ఆంధ్ర దేశంలోని ప్రసిద్ధ దివ్య స్థలాలలో ఒకటిగా పరిగణింపబడుతోంది.

60



వేములవాడ ఆలయప్రాంగణం

వేములవాడ

ఆంధ్రప్రదేశములోని కరీమునగరము మండలములో కరీమునగరము నుండి కామారెడ్డికి వెళ్లే త్రోవలో కరీమునగరానికి ఇరవై మైళ్ల దూరములో వేములవాడ వున్నది. ఇప్పుడు దొరుకుచున్న శాసనాధారాలను పట్టి వేములవాడ పశ్చిమ చాళుక్యులనాటి నుండి వున్న ప్రాచీన గ్రామమని తెలియవస్తోంది. పశ్చిమ చాళుక్య నిర్మితమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి నిలయ గా వేములవాడ ప్రసిద్ధికెక్కింది. ఇచ్చట ఇంకొక ఆలయం కూడా వుంది. వద్దేశ్వరస్వామి ఆలయమని! అది భగ్నస్థితిలోనే వున్నది వేములవాడను ఏలిన పశ్చిమ చాళుక్యులలో మొదటి వినయాదిత్య యుద్ధమల్లుని మనుమడైన మొదటి నరసింహుడు ఈ ఆలయాన్ని కట్టించాడు. అతనికి రాజాదిత్యుడనే బిరుదం వున్నది ఆ రాజు కట్టించిన గుడి యైనందువల్లనో, ఆ రాజు బిరుదం మీదుగానో, దీనికి 'రాజేశ్వరాలయం' అనే పేరు వచ్చింది ఆలయానికి ఉత్తరం వైపున ధర్మకుండమనే పేరు గల ఒక పెద్ద చెరువు వుంది. ఈ గ్రామం ప్రక్కన ప్రవహించే యేటినుండి యీ చెరువులోనికి నీటి పారుదల వున్నది.

ఈ సుప్రసిద్ధ ప్రాచీన దేవాలయం యొక్క పుట్టుకను గూర్చి మనకు నిశ్చితమైన ఆధారాలున్నాయి. త్రిభువనమల్లుని సామంతుడైన రాజాదిత్యుడు చాళుక్య విక్రమ శకం 9 వ సంవత్సరంలో ఈ స్వామిని ప్రతిష్ఠించి ఈ గుడి కట్టించినట్లు ఈ ఆలయంలోని శాసనం చెబుతోంది. ఉపలబ్ధమైన ఇంకొక శాసనం వేములవాడ చాళుక్యులలోని 'అరికేసరి' అనే రాజుకు 'రాజాదిత్య' అనే బిరుద నామం వున్నదని చెబుతోంది. ఈ చాళుక్య సామంతులు క్రీ.శ. 9, 10 శతాబ్దాలనాటి వారు. కాబట్టి ఈ ఆలయం వెయ్యి సంవత్సరాల నాటిది. ఈ ఆలయావరణంలో అనేక శివలింగాలతోపాటు జైన, బౌద్ధ విగ్రహాలు కూడ కనబడ్డాయి. కాని ఇవన్నీ తరువాత చేర్పులే. ఇలాగే ఇదే ఆవరణంలో రాజేశ్వరస్వామి గుడి వెనక శేషశాయి గుడి అని వుంది! వీటితోపాటు ఈ గ్రామంలోనే మరి రెండు గుడులున్నాయి. భీమేశ్వరస్వామి గుడి అని, కేదారేశ్వరుడి గుడి అని. ఈ రెండూ ప్రాచీన తమ ఖ్యాతి గలవి. ఈ రాజేశ్వరాలయ నిర్మాణానికి పూర్వమే ప్రసిద్ధములైనవి. ఈ విషయం రాజేశ్వర మహాత్మ్యంలో వున్నది. 'భీమేశ్వరుడే రాజేశ్వర రూపాన్ని ధరించాడు.

నరేంద్రుడనే రాజు రెండవ ఆలయం కట్టిన నాటి నుంచీ వేములవాడ భీమకవి అనే సుప్రసిద్ధుడైన తెనుగు కవి యిచ్చటి స్వామి అనుగ్రహం వల్లనే అంతటివాడు అయినాడని చెప్పుకుంటారు. ఈ వేములవాడ చాళుక్యుల వంశక్రమాన్ని ఇప్పటి చరిత్ర జ్ఞానాన్ని బట్టి మనం సరిగ్గా నిర్ణయించలేము. ఇప్పటి వంశక్రమం వేములవాడ శాసనం మీద పంపకవి విక్రమార్జున విజయ లోని విషయాలమీద ఆధారపడివుంది. దీన్ని బట్టి ఈ వంశక్రమం మొదటి వినయాదిత్యునితో మొదలవుతుంది. ఇతని తరువాత మొదటి అరికేసరి. ఇతని తరువాత నరసింహావర్మ రాజాదిత్యుడు. ఈ రాజుల పరస్పర సంబంధం కూడ స్పష్టంగా తెలియదు కాబట్టి ఈ ఆలయం నరసింహావర్మ రాజాదిత్యుడు కట్టించాడనుకోవాలి. ఇతడు పై వరుసలో మూడవ రాజు. రాజేశ్వ రాలయం' అనే విస్పష్టమైన పేరును బట్టి ఈ గుడి ఆ రాజు కట్టించినదైనా అయివుండాలి. లేక ఆ రాజు పేరుతో వాడుకలోకి వచ్చినదైనా అయి వుండాలి.

వేములవాడ రాజేశ్వర మహాత్మ్యం అనే పేర ఒక స్థలపురాణం వున్నది. దీని ప్రకారం భవిషోత్తర పురాణాన్ని పట్టి ఈ స్వామియొక్క పౌరాణికమైన పూర్వ చరిత్ర తెలుస్తుంది. ఈ ఆలయానికి సంబంధించిన గాథ ఇలా వుంది :-

పూర్వం నరేంద్రుడనే గొప్ప రాజు వుండేవాడు. అతడు పాండవ వీరుడైన అర్జునుని మనుమడు. అతడొకనాడు వేటకు వెళ్ళి ప్రమాద వశాత్తు మడుగులోంచి నీరు తెస్తున్న ఋషిని కొట్టాడు. తెలియక చేసిన పాపానికి ఆ రాజు చాలా పరితపించాడు కాని బ్రహ్మహత్యా దోషం అతడిని వదలలేదు. దాన్ని పోగొట్టుకోవటానికి అతడు అనేక పుణ్యస్థలాల్లో పరిభ్రమించాడు కాని లాభం లేకపోయింది. చిట్టచివరికి అతడు వేములవాడ వచ్చి యాదృచ్ఛికంగా ధర్మకుండంలోని నీళ్లు మూడు దోసిళ్లు తాగాడు. ఆ రాత్రి కలలో స్వామి కనిపించి యీ ధర్మకుండం అడుగున రాజేశ్వరుడనే శివుని గుడి వున్నదనీ దాన్ని పైకి తీసి అర్చనకు వీలుగా చెరువు గట్టున ప్రతిష్ఠించవలసినదనీ చెప్పాడు. ఆ ప్రకారం రాజు ధర్మకుండంలో వెదికి లింగాన్ని వెలికి తీసి ఆ చెరువు గట్టునే ప్రతిష్ఠించాడు. అప్పటి నుంచీ యీ స్వామి 'రాజేశ్వరు' డయినాడు.

ఈ గాథకు అనుబంధంగా ఇది కూడా వున్నది. వృత్రాసురుడిని చంపి బ్రహ్మహత్యతో బాధపడుతున్న ఇంద్రుడు బృహస్పతి ఆదేశానుసారం ఈ ధర్మకుండంలో స్నానం చేసిన పిమ్మటనే ఆ దోషం నుండి విముక్తుడయినాడు.

ఈ ధర్మకుండం మహిమను గూర్చి వేరొక గాథ వుంది. పూర్వం సర్వదేవతలనూ అతిశయించాలనీ దక్షప్రజాపతి ఒక గొప్ప యజ్ఞం తలపెట్టాడు. దేవతలందరూ అలజడిపడ్డారు. యజ్ఞ ఫలం అతనికి దక్కనీయకుండా చెయ్యాలని సూర్యుడు ఆకస్మికంగా ఆ యజ్ఞానికి వచ్చి హవిస్సును కైవసం చేసుకోవాలని ప్రయత్నించాడు. కాని హవిస్సును తాకటంతోనే అతని రెండు చేతులూ తెగిపోయి అతడు 'మొండి' అయిపోయినాడు. చికిత్సకోసమని అతడు ఇతర దేవతలతో విచారించాడు. దేవతలు ధర్మకుండానికి వెళ్ళి నూరేళ్ళు తపస్సు చేయమన్నారు. ఆ ప్రకారం తపస్సు చేసి సూర్యుడు తిరిగి తన సువర్ణ బహువులను పొందాడు. రాజేశ్వరాలయ నిర్మాణానికి పూర్వమే ఈ క్షేత్రంలో ధర్మకుండం వున్నదని చెబుతారు. ఈ క్రింది శ్లోకం ధర్మకుండం మహిమను వివరిస్తోంది.

శ్రీశైలే దర్శనాన్ముక్తిః కాశ్యాంతు మరణాద్ధ్రువమ్

అన్యత్ర తపసా క్షేత్రే ధర్మకుండస్య నామతః

దర్శనంవల్ల శ్రీశైలంలో ముక్తి. మరణంవల్ల కాశీలో ముక్తి. ఇతర క్షేత్రాల్లో తపస్సు చేత ముక్తి. ధర్మకుండం. యొక్క నామోచ్చారణ మాత్రం చేతనే ముక్తి

రాజరాజేశ్వరాలయ సాన్నిధ్యాన్ని పట్టి వేములవాడ ఆంధ్రదేశంలోని ప్రసిద్ధ శివాలయాలలో ఒకటిగా పరిగణింప బడుతోంది. దేశం అన్ని ప్రాంతాల నుండి వేల కొలదీ యాత్రికులు స్వామి దర్శనార్థమై ఇక్కడ గుమికూడుతారు. మాఘ, ఫాల్గుణ మాసాల్లో వరద వచ్చినట్లు వచ్చే యాత్రికుల సంఖ్య వేలను దాటుతుంది. మహా శివరాత్రి సమయంలో ఈ సంఖ్య మరీ పెద్దదవుతుంది. ఇచ్చట ఏటేటా ఫాల్గుణ పూర్ణిమ నాడు స్వామి కళ్యాణోత్సవం మహా వైభవంగా జరుగుతుంది. వేల కొలది యాత్రికులు వచ్చి స్వామికి కానుకలు సమర్పించే రోజులుకొన్ని వున్నాయి. ఈ కొద్ది రోజుల్లో వచ్చే ఆదాయమే రూ. 3, 4 లక్షలకు మించి వుంటుంది.

సామాన్యంగా ఇతర పుణ్యక్షేత్రాలలో జరిగే అర్చనలతో పాటు ఈ ఆలయంలో ఒక ప్రత్యేకమైన అర్చన జరుగుతుంది. దాని పేరు సహస్ర సువర్ణాభిషేకం. వెయ్యి సువర్ణాలతో స్వామిని అర్చిస్తారు. ఈ స్వామికి గిత్త దూడలను కానుకలుగా సమర్పిస్తారు. వేల కొలది గిత్తలను మ్రొక్కుబడులుగా ఇక్కడి స్వామికి భక్తులు సమర్పిస్తూ వుంటారు.

ప్రస్తుతం ఈ ఆలయ యాజమాన్యాన్ని ఆంధ్రప్రదేశ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆలయంలో ఒక సత్రాన్ని, పాఠశాలని నడుపుతోంది. సంవత్సరానికి అయిదారు వేల గ్రాంటు తీసికొనే పండిత కుటుంబాలు ఇక్కడ నూట ఇరవై వున్నవి. స్వామికి నిత్యము జరిగే అర్చనలోనూ పాల్గొనటం వారివిధి. వీరందరూ చేరి స్వామి పాదాల దగ్గర అర్చనలు చేసే దృశ్యం రమణీయంగానూ ఉదాత్తంగానూ వుంటుంది.

గొప్ప చరిత్ర ప్రాధాన్యం కల వేములవాడ నేటికీ వేల కొలది యాత్రికులను తన ఆలయం యొక్క పావనత్వం చేత ఆకర్షిస్తూ వున్నది.

అ మ రా వ తి

ప్రపంచ శిల్పకళలలో "ఆంధ్ర శిల్పాని"కి అమరావతి పర్యాయ పదమై వెలసింది. జగత్ ప్రసిద్ధములైన అమరావతీ బౌద్ధశిల్పాలు 'ఆంధ్ర శిల్ప' మనబడే సంప్రదాయానికి సమగ్ర లక్ష్యాలుగా నిలిచాయి.

గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాకు చెందిన యీ ప్రదేశం 'అమరేశ్వర స్వామి' గా ఆరాధింప బడుతున్న శివునికి నిలయమైనందువల్ల కూడ "అమరావతి" అని ప్రసిద్ధి కెక్కింది.

గుంటూరుకు వాయవ్యదిశలో 20 మైళ్ళ దూరములో బస్సుప్రయాణ సౌకర్యంతో అమరావతి ఉన్నది. బెజవాడలో దిగి గుంటూరు వెళ్ళ వచ్చును. గుంటూరు నుండి అమరావతికి కావలసినన్ని బస్సులున్నాయి. అమరావతిలో ట్రావెలర్సు బంగళా, కొన్ని సత్రాలూ, శాలలూ యాత్రికుల వసతికి ఉన్నాయి.

అమరావతీ, దానికి చేరువనే ఉన్న ధరణికోట పూర్వాంధ్ర చక్రవర్తులకు రాజధానులు. పురాతత్వ పరిశోధనకు పనికివచ్చే సామగ్రి యిచ్చట కావలసినంత ఉన్నది. మహోన్నతమైన అమరేశ్వరాలయం కృష్ణ ఒడ్డున పడమటి నుండి తూర్పునకు ప్రవహించే ఆ మహానది ఉత్తర దక్షిణములుగా మలగిన చోట నిర్మించబడినది. ఎక్కడెక్కడ తమ ప్రధాన మార్గంలో నదులు ఇలా మలుపు తిరిగి కొంత మేర ప్రవహిస్తూ ఉంటాయో ఆ ప్రదేశాలు ఆలయ నిర్మాణానికి తగిన పరమ పవిత్ర స్థలాలుగా పరిగణింపబడుతున్నాయి.

పౌరాణికములూ, చారిత్రకములూ అయిన గాథలెన్నో ఉన్నా యీ దేవాలయం పుట్టు పూర్వోత్తరాలు నేటికీ విస్పష్టంగా తెలియడం లేదు. కాని ఇచ్చటి ఏకాంత స్థితీ, పావనత్వమూ, వేల కొలది యాత్రికులను ఈనాటికీ ఆకర్షిస్తూనే ఉన్నది.

ఈ ఆలయం కృష్ణ ఒడ్డున కుడి వైపున ఉంది. నాలుగువైపులా మహోన్నతములైన గోపురాలు ద్రవిడ శిల్ప సంప్రదాయానుగుణంగా ఉన్నాయి. విమానం మీది శిల్పం కూడా యీ సాంప్రదాయాన్నే

సూచిస్తోంది. ఇది మొదట బౌద్ధాలయమనీ తరువాత ఇలా మార్చబడిందనీ ఒక వదంతి ఉంది, ఈ వాదంలో కొంత బలం వున్నట్లే అనిపిస్తుంది. ఆలయం పునాది రాళ్ళన్నీ బౌద్ధ లక్షణం కల శిలా ఫలకాలే గర్భ గృహంలో సరిగా మూల విరాట్టు మీదుగా పాల రాతి మీద చెక్కిన పద్మం కాన వస్తుంది. పరమ సుకుమారమైన ఆ శిల్ప శైలి ప్రాచీన బౌద్ధానికి సంబంధించినదే. లింగంఎత్తు సుమారు 15 అడుగులు. ఒక వదంతి. పూర్వం ఇది ఆయక స్థంభమనీ—తరువాత శివ లింగంగా ప్రతిష్ఠితమై పూజింపబడుతోందని. ఈ ఆలయం ప్రస్తుత స్వరూపం ద్రవిడ దేవాలయశిల్పానికి "నమూనా" గా ఉంది. గోపురాలు ప్రాధాన్యంలోకి వచ్చింది మధ్య యుగంలోనే. క్రీ॥శ॥ 11వశతాబ్దానికి పూర్వపు శాసనం ఇచ్చట ఏదీ లేనందు వల్ల యీ ఆలయం తరువాతి కాలంలో నిర్మించబడిందనే భావింపబడుతోంది.

పురాణ గాధలను బట్టి అమరావతీ, అమరేశ్వరాలయమూ, బహు ప్రాచీన కాలం నాటివని తెలుస్తోంది స్కాంద పురాణంలో యీ ప్రదేశమూ, ఆలయమూ, సమగ్రంగా చిత్రీకరింపబడ్డాయి,జన ప్రచారంలో ఉన్న గాధలూ, స్థల పురాణమూ యిలా చెబుతున్నాయి.

ద్వాపరం చివర కలియుగం ఆరంభంలో అంటే 5058 సంవత్సరాలకు పూర్వం శౌనకాది మునులు నారద మహర్షిని ముక్తి సాధన మార్గాన్ని అడిగారు. నారద మహర్షి వారికి ఇలా చెప్పాడు..పరమేశ్వరుడు అయిన కృష్ణుని జలమయ స్వరూపం కృష్ణ కాబట్టి కృష్ణా తీర నివాసమూ, కృష్ణా స్నానమూ, ముక్తి సాధనాలు అంటూ వారికి అమరేశ్వర పురాణాన్ని యీ విధంగా వివరించాడు. కృష్ణ దక్షిణ తీరాన శ్రీశైలానికి ఆగ్నేయాన అమరేశ్వరుడున్నాడు ఆ స్వామి వెలసి ఉన్న ప్రదేశం పరమోత్తమం. ఇచ్చట మూడు మహా విషయాల సన్నివేశం ఉంది. అది తీర్థమూ, క్షేత్రమూ, దైవత్వమూ కలిసిన చోటు కృష్ణ తీర్థము. మహిమాన్వితమైన క్షేత్రము శ్రీ మహాలింగమూర్తి దైవతము. కృష్ణాతీరంలో అమరేశ్వరస్వామిని సేవిస్తే కోరికలు ఫలిస్తాయి. దేవతల ప్రార్థనపై యిందుకోసమే శివుడు అమరేశ్వర రూపంలో అక్కడ వెంచేసి ఉన్నాడు. ఇంద్రుడూ కపిల మహర్షి ఆ స్వామిని సేవించారు. అటువంటిది కాబట్టే క్షేత్రాలలో కెల్లా అది మిక్కిలి పావనమైంది. అచ్చటి స్వామిని సేవించిన వారికి పునర్జన్మ లేదు. కృష్ణలో ఎన్నో పుణ్య తీర్థాలు కలిసాయి. అందులో స్నానంచేసి అమరేశ్వరస్వామిని సేవించిన వారి పాపాలన్నీ నిశ్శేషంగా నాశనమై పోతాయి. ఈ పుణ్య క్షేత్రంలో శివుడు

పంచలింగాకారములతో ఉన్నాడు. పణిణవేశ్వరుడనీ, అగస్త్యేశ్వరుడనీ, కోనశేశ్వరుడనీ, సోమేశ్వరుడనీ, పార్థివేశ్వరుడనీ- ఏ భక్తుడయినా యీ క్షేత్రంలో మూడు రోజులకు పైగా నివసించి పుణ్యనదియైన కృష్ణలో స్నానం చేసి భక్తి విశ్వాసములతో స్వామిని సేవించి నట్లయితే వాడు నరాసరి శివలోకానికి వెళతాడు. ఇక్కడ ఏ భక్తుడైనా మరణించి నట్లయితే శివునిలో లీనమై పోతాడు.

ఈ క్షేత్ర మాహాత్మ్యాన్ని గూర్చి క్షేత్రమూర్తి మాహాత్మ్యాన్ని గూర్చి స్థల పురాణ గాథలిలా ఉన్నాయి.

పూర్వం ధాన్యకటకం అనే పట్నం ఉండేది. ధాన్యకటకమంటే కాశీ నగరమే. అమరేశ్వరుడే విశ్వేశ్వరుడు. ఇచ్చటి కృష్ణానది గంగా నది కంటే వేఱుకాదు. ఈ స్థల మహాత్మ్యాన్ని బట్టి యిచ్చటికి వచ్చి కృష్ణాస్నానంచేసి అమరేశ్వరస్వామిని సేవిస్తే కాశీవెళ్ళి గంగాస్నానం చేసి విశ్వేశ్వరుణ్ణి సేవిస్తే ఏ ఫలం కలుగుతుందో అదేఫలం కలుగుతుంది. ధాన్య కటకంలో శివుడు తన ప్రమథ గణములతో సహానివసిస్తున్నాడు. ఆయనకు క్రౌంచనాథుడని కూడా పేరు. క్రౌంచపురియే అమరావతి! పురాణగాథ యిలా వున్నది. ఒకప్పుడు దేవతలు రాక్షసులు చేత ఓడిపోయారు. ఆ రాక్షసులను సంహరిస్తానని శివునిచేత వరంపొంది కాందిశీకులైన దేవతలు అందరూవచ్చి ధాన్యకటకంలో ఉన్నారు. అప్పటినుండీ దీనికి అమరావతి అనే వాడుక వచ్చింది. గాథ యిలా చెబుతోంది. పూర్వం ఇంద్రునికీ, తారకుడనే రాక్షసునికీ పదివేల సంవత్సరాలు యుద్ధం జరిగింది. చివరకు తారకుడు గెలిచాడు. దేవతలు భయపడి మహావిష్ణువును శరణుజొచ్చారు. విష్ణువు వారితో ఇలా అన్నాడు. వాడు మహా శివభక్తుడు. వాని శక్తి అంతా శివుడిచ్చింది. అటువంటి శివభక్తుణ్ణి చంపడం తనకు సముచితం కాదని, వెళ్ళి శివునికే మొఱపెట్టుకోమని సలహా యిచ్చాడు. శివుడు దేవతల మొఱవిని తారకాసురుణ్ణి చంపడం తనకూ సాధ్యం కాదన్నాడు. దీన్ని బట్టి ఏ దోషాలు ఎలా ఉన్నా నమ్మిన భక్తునికి హాని చెయ్యడం పర మేశ్వరునికే సాధ్యంకాదని తెలుస్తోంది. తారకాసురుడంత మహాభక్తుడు.

చివరకు శివుడు తారకునితో యుద్ధానికి దేవసేనలను నడిపించడానికి కుమారస్వామిని నియోగించాడు. సేనలముందు నిలిచి కుమారస్వామి తారకునితో తలపడ్డాడు. యుద్ధం ఎడతెగకుండా సాగుతోంది. ఆయనకూ తారకుణ్ణి గెలవలేను అనిపించింది. అందరూ మళ్ళీ శివుని దగ్గరకు వెళ్ళారు. ఆయన ఇలా చెప్పాడు. వాడెంత భక్తుడంటే శివునితో తాదాత్మ్యం పొందాడు. వాని కంఠ దేశంలో శివలింగం ఉంది. ఆ లింగంలో వాని

ప్రాణం ఉంది. మీరా లింగాన్ని భేదించగలిగితే వాడు మరణిస్తాడు. వానికి శివుడులేని బ్రతుకు నిరర్థకం శివుడింకా యిలా చెప్పాడు. ఆ లింగ శకలాలు ఏయే క్షేత్రాలలో పడతాయో అక్కడ పెరుగుతాయి. ఆవద్ద చోట్లకుపోయి ఎక్కడి వక్కడ ప్రతిష్ఠిస్తే అవి యింక పెరగవు. వెళ్ళమన్నాడు.

ఆ ప్రకారం కుమారస్వామి తారకుడి కంఠదేశములో ఉన్న శివలింగాన్ని ఐదు శకలాలుగా ఖండించాడు. ఐదూ ఐదుచోట్ల పడ్డాయి. అందులో పెద్దది మొదటి శకలం! అది పడిన చోటికి శివుడు చెప్పినట్లు ప్రతిష్ఠించటానికి యింద్రుడు బృహస్పతితో సహా వెళ్ళాడు. నేలనుండి ఆకాశాన్నంటుతూ ఉన్న ఆ లింగాన్ని ప్రతిష్ఠించటం గూర్చి బృహస్పతిని అడిగాడు. ఆయన ఆశ్వయుజ శుద్ధ దశమినాడు ప్రతిష్ఠించ మన్నాడు. ఇంద్రుడారీతిగా ప్రతిష్ఠించి అమరేశ్వరుడని పేరుపెట్టి ఆ లింగాన్ని ఆరాధించాడు.

రాక్షస గురువు శుక్రుడు వచ్చి బృహస్పతిని ప్రశ్నించాడు. కృష్ణ వరదలు వచ్చి మునిగిపోవటానికి వీలైనచోట లింగాన్ని ఎలా ప్రతిష్ఠింప జేశావని బృహస్పతి ఇలా చెప్పాడు, ఈ శకలం పడినచోట భూమిలో పాతాళం వరకు క్రౌంచమనే పర్వతం ఉంది. ఈ శకలం ఆకొండ మీద పడి పెరగడం మొదలు పెట్టింది. అందువల్ల కృష్ణ వరదల్లో పొంగినా ఏమీ సంభవించదనీ-కృష్ణయే ప్రవహించటానికి యింకొక త్రోవ పట్టుతుందనీ, ఇందువల్లనే యిచ్చట కృష్ణ ఉత్తర దక్షిణాలుగా ప్రవహిస్తోంది.

బృహస్పతి ఆదేశానుసారం అమరేశ్వరుని చుట్టూ దేవతలు, అంబిక మొదలైన పరివార దేవతలను ప్రతిష్ఠించారు. అమరావతిలో యక్షులూ, కిన్నరులూ కూడా ఉన్నా దేవతలు చిరకాలం ఉన్నందువల్ల అమరావతి అనే పేరు వచ్చింది. మిగిలిన శకలాలు నాలుగూ పడిన చోట్లు - భీమారామము (గుణుపూడి భీమవరం) క్షీరారామం (పాలకొల్లు), దక్షారామం, కుమారారామము (సామర్లకోట).

అమరేశ్వరస్వామి తనభార్య బాలాచాముండికాంబతో సహా యిచ్చట సేవలందు కొంటున్నాడు. ఈమె అష్టాదశ శక్తి పీఠాల్లో నాలుగవ పీఠంగా భావింపబడుతోంది. ఆలయంలో యింకా ముఖ్యమైన యితర దేవతలు చాలమంది ఉన్నారు.

ప్రస్తుతం అమరావతిలోని యీ ఆలయానికి రాజా (శ్రీ) వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుగారు చేసింది చాలా ఉన్నది. ఆయన 18వ శతాబ్ది

లోని మహాపురుషుడు. "అటునుంచి నరుక్కురా!" అనే సామెత తెనుగు దేశంలో ఆయనవల్లనే పుట్టిందంటారు. దేశంలో చెలరేగిన దారిదోపిళ్ళనూ తిరుగుబాట్లనూ అణచటానికి ఆయన చెంచులను వరసగా నిలబెట్టి తలలు కొట్టించవలసి వచ్చింది. అందువల్ల ఆ ప్రభువునకు చిత్తశాంతి లోపించింది. లోపించిన ఆ చిత్తశాంతి అమరావతికి వచ్చిన తరువాత ఆయనకు తిరిగి లభించింది. ఆయన తన తండ్రి పేరిట జగ్గయ్యపేట, తల్లి పేరట అచ్చంపేట, తన పేరట రాజపేట నిర్మించాడు. 1796లో తన నివాసం చింతపల్లి నుండి అమరావతికి మార్చి జీవితాంతమూ, తన కాలము, తన రాబడీ, శివాలయ నిర్మాణాలకే వినియోగించాడు ఆ మహాప్రభువు! ఆయన అమరేశ్వరాలయాన్ని పునరుద్ధరించాడు. నిత్యార్చనలకు విద్వాంసులైన తొమ్మండుగురు అర్చకులను ఏర్పాటుచేసి వారందరికీ జీవనోపాధులు కల్పించటమే కాక ఒక్కొక్కరికి 12 ఎకరముల భూమిని దానంచేసాడు. ఈ ఆలయం ప్రస్తుత స్థితికి ఆయనే కారణం.

ఈ ఆలయ కుడ్యాలపై శాసన సంపద చాలఉంది. అమరావతి ప్రభువులైన 'కోట' వారివీ-కొండవీటిరెడ్డి రాజులవీ-శ్రీకృష్ణదేవరాయలు ఇచ్చట ఒక మంటపం కట్టించి శాసనం వేయించారు. 'కొప్పనికేసానిర్మ' సామంతుడైన ప్రోలినాయని భార్య ముఖ మంటపంలో ఒక స్తంభంమీద శాసనం వేయించింది. జగత్ప్రసిద్ధమైన బౌద్ధ స్తూపంమాట చెప్పనిదే ఎన్నిచెప్పినా అమరావతిని గూర్చి పూర్తిగా చెప్పినట్లుకాదు. కేవల నిర్మాణ సౌష్ఠవాన్ని బట్టి చూచినా-శిలలలో మలచిన పరమ సుకుమారములైన రసభావాలను పట్టి చూచినా ఉదాహరణకు 'ప్రజాపతి గౌతమి'తో వివాహమైన సందర్భములో నందుని బౌద్ధ మఠాను ప్రవేశఘట్టమూ, ఉన్మత్త గజమైన 'నలగిరిని' బుద్ధ దేవుడు వినమ్రము చేసిన ఘట్టమూ, బుద్ధుని జీవితంలోని వివిధ సన్నివేశాలూ అమరావతీ శిల్పమునందు విన్యసింపబడి అజరామరములై నిలిచియున్నవి. వానిని పోలినవి ప్రపంచములో మరి యెచ్చటనూ లేవు. వానికి అవియే సాటి.

పూర్వమిచ్చట గొప్ప విద్యాపీఠమున్నట్లు తెలియుచున్నది. చైనా, జపాను, టిబెట్టు, సయాం, సిలోనుల నుండి వచ్చిన విద్యార్థులిచ్చట చదువు చుండెడివారు.

అమరావతికి గుంటూరు నుండి బస్సు మీద గాని బెజవాడ నుండి కృష్ణమీద స్టీము లాంచీ మీద గాని పోవచ్చును. ఇరువది మైళ్లు మాత్రమే. ట్రావెలర్సు బంగళాయే కాక యాత్రికుల వసతి సౌకర్యమునకు మంచి సత్రములు కూడ కలవు.

ఇచ్చటి ఉత్సవములు మహాశివరాత్రి, నవరాత్రి కల్యాణోత్సవములు మొదలైనవి.

ఈ రీతిగా ఆంధ్రదేశములో అమరావతి కృష్ణా తీరంలో ముఖ్యమైన పవిత్రక్షేత్రంగా, యాత్రా స్థలంగా, బౌద్ధులకూ హిందువులకూ ప్రధాన స్థానమై ప్రకాశిస్తోంది.

అహోబలం

బహు ప్రాచీనమైన దివ్యస్థలం అహోబలం!

కర్నూలు మండలంలోని నంద్యాల రైలు స్టేషనుకు ముప్పయిమైళ్ళ దూరంలో అహోబలము వున్నది. నంద్యాల నుండి అహోబలానికి సమృద్ధిగా బస్సులున్నాయి. ఆంధ్రదేశంలోని మరికొన్ని జిల్లా ప్రధాన కేంద్రాల నుండి కూడ అచ్చటికి బస్సులున్నాయి.

అహోబలానికి వెళ్ళే మార్గాలు మూడువున్నాయి. ఉత్తరాది నుండి వచ్చే యాత్రికులు నంద్యాలలో రైలు దిగి అచ్చటికిముప్పయిమైళ్ళలోవున్న అహోబలానికి బస్సుమీద ఆళ్లగడ్డ మీదుగ వెళ్ళవచ్చును. రెండవది 'దోను' లో రైలు దిగి అచటి నుండి బనగానపల్లి, కోయిలకుంట్ల మీదుగా అహోబలము చేరవచ్చును. మూడవది సులభమైన మార్గం కడపలో రైలు దిగి అచ్చటికి నలబై మైళ్లలో వున్న ఆళ్ళగడ్డ వచ్చి అక్కడి నుండి అహోబలానికి రావచ్చును.

ఈ ప్రదేశాన్ని 'సింగవేలు కుండ్రం' అని కూడా అంటారు. ఇది శ్రీ నరశింహ క్షేత్రం! శ్రీమన్నారాయణుడు ప్రహ్లాద సంరక్షణార్థమై హిరణ్యకశిపుణ్ణి సంహరించడానికి యీ రూపం ధరించవలసి వచ్చింది. నారాయణుణ్ణి నరశింహ రూపంలో ప్రతిష్ఠించుకొన్న దివ్యస్థలాలు ఎన్నో వున్నాయి. కాని ఒక్క అహోబలంలోనే ఆ అవతారం యొక్క సమగ్ర వైభవాన్ని ఆరాధించుకొనే అవకాశం వున్నది. ఇక్కడ ఆ అవతారం యొక్క అన్ని రూపాలూ విజయం చేసి వున్నాయి. ఇచ్చట నవనారశింహులూవున్నారు.

పర్వత పాదం సమీపించటం తోనే ప్రహ్లాద వరద నరసింహ దేవాలయం కనిపిస్తుంది. స్వామి ప్రహ్లాదుని అనుగ్రహించిన రూపం ఇది. ఈ ఆలయం మూడు ప్రాకారాల నడిమి భాగంలో ఉన్నది, ఇది విజయనగరం శిల్పశైలిలో నిర్మింపబడి వున్నది. ఈ ఆలయానికి ఫర్లాంగు దూరంలో ఆళ్వార్లు కోనేరు వున్నది. అది యీ క్షేత్రంలో పానీయ జలాన్ని ప్రసాదిస్తోంది. ఇక్కడికి మైలున్నర దూరంలో ఛత్రావిత నరసింహ స్వామి వేంచేసియున్నారు. ఈ స్వామి చుట్టూ అన్నీ ముళ్ళ పొదలు! స్వామి

1170—10

విగ్రహం ఒక రావి చెట్టు క్రింద ప్రతిష్ఠితమై వున్నది. పర్వత పాదం నుండి ఎగువ అహోబలం చేరటానికి కొండ ఎక్కాలి ! ఈ పర్వత మార్గం రమారమి 6 మైళ్ళు. ఇది కన్నెకొండల మీదుగా అడవుల మీదుగా అనేక జలపాతాలతో అతిమనోహరమైన ప్రకృతి సౌందర్యంతో నిండి వుంటుంది. ఇచ్చట అనేక నరసింహాలయాలు ప్రతిష్ఠతములై వున్నాయి. అందులో కరండ నరసింహస్వామి ఆలయం ఒకటి. ఇంకొకటి యోగానంద నరసింహస్వామి ఆలయం అంటారు. జనప్రచారంలో ఉన్న గాధ ఇలా చెబుతుంది. హిరణ్యకశిపుణ్ణి సంహారించిన తర్వాత ప్రహ్లాదుణ్ణి శిష్యుణ్ణిగా స్వీకరించి స్వామి అనేక యోగ విద్యా రహస్యాలు ఉపదేశించాడు, ఆ ఉపదేశ మూర్తిని యోగానంద నరశింహమూర్తి అంటారు. ఈ పుణ్య స్థలంలోనే గోభిల భరద్వాజ మహర్షులు తపస్సులు చేసి పావనిర్ముక్తులైనారని ప్రసిద్ధి.

ఎగువ అహోబలము సముద్రతలానికి 2,800 అడుగుల ఎత్తున వుంది. ఈ కొండయొక్క రెండుశిఖరాలకు వేలాద్రి అని గరుడాద్రి అనీ పేర్లు. ఈ శిఖరాల నుండి పావనమైన భవనాశిని తీర్థంప్రవహిస్తూవుంటుంది, ఈ తీర్థం రెండు పాయలై కుముద్వతినదిలోను పెన్నానదిలోను కలుస్తూంది. దీన్ని అంతర్వాహినీ అంటారు. కొండ దక్షిణపువాలులో స్వామి ఉగ్రనరసింహ రూపంలో సేవింపబడుతున్నాడు. ఈ ఆలయ ప్రాకారం గోపురాలతో బ్రహ్మాండంగా ఉంటుంది. దీనికి చాలా దగ్గరలోనే గుహ నరసింహస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ ద్వారంలో పెద్ద స్తంభంవుంటుంది. పురాణ ప్రసిద్ధమైన ప్రహ్లాదుని కథలో ఏ స్తంభాన్ని నిర్దేశించి హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి "ఈ స్తంభంలో కూడా విష్ణువున్నాడా? " అని దట్టించి అడిగాడో, ఆ స్తంభం యిదేనని ఈ స్తంభంలోంచే ఉగ్రనరసింహాకారంలో స్వామి ఆవిర్భవించి హిరణ్యకశిపుణ్ణి చీల్చివేశాడని జనసామాన్యంలో వున్న గాధ విశ్వాసం! ఈ ఆలయానికి మూడు ఫర్లాంగుల దూరంలోవుంది, క్రోడ నరసింహుని దేవాలయం స్వామి యిచ్చట వరాహరూపంలో సేవింప బడుతున్నాడు. ఈ గుడిలో మూడు రోజులు నారాయణ శతాక్షరీజపం, వరాహకాండ పారాయణం చేసిన భక్తునికి అమితమైన ఆముష్మికాభ్యుదయం లభిస్తుందంటారు.

ఇక్కడికి రెండుమైళ్ళ దూరంలో ప్రసిద్ధమైన మాలోల నరసింహస్వామి ఆలయంవున్నది. ఇక్కడస్వామి శాంత రూపంలో లక్ష్మీ అమ్మవారితో ఎప్పుడూ వినోదిస్తూ వుంటాడు. ప్రసిద్ధుడైన కాకతీయ ప్రతాపరుద్ర మహారాజు బంగారంతో ఉత్సవవిగ్రహం చేయించి సమర్పించాడు. ఆ విగ్రహం అధ్యాత్మద్రష్టలైన అహోబలం జియ్యరు స్వాముల ఆరాధనలందు

కొంటూవున్నది. ఇంకా ఎగువకువెడితే జ్వాలా నరసింహస్వామి దేవాలయం వస్తుంది. ఇచ్చటస్వామి యొక్క ఉగ్రకళ సాక్షాత్కరింస్తుది! స్వామి యొక్క కోపరూపం పరాకాష్ఠ వహించి హిరణ్యకశిపుణ్ణి ముక్కలు ముక్కలుగా చీల్చిన ప్రదేశం సరిగ్గా యిదేనంటారు. దీని సమీపంలోనే పావన నరసింహ స్వామి ఉన్నాడు. ఈ స్వామికి శాక్త సంప్రదాయానుసారంగా అర్చన చేయవలసి వుంటుందట! ఈ నవనరసింహుల పేర్లు యివి. 1. ప్రహ్లాద నరసింహుడు లేక లక్ష్మీనరసింహుడు 2. ఛత్రవాట నరసింహుడు 3. కంచర నరసింహుడు 4. యోగానంద నరసింహుడు 5. గుహానరసింహుడు 6. క్రోడనరసింహుడు 7. మాలోల నరసింహుడు 8. జ్వాలా నరసింహుడు 9. పావన నరసింహుడు. వీరందరు యిచ్చట అర్చింప బడుచున్నారు.

ఎగువ అహోబలంలో ఉన్నస్వామి స్వయంభువు. తానంతటతానే వెలసినవాడు. అహోబల శబ్దవ్యుత్పత్తిని గూర్చి ప్రచారంలో రెండు గాధలున్నాయి. స్వామి ఉగ్రకళను ధరించి హిరణ్యకశిపుణ్ణి చీల్చిన భయానక రూపాన్ని చూచి దేవతలిలా కీర్తించారంట!

"నరసింహం పరందైవ మహోబల మహోబలం!"

ఇందువల్ల ఈ స్థలం 'అహోబల' మని ప్రసిద్ధిలోకి వచ్చిందని-రెండవ గాధ ఇచ్చటి పెద్ద గుహను పట్టి దీన్ని అహో! బిలం! అన్నారు. ఈ గుహలోనే గరుడుడు స్వామిని ఆరాధించి సాక్షాత్కారానుభవాన్ని పొంది యున్నందువల్ల ఆ గుహకే కాకుండా యీ స్థలానికి కూడా అహోబిలమనే వ్యవహారం వచ్చింది. ఈ కొండల్లో నివసించే "చెంచులు" అనే అడవి జాతి వారిలో ఈ స్వామివారిని గురించి అనేక గాధలు వాడకలో వున్నాయి. ఈ చెంచుల సంపర్కం శ్రీశైలానికివలె అహోబలానికీ వుంది. ప్రచారంలో వున్న గాధ యిది. శ్రీమన్నారాయణుడు నరసింహావతారం ఎత్తినపుడు లక్ష్మీదేవి చెంచు జాతిలో పుట్టింది. ఇద్దరూ యీ కొండల్లో హాయిగా విహరిస్తున్నారు. చెంచులక్ష్మి వలపులో పడి స్వామి తిరిగి వైకుంఠానికి వెళ్లటానికే ఇష్టపడలేదు. చెంచెతతో నరసింహస్వామి వలపు యీ ప్రాంతపు జానపదుల పాటలలో పరిమళిస్తూ వుంటుంది.

ఈ ప్రాంతం చుట్టూ ఎన్నో తీర్థాలున్నాయి. వాటిలో చాలా ముఖ్యమైనది "రక్త కుండం. హిరణ్యకశిపుణ్ణి చంపిన తరవాత స్వామి రక్తసిక్తములైన తన చేతులను ఈ తీర్థంలో కడిగినాడట! అందువల్ల యీ నీరు ఇప్పటికీ ఎర్రగానే కనిపిస్తుంది. ఇంకొక కొండ తీర్థం అలయానికి

ఈశాన్యంగా రెండు మైళ్ళలో లంజ కోనేరు 'అనే పేరుతో వుంది. ఒకప్పుడు ఒక నాట్యకత్తె యిచ్చటి స్వామి దర్శన మాత్రం చేతనే తాను చేసిన పాపాలకు పశ్చాత్తాపం పొంది వాటి క్షాళనం కోసం యీ తీర్థాన్ని నిర్మించిందంటారు. దీని పావనత్వం దీనికివుంది. పుణ్యాను బంధం గల రామ తీర్థం అనే సరస్సు దిగువ అహోబిలానికి అయిదు మైళ్ల దూరంలో వుంది. ఈ ఆలయం దీని చరిత్రనుబట్టి చాలా వెనుకటి రోజుల్లోకి వెళుతోంది. కల్యాణి పశ్చిమ చాళుక్య రాజులలో సుప్రసిద్ధుడైన విక్రమాదిత్యుడు (1076-1106 క్రీ. శ.) ఈ ఆలయంలోని మూలవిగ్రహాన్ని సేవించినట్లు శాసనాలున్నాయి. వెనుక చెప్పినట్లు కాకతి రాజుల్లో చిట్టచివరి వాడు, మహాశక్తిశాలి అయిన ప్రతాపరుద్ర దేవ మహారాజు ఈ ఆలయంలో ఉత్సవవిగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. శ్రీశైల మల్లికార్జున స్వామిని సేవించి తిరుగు ప్రయాణంలో అహోబలానికి పదహారు మైళ్ళ దూరంలో రుద్రవరం అనేచోట ప్రతాపరుద్ర మహారాజు విడిది చేశాడు. స్వామి ఉత్సవ విగ్రహం ఇక్కడే చేయించాడు. కళింగ విజయ యాత్రనుండి తిరుగు ప్రయాణంలో శ్రీకృష్ణ దేవరాయలు ఈ ఆలయాన్ని సందర్శించి స్వామికి కానుకలుగా వజ్రాల కంఠమాల, సింహ తలాటమూ, బంగారు పళ్లెమూ, వెయ్యి స్వర్ణ ఖండాలు సమర్పించాడు. ప్రతాపరుద్రుణ్ణి గురించిన గాథ యిలా వుంది. ఆ రాజు స్వర్ణంతో శివలింగాన్ని చేయించాలనుకున్నాడట! ఎన్నిసార్లు చేయించినా చివరికి వచ్చే రూపంగా నరసింహస్వామి రూపమే అందులోంచి వెలువడేదట. ఈ అనుభవంవల్ల ఆ మహారాజు గాఢమైన చిత్తసంక్షోభం పొంది—ధ్యానంలో ఉండగా స్వామి ఆయన యెదుట దర్శనమిచ్చి శివ విష్ణువులకు భేద కల్పనం వ్యర్థమని చెప్పి ఏ రూపంలో సేవించినా దైవం ఒక్కటే కాబట్టి ఎగువ అహోబలంలో స్వామిని సేవించమని చెప్పాడట.

మత ప్రబోధానికీ ఆధ్యాత్మిక వికాసానికి కూడా అహోబలం గొప్ప క్షేత్రం. ఇక్కడ సుప్రసిద్ధమైన మఠం వున్నది. వైష్ణవులలో అతి విస్తృతమైన అనుయాయి వర్గం ఈ మఠానికి వుంది. ఈ మఠాధిపతులను 'జియ్యరులు' అని అంటారు. మొదటి జియ్యరు మేల్కోట దేవగిరికి చేరువలో వున్న తిరునారాయణపురంలోని కేశవాచార్యులనే శ్రీవైష్ణవ బ్రాహ్మణునకు క్రీ.శ. 1379లో జన్మించారు. శ్రీనివాసాచార్యులనే యీ బాలునకు స్వామి నిజ స్వరూపాన్ని ఆవిష్కరించాడు. స్వామి ఆజ్ఞ వలన ఆ బాలుడు అహోబలానికి వచ్చాడు. అప్పటి అధికారి శ్రీ ముకుంద రాయలు అతనిని స్వీకరించాడు. స్వామి స్వయంగా యోగి రూపంలో

వచ్చి అతనికి మంత్రోపదేశం చేశాడు. అప్పటి నుంచి ఆ జియ్యరులు శఠకోపయతిగా ప్రసిద్ధులైనారు. ఈ విషయం ఈ క్రింది మంగళ శ్లోకంలో నిబద్ధమై వుంది.

అహోబలే శ్రీనృసింహః ప్రేషమంత్రం స్వయందదౌ

యోగి రూపేణ యస్మాస్మై శఠకోపాయ మంగళమ్

జనసామాన్యం యొక్క ఆముష్మిక శ్రేయోలాభమునకు ఈ మఠాధిపతులైన జియ్యరులు మూలమై వున్నారు. తెలుగు వాగ్గేయకారులలో ప్రథముడైన తాళ్ళపాక అన్నమాచార్యులు కూడ అహోబలం జియ్యరుల శిష్యులే.

ఈ క్షేత్రంలో ముఖ్యమైన ఉత్సవం వార్షికమైన బ్రహ్మోత్సవము. ఇది శివరాత్రి వెళ్ళిన పదిహేను రోజులకు ఫాల్గుణ మాసంలో వస్తూంది. ఈ ఉత్సవంలో ప్రత్యేకమైన ఒక ఆచారం ప్రజకు తమ స్వామియందున్న ప్రేమను ప్రదర్శిస్తోంది ఇచ్చటి పద్మసాలీలు లక్ష్మీదేవి తమ కులంలో పుట్టింది కాబట్టి స్వామికి కళ్యాణోత్సవం జరిపించే అధికారం తమదే అంటారు. ఈ గాథను పట్టి ఒక ముచ్చటైన ఆచారం వ్యాప్తిలోనికి వచ్చింది. కళ్యాణ మంటపంలోనికి అమ్మవారిదీ, స్వామిదీ ఉత్సవ విగ్రహాలు తీసుకొని వచ్చిన పిమ్మట ఆమె పుట్టినింటి వారైన పద్మసాలీలు తమ ప్రతినిధుల ద్వారా స్వామితో పెండ్లి రాయబారాలు నడిపి తమలో తాము 'లాటరి' వేస్తారు. ఎవరి పేరు వస్తే వారు ఆ యేడు కళ్యాణోత్సవం చేయించాలి. ఆ పేరు రావటం ఒక దివ్య సంఘటనగా భగవత్కృపా విశేషంగా ఆ వ్యక్తి జీవితంలో భావింపబడుతుంది.

అహోబలం ప్రాచీనతమమైన పుణ్యస్థలం. దీని ప్రసక్తి పురాణాలలో యిలా కానవస్తూంది. కర్నూలు నుండి చిత్తూరు వరకు వున్న నల్లమల కొండలు ఆదిశేషుని ఆకారమేనని ఆ ఆకారం యొక్క పుచ్ఛాగ్రం మీద శ్రీశైలము, నడుమ అహోబలము, శిరస్థానంలో తిరుపతీ వున్నాయని యీ పుణ్యస్థలం ఆళ్వారులని పిలువబడే దక్షిణ దేశపు వైష్ణవ మునుల గేయ వాఙ్మయంలో 'సింగవేలు కున్రమ్' అనే పేరుతో గానం చేయబడింది. తిరుమంగై ఆళ్వార్లు 'తిరువాలుమొడి'లో యీ స్వామి వైభవాన్ని అమృతమయములైన పది పద్యాల్లో గానం చేశారు. తొమ్మిది ఆలయాలు

పది మైళ్ళ వలయంలో వున్నందున ఈ తీర్థానికి పంచక్రోశ తీర్థమని కూడా ప్రసిద్ధి. నవ నారసింహ మూర్తులూ ఒకే స్థలంలో వేంచేసి వున్నందువల్ల అహోబలం యాత్రికులకు సుప్రసిద్ధమైన యాత్రా స్థలం! నారసింహ క్షేత్రాలెక్కడెక్కడ వున్నా అన్నింటికీ అహోబలమే ప్రప్రథమం. ఆళ్వారులు, జియ్యరులూ మొదలైన పరమ భాగవతుల సంబంధం చేత ఈ క్షేత్ర మహిమ ద్విగుణీకృతమైనది.

ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం మృత్యోర్మృత్యుం నమామ్యహమ్.

యాగంటి

అగస్త్యమహర్షికి నివాసముగా పేరు పొందిన యాగంటి గొప్ప శైవ క్షేత్రము. కర్నూలు జిల్లాలో యాగంటి ఎర్రమల కనుమలలో ఉన్నది. మనోహరమైన కొండకోనలపై గృహాలతో, పచ్చని వృక్షాలతో ఈ క్షేత్రం ఉమా మహేశ్వర స్థానంగా విరాజిల్లుతున్నది. ఉమా మహేశ్వరుడు అర్ధనారీశ్వర రూపంలో స్వయం భూలింగముగా ఇక్కడ వెంచేసి యున్నాడు. శ్రీశైలం తరువాత యాగంటి ఈ జిల్లాలో విఖ్యాతమైన శివ స్థానం. శ్రీ కృష్ణదేవరాయలు ఈ క్షేత్ర దర్శనం చేసి, కొన్ని నిర్మాణాలు పెంపు చేసి ఉన్నట్లు, గుత్తి రాజులు గాలి గోపురం నిర్మించినట్లు ప్రసిద్ధమైన విషయాలు.

ప్రకృతి సుందర దృశ్యాలతోడి పర్వతాల మీద నుంచి ప్రవహించే గంగా వాహిని గంభీర ధ్వనులు కర్ణ పర్వంగా ఇక్కడ వినవచ్చు. ఆలయాల నడుమ కోనేరు యాత్రికుల స్నానాలకు అనుకూలమైనది. జ్ఞానానందుడనే భక్తుడు శివ దర్శనం చేసి తన్మయత్వంతో 'నేగంటి నేగంటి నేనాత్మగంటి' అని ఉచ్చరించడంవల్ల 'యాగంటి' అనే నామం ఈ క్షేత్రానికి ఏర్పడినట్లు ఒక కథనం.

త్రేతాయుగంలో అగస్త్యులవారు ఈ క్షేత్ర ప్రాంతంలో నివసించిన తార్కాణాలు ఉన్నవి. ఇక్కడికి సమీపంలో ఉన్న గండికోటలో 'అగస్త్యులు కోన' ఒకటి ఉన్నది. జమ్మల మడుగు తాలూకాలోని కన్యా తీర్థ క్షేత్రంలో అగస్త్యునకు ఉపనయనం జరిగినదనీ, ప్రొద్దుటూరు ప్రాంతంలో గృహస్థాశ్రమం కొంతకాలం సాగిందనీ చెపుతారు. 'అగస్త్యేశ్వర దేవాలయం' దానికి సాక్షిగా ఇప్పుడు కనబడుతుంది.

ద్వాపరయుగంలో పాండవులు యాగంటి క్షేత్ర దర్శనం చేశారట. జగద్గురు శంకరాచార్యులు వారి శిష్యుడు పద్మపాదుడు, వీర బ్రహ్మేంద్ర స్వామి వచ్చి ఈ క్షేత్రం దర్శించినట్లు కూడా చెపుతారు. అగస్త్యులవారి ఆహ్వానంతో దేవతలు ఈ క్షేత్రమునకు వచ్చారని చెపుతారు. శంకర గది, వేంకటేశ్వర గది, బ్రహ్మ గది, కుమార గది—ఇవి గుహల పేర్లు. గంగా భవాని ఉన్న స్థలం పెద్ద కోనేరు. గంగ మరలిన చోటు మారునీళ్ళ చెలమ.

దేవతలు వచ్చిన బిలం పేరు మహాగది. దేవతలు అదృశ్యమైనది ఎర్రరాళ్ళ గది. ఇది చాలా విశాలమైనది.

ఉమామహేశ్వరాలయం ఎదుటి మండపంలోని నంది విగ్రహం 15 అడుగులు పొడవు, 8 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తు కలిగి నేత్రాకర్షకంగా ఉంటుంది. ఈ నంది స్వయంభువు అనడానికి ఒక కథ. ఆలయానికి ఎదురుగా ఒక పొడవైన రాయి ఉండేదట. ఆలయాధికారులు దానిని పగులగొట్టడానికి గడారులను నియమించారు. వారు పగులగొట్టి వెళ్లారు. మర్నాడు యథాప్రకారం ఆశిల పెరిగి ఉంది. ఎన్నిసార్లు పగుల గొట్టించినా, అట్టే పెరుగుతూ ఉండడంవల్ల అధికారులు భయభ్రాంతులయ్యారు. అంతలో ఆరాయి నంది ఆకారం దాల్చింది. ఈ నంది విగ్రహం ఆగ్నేయ వాయవ్య మూలలకు తిరిగి ఉంది.

కేంద్ర ప్రభుత్వ భూగర్భ శాఖవారు యాగంటి కొండకు వజ్రాల గనుల కొండ అనే ప్రసిద్ధి ఉండడంవల్ల, పరిశీలన చేసి బనగానపల్లె ప్రాంతంలో వజ్రపు గనులు ఉండ వచ్చునని ప్రకటించారు. యాగంటి సమీపంలో ఉన్న మద్దిలేటయ్యస్వామి కొండ కూడ భక్తులు దర్శించే క్షేత్రం. ఈ ప్రాంతంలో గిరిగుహలు హెచ్చుగా ఉండటం కారణంగా ఋషులు నేటికీ సంచారం చేసే ప్రదేశం అని జనశ్రుతి.

79



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహాస్వామి ఆలయం

1170—11

యా ద గి రి

యాదగిరిగుట్టగా ప్రసిద్ధమైన 'యాదగిరి' నల్గొండ మండలములోని పుణ్యస్థలాలలో మిక్కిలి ముఖ్యమైనది. ఇది భోనగిరి తాలూకాకు చేరి యుంది. వెనుకటి రోజుల్లో దీన్ని "భువనగిరి" అనేవాళ్లు. ఇది నల్గొండ జిల్లాలోనిది. యాదగిరి గుట్ట హైదరాబాదునకు నలభయిమైళ్ళ దూరంలో వుంది. అక్కడ నుండి ఇక్కడకు మంచి "మెటలురోడ్డు" వుంది. అలాగైనా ఇక్కడకు రావచ్చును. లేక సికిందరాబాదు—కాజీపేట లైనులో వున్న "రాయగిరి" స్టేషనులో దిగి రెండు మైళ్ళు ప్రయాణం చేసి యాదగిరిమెట్ట చేరుకోవచ్చును. 800 అడుగుల ఎత్తునఉన్న గుట్ట మీద ఆలయం వుంది. ఇచ్చటి దైవము లక్ష్మీనరసింహాస్వామి. ఈ ఆలయం అతి ప్రాచీనం కాకపోయినా అన్నవరం దేవాలయము మాదిరిగానే చాలా జనాదరణకు పాత్రమైనది. ఆలయచరిత్రను చెప్పే శాసనాలుగాని కైఫీయతులుగాని ఏమీలేవు అయినా ఈ ఆలయాన్ని గూర్చి పౌరాణికములూ సాంప్రదాయికములూ అయినా గాధలు చాలా ప్రచారంలో వున్నాయి. ఈ ఆలయం పుట్టుకను గూర్చిన గాధ స్కాందపురాణంలో వుంది. దాని స్వరూపం ఇది:-

త్రేతాయుగంలో విభాండకుడు అనే ఋషి వుండేవాడు. సుప్రసిద్ధుడయిన ఋష్యశృంగుని కొడుకు పేరు యాదవుడు. ఇతడు బాల్యం నుండి విష్ణుభక్తుడు. స్వామిని నరసింహా స్వరూపంలో దర్శించాలని ఇతనికి తీవ్రమైన ఆకాంక్ష. ఈ మనోరధ సిద్ధికి సాధనమైన తపశ్చర్య కోసం ఏకాంతమైన ఈ కొండను ఎన్నుకున్నాడు. మనుష్యుల అలజడులు సందడులూ లేని ప్రదేశాలు ఏకాగ్రతకూ శాంతికీ తపస్సుకూ చాలా అనుకూలంగా ఉంటాయి. అతడు ఎన్నుకున్న ఆ కొండ సరిగ్గా అలాంటిది. నరసింహా స్వరూపంలో వున్న విష్ణువును చూడాలని తప్ప అతనికి ఇంక ఏ కోరికా లేదు. ఏకాగ్రతతో ఆతని తపస్సు సాగుతోంది, అతని తపస్సులోని గాఢత్వము, క్షమా, పరిపూర్ణత్వమూ స్వామికి నచ్చి సంతోషం గలిగింది. వరాలివ్వటానికి వచ్చి యాదవుని ముందు నిలిచాడు. తన హృదయాన్ని కైవసం చేసుకొన్న మూడు దివ్య స్వరూపాలు చూపవలసిందిగా అతడు స్వామిని అర్థించాడు. ఆ మూడు ఏమంటే-జ్వాలా నరసింహా రూపము. గండభేరుండ నరసింహా రూపము, యోగానంద నరసింహా రూపమున్నూ.

అతని కోరిక ప్రకారం నరసింహావతారానికి సంబంధించి ఆ మూడు స్వరూపాల దర్శనమూ స్వామి అనుగ్రహించాడు. కాని ఆ క్షణమాత్ర దర్శనం యాదవునికి పరిపూర్ణమైన సంతృప్తిని కలిగించలేదు. అతనిలోని దర్శనతుద్ర నిరంతరమూ స్వామి సాన్నిధ్యంలో వుంటేనే గాని తీరేది కాదు. అందువల్ల అతడు స్వామిని ఈ మూడు స్వరూపాలతో ఆ కొండ మీదసన్నిధి చేసి నిత్యమూ వుండటం మొదలు పెట్టాడు. ఈ రీతిగా ఆ కొండ 'యాదవగిరి' అయింది. ఆ వాడుకలో 'యాదగిరి' అయింది.

శ్రద్ధాభక్తులతో అన్వేషించగలిగిన వారికి శ్రీ నరసింహస్వామి యొక్క ఆమూడు స్వరూపాలు ఈ ఆలయం ఆవరణలో మూడుచోట్ల కానవస్తాయి.

ఈ ప్రదేశం కాలక్రమం చేత నిర్మానుష్యమై అడవి బలిసి అవరింప బడిపోయింది. ఈ ప్రాంతం గ్రామాధికారి కలలో స్వామి కనిపించి ఆ కొండ శిఖరం మీద తన సాన్నిధ్యాన్ని వెల్లడించి ప్రతిమను నిత్యార్చనలకై యేర్పాట్లు చేయమని ఆదేశించాడు! స్వామి ఆదేశం ప్రకారం ఆ గ్రామాధికారి తగు మనుష్యులతో స్వామిని అన్వేషించటానికి కొండమీదికి వెళ్ళాడు. అక్కడ ఒక పెద్ద శిలక్రింద స్వామి విగ్రహాలు కనిపించాయి. వారు ఆ విగ్రహాలను ఉద్ధరించి ప్రతిష్ఠించి నిత్యార్చనలు చెయ్యటానికి ఒక అర్చకుణ్ణి యేర్పాటు చేశారు.

ఈ ఆలయానికి సంబంధించిన వేరొక గాధకూడా బహుళవ్యాప్తిలో వుంది. దాని ప్రకారం ఈ ప్రదేశానికి రెండు మైళ్ళదూరంలో స్వామి మొట్టమొదట స్వయంభువుగా ఆవిర్భవించాడు. ఆ ప్రదేశం యిప్పుడు 'ప్రాత నరసింహస్వామి గుడి స్థలం, అని పిలువబడుతుంది. ఈ గాధలోనూ అదే స్వప్న వృత్తాంతం వున్నది. దాని తరువాత స్వామి ఆ ప్రదేశాన్ని విడిచి ఏకాగ్రతకూ, ధ్యానానికి అనుకూలంగా వున్నందున ప్రస్తుతం వున్న కొండ శిఖరానికి వచ్చేశాడు.

మూడు వందల అడుగుల ఎత్తున వున్న కొండ శిఖరంమీద ఈ ఆలయం వున్నది. కొండక్రింద గోపురంతో ఒక ద్వారం వుంది. దీన్ని వైకుంఠ ద్వారమని పిలుస్తారు. కొండ నగం ఎక్కేసరికి పైన ఒక 'గిరి నగరం' గా ఏర్పడుతున్న సత్రాల వరుసలు కానవస్తాయి. యాత్రికుల సౌకర్యం కోసం అనేక భక్తులు నిర్మించిన ఈ సత్రాలు .50 పైగా వున్నాయి.

ఆలయం సింహద్వారంలోకి ప్రవేశించిన తర్వాత కుడివైపున హనుమంతుని గుడి ఒకటి వుంది. సరిగ్గా హనుమంతుని విగ్రహం అడుగున 10 అంగుళాల వెడల్పున 60 చదరపు అడుగుల మేర చీలిన శిల నేలబారుగా ఒకటి కనిపిస్తుంది. ఈ నేలబారుగా వున్న చీలిక వద్దనే గండభేరుండ నరసింహ స్వరూపంతో స్వామి యాదవునకు కనిపించాడంటారు. ఈ ప్రదేశం యొక్క ప్రాధాన్యాన్ని సూచిస్తూ ఇక్కడ ఒక నూనె దీపం ఎప్పుడూ వెలుగుతూ వుంటుంది.

ఎడమకు తిరిగితే విశాలమయిన ఒక శాలలోనికి ప్రవేశిస్తాము. అచ్చట సామాన్యంగా భక్తులందరూ కూర్చునివుంటారు. ఆ శాలకు ఎడమవైపున అసలు ఆలయం వుంటుంది. ఆలయం ముందు వున్న స్థంభం వెనక వున్న స్థంభాలవలె నిర్మితమయినదేకాని సరిగ్గా స్వామి వున్న గర్భగుడి మాత్రం 30 అడుగుల పొడవున 12 అడుగుల వెడల్పున కొండలో తొలిచిన గుహ! వాటికి కప్పుగా వున్న ఒక పెద్ద శిలక్రింద 5 అడుగుల ఎత్తున లోపలికి త్రోవ కొరకు ఈ గుహ నిర్మింపబడింది. ఈ ఇరుకు త్రోవలో నుంచి లోపలికి వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా కొంచెం తల వంచవలసి వుంటుంది. ఆ రీతిగా ఈ గుహ యొక్క సహజ నిర్మాణమే భగవంతుని ముందు మనల్ని వినమ్రులను చేసేదిగా వుంది.

ఈ త్రోవకు ఎడమవైపున ఒక పీఠం వుంది. అక్కడ విశేషార్చనలు జరుగుతూవుంటాయి. ఈ గుహ చివర స్వామి అసలు విగ్రహాలు వున్నాయి. అక్కడ ఒకదాని కొకటి బిగింపబడి నడుమ అడుగు ఎత్తు గల అర్ధవలయాకారాన్ని నిర్మిస్తున్న రెండు శిలలు మనకు కనిపిస్తాయి. ఒక శిలవైపున సర్ప శిరాకారంతో తోకవలె పరిసమాప్తమవుతున్న ఒక విగ్రహం మనకు కానవస్తూంది. దానిని యాదవునకు సాక్షాత్కరించిన రెండవ స్వరూపమైన జ్వాలా నరసింహ మూర్తి అంటారు. ఆ విగ్రహం పరిసరాల్లో ఇప్పటికీ ఒక దివ్యసర్పం కదలుతూ వుంటుందంటారు.

దానికి ఎదురుగా వున్న శిల మీద ధ్యానస్థిమితమైవున్న వేరొక ప్రతిమ కాన వస్తుంది. దీనిని యాదవునకు సాక్షాత్కరించిన మూడవ స్వరూపమైన యోగానంద నరసింహమూర్తి అంటారు.

సహజ నిర్మాణాన్ని భగ్నం చేయనిదే ఆధునిక నిర్మాణానికి వీలు కలుగని రీతిలో యీ శిలలు గుహలో ఒక భాగమై వున్నాయి ఈ రెండు

విగ్రహాలు విస్పష్టంగా యాత్రికులకు కానరానందువల్ల వెండితో నిర్మింప బడిన లక్ష్మీ నరసింహుల విగ్రహాలు మూల విగ్రహానికి దగ్గరగా దర్శనానికి పూజకు వీలుగా పెట్ట బడి వున్నాయి.

ఈ గుహాగా ఏర్పడిన పెద్ద శిలయే ఈ ఆలయం యొక్క ఉపరి నిర్మాణానికి ఆధారమై వున్నది. ముందరి స్థంభానికి ఎడమ వైపున ఒక గుడి వుంది. దీన్ని ఆండాలమ్మ ఆలయమంటారు.

యాదగిరి గుట్ట మీద వున్న గిరి నగరం ఎప్పుడూ యాత్రికులతో కిట కిట లాడుతూవుంటుంది. గొప్ప మహిమ గల ఈ క్షేత్రం ఏడాది పొడుగునా వేల కొలది యాత్రికులను ఆకర్షిస్తూవున్నది. దీనికి కారణం శ్రద్ధా భక్తులతో స్వామి శక్తియందు సంపూర్ణ విశ్వాసంతో కొండ మీద ఒక నలభై రోజులు గాని, ఒక పక్షం గాని, ఒక వారం గాని స్వామిని ఆరాధించే భక్తులకు ఎటువంటి అసాధ్య వ్యాధులైనా కుదిరి సంపూర్ణా రోగ్యం చేకూరుతుంది. ఈ స్వామి మహిమ అటువంటిది. ఈ వ్యాధి నివారణ శక్తి దేశ దేశాలా వ్యాపించి యీ ఆలయం నలభై యాభై యేళ్ళలో చాలా ప్రసిద్ధిలోనికి వచ్చింది. ఇచ్చటికి వచ్చి స్వామిని ప్రార్థించిన ఏ ఒక్క యాత్రికుని మనోరథమూ విఫలం కాలేదంటారు.

బాసర

అదిలాబాదు జిల్లా మధోలు తాలూకాకు చెందిన గ్రామము బాసర. ఈ గ్రామానికి చిర ప్రతిష్ఠ తెచ్చినది సరస్వతీ దేవి ఆలయం. సరస్వతికి ఆలయమే అపూర్వం. కాశ్మీరంలో శరదాలయం ప్రసిద్ధం. మన రాష్ట్రంలో బాసర పురాతనము, చారిత్రకము అయిన సరస్వతీ క్షేత్రం. ఆది కవి వాల్మీకి మహర్షి బాసరలో సరస్వతీదేవి ప్రతిష్ఠ చేశాడని, శ్రీమద్రామాయణ రచన ఇక్కడే సాగించాడని బ్రహ్మాండ పురాణములో ఉన్నట్లు పెద్దలు చెపుతారు. చారిత్రకమైన ఆధారంలో ఈ క్షేత్రం రాష్ట్ర కూటుల కాలం నాటి దంటారు. ఇది క్రీస్తు శకం 4 వ శతాబ్దికే పూర్వకాలీనమని చెపుతారు.

సరస్వతీ దేవి ఆలయం చతురస్రాకారంలో ఉంటుంది. ఆలయానికి దక్షిణ భాగాన కోనేరు ఉన్నది దీనిని గుండం అని వ్యవహరిస్తారు. ఆలయావరణంలో పాలరాతి విగ్రహం వాల్మీకి మహర్షి ది ఉన్నది. దాని ప్రక్కగా ఉన్న ఒక సమాధిని 'వాల్మీకి సమాధి' అని అర్చకులు పరిచయం చేస్తారు. శివరాత్రి మొదలు ఇక్కడ ఉత్సవాలు చేస్తారు. బాసర రైలు స్టేషన్ ఈ క్షేత్రానికి రెండు మైళ్ల దూరంలో ఉంటుంది. బాసర సరస్వతీ దేవి దర్శనం విద్యాబుద్ధి ప్రదమని భక్తుల విశ్వాసం.

మంత్రాలయం

రాఘవేంద్రస్వామి మహిమాన్వితుడైన మహాపురుషుడు, పండిత ప్రవరుడు, యోగి, తుంగభద్రా తీరాన ఆదవాని సమీపంలో మంత్రాలయం మహాక్షేత్రంగా నేడు పరిగణింపబడుతోంది. అది రాఘవేంద్రస్వామి బృందావనం. అనగా వారి సమాధి స్థానం. కర్నూలు జిల్లాలోని మంచాల గ్రామము స్వామి వారి మహిమచే మంత్రాలయ క్షేత్రమై వెలసినది.

బొంబాయి-మద్రాసు-బ్రాడ్ గేజి రైలు మార్గంలో ఆదోని దగ్గర వున్న తుంగభద్ర రైల్వే స్టేషనులో దిగి, బస్సు మీద మంత్రాలయం చేర వచ్చు. అక్కడికి తొమ్మిది మైళ్లు, కర్నూలు, ఆదోని పట్టణాల నుంచి బస్సు మీద వెళ్ళడానికి సదుపాయము ఉన్నది. మంత్రాలయంలో యాత్రికులకు దేవస్థానం వారిచే వసతి గృహాలు ఉచితంగా ఏర్పాటు చేయబడతవి.

ఇప్పటికి మూడు శతాబ్దులకు పైగా అయినది. రాఘవేంద్రస్వామి వారి పూర్వాశ్రమ వృత్తాంతం పెద్దలు చెప్పుకుంటారు. వారు మాధ్వ బ్రాహ్మణులు. వారి తాత ముత్తాతలు విజయనగర చక్రవర్తుల కాలంలో వైణిక విద్వాంసులుగా పేరు పొందినారట. శ్రీ కృష్ణదేవరాయల అనంతరం రాఘవేంద్రని తండ్రిగారు తిమ్మనభట్టు విజయనగరం విడిచి కంచి దగ్గర వున్న భువనగిరి చేరుకున్నారు. తిమ్మనభట్టు భార్య గోపమ్మ. ఈ పుణ్య దంపతులకు వేంకటేశ్వరస్వామి సేవా ఫలముగా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిగినారు. రెండవ కుమారుని పేరు వెంకట భట్టు. గొప్ప మేధావి. ఆయన చిన్ననాటినుంచి శ్రద్ధా భక్తులతో విద్యాభ్యాసం చేసి తర్క వ్యాకరణ వేదాంత శాస్త్రాలు తన అక్కగారి భర్తయైన లక్ష్మీ నరసింహాచార్యులవద్ద అధ్యయనం చేశారు. అన్నగారు గురు రాజాచార్యుల వారిలో వీణావాద్యంలో నైపుణ్యం సంపాదించారు. సుధీంద్ర తీర్థుల వారి శిష్యులయ్యారు. తమ ముప్పదవయేట వివాహం చేసుకున్నారు. భార్యపేరు సరస్వతి. వీరికి పుత్రుడు కలిగాడు. పుత్రముఖావలోకనం చేసిన తర్వాత వెంకటభట్టు సుధీంద్ర తీర్థ స్వాముల ఆజ్ఞతో ఆశ్రమ స్వీకారం చేసి రాఘవేంద్రస్వామిగా పేరు పొందారు.

భార్య సరస్వతికి ఈ వార్త తెలిసి పతి ఎడబాటు భరించలేక ఆమె బావిలో పడి చనిపోయినదట. ఆ కారణంచే ఆమె పిశాచమైనది స్వామి వారది తెలుసుకొని మంత్రశక్తిచే ఆమెను పిశాచ జన్మ నుండి విముక్తురాలిని చేశారని జన్మ శ్రుతి.

సన్యాసాశ్రమం స్వీకరించిన స్వామి శ్రీరంగం, కంచి, రామేశ్వరం, మధుర మొదలైన క్షేత్రాలు సేవించుతూ మధ్వాచార్యుల స్థానమైన "ఉడిపి" వచ్చి శ్రీకృష్ణ దర్శనం చేసుకున్నారు. చివరకు తుంగభద్రాతీరంలో వున్న "మంచాల" తాము సిద్ధి పొందడానికి తగిన స్థలమని నిర్ణయించుకున్నారు ఆ రోజులలో ఆదవాని నవాబు సిద్దిమసీదు ఖాన్. అతడు రాఘవేంద్ర స్వామి మహిమ గుర్తించి మంచాలగ్రామం ఆయనకు సమర్పించాడట. మంచాలమ్మ గ్రామదేవత రాఘవేంద్రస్వామి ఆ దేవతాలయం ప్రక్క క్రీ.శ. 1670లో సజీవ సమాధిలో ప్రవేశించారు. శ్రావణ బహుళ విదియ గురువారం బృందావనస్థులైనారు. పన్నెండు వేల సాలగ్రామాలతో నిర్మించబడిన ఆ స్థానం శుద్ధ మృత్తికచే మూయబడినది. ఎంతో పవిత్రంగా భావించబడుతూ ఉంటుంది.

మంత్రాలయానికి అనేక రాష్ట్రాలనుంచి భక్తులు వస్తారు. స్వామిని పూజించి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వాంఛిత సిద్ధి పొందుతూ వుంటారు. రాఘవేంద్రస్వామివారి ఆశీర్వచన ప్రభావంచే రోగనివారణ చేసుకోవచ్చునని భక్తుల విశ్వాసం. మంత్రాలయంలో వేదపాఠశాల వుంది. ప్రసిద్ధులైన వేదశాస్త్ర పండితులు అక్కడ అధ్యాపకులుగా వుంటున్నారు మంత్రాలయం సర్వజన దర్శనీయమైన క్షేత్రం. రాఘవేంద్రస్వామి ప్రహ్లాదుని అవతారమని చెపుతారు.

మహానంది

దక్షిణాపథంలో తూర్పువైపున పరచుకొని వున్న కొండల వరసలలో తిరుపతి, అహోబలం, శ్రీశైలము, సింహాచలము మొదలైన మహాస్థలా లన్ని దాగి వున్నాయి. ఇవన్నీ ఒక మాదిరిగానే అనిపిస్తాయి. చుట్టూ దట్టమైన అడవుల మధ్య శాంతగంభీరమైన పరిసరాలలో ఇవి అవశంగా మనస్సును లీనం చేసివేస్తాయి.

కర్నూలు మండలం నడిమిగా ఈ కొండలు రెండు వరుసలుగా పోతు న్నాయి. వీనిలో తూర్పువైపునకు పోతున్న వరుసనే "నల్లమల" అంటారు. ఈ నల్లమల కొండలలో ఒక కొండదగ్గర "మహానంది" వుంది.

"మహానంది"కి నంద్యాలనుండి బస్సుమీద పోవచ్చును. పదిమైళ్ళు· నంద్యాల కర్నూలు మండలంలోని ఒక రైలుస్టేషను.

చుట్టూ దట్టమైన అడవుల మధ్య పచ్చని ఆకుల నీడలలో ప్రసన్నతీర్థ జలాల నడుమ శాంతగంభీరమై "మహానంది" ప్రాగన్ను పెట్టి నెమరువేస్తూ ఉన్నట్లు వుంటుంది.

ఈ ఆలయం అనేక విధాల అద్వితీయ మనిపిస్తుంది. గర్భగృహం మీది విమానం ఉత్తరదేశ పద్ధతిలో శుద్ధ "నాగశైలి"లో నిర్మింపబడివుంది, నిటారుగా వున్న ఆలయం మీది శిఖరం ఆకాశం డొక్కలోనికి పొడుచుకుని వున్నట్లుగా వుంటుంది. ప్రచారంలో. వున్న గాథ యిది. ఉత్తరదేశం రససిద్ధుడొకడు వచ్చి యీ విమానం నిర్మించాడనీ- పనివాళ్ళకు కూలీ యివ్వటానికి అతడు వారిచేత యిసుక కుప్పలు పోయించేవాడనీ— అతని మంత్రశక్తి ఆ ఇసుక కుప్పలను వారివారి శ్రమకు సమానమైన సంపదగా మార్చేదనీ! ఈ వదంతికి తగినట్లు—ఈ ఆలయ ప్రధానద్వారం పశ్చిమాభి ముఖంగా ఉంది. పశ్చిమాభిముఖ ద్వారములైన గుడులన్నీ—దైవ, ఋషి ప్రతిష్ఠలనడానికి నిదర్శనం. ఆ గాథ ఇంకా ఇలా చెబుతోంది: ఈ ఆలయం "నందు"డనే మహారాజు కాలంలో ఆ హిమాలయ రససిద్ధుని ఆదేశానుసారం నిర్మింపబడిందట !

శ్రీకృష్ణదేవరాయలు ఒక తామ్రశాసనంలో "మహానంది తీర్థము"గా "మహానంది" పేర్కొనబడింది. ఆ శాసనంలో మహానంది తీర్థం పుణ్య స్థలాలలో ఒకటనీ-రాజసోదరుడైన నరసింహదేవరాయలు విలువగల దానాలు చేశాడనీ వున్నది హంపీ శాసనాలలో కూడ మహానంది ప్రసక్తి వుంది. క్రీ.శ. 1046కు వెనుకటిదైన "శివనందుని" శాసనంలో మహానంది తీర్థము యొక్క ప్రసక్తి వున్నది.

ఆలయము యొక్క శిల్ప సౌందర్యమును పట్టి-గుడిముందరి తొట్టె అమర్పును బట్టి మరికొన్ని ప్రత్యేక లక్షణాలను బట్టి - యీ ఆలయం అతి ప్రాచీనకాలంనాటిదని తెలుస్తుంది తరువాతి కాలాల్లో అనేక రాజులు దీన్ని బాగుచేయించటమూ పునర్నిర్మాణము చేసినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 17, 18 శతాబ్దములలో ఈ ఆలయం కర్నూలు నవాబులు ఏలుబడిలోనికి వచ్చింది. ఆ నవాబులు మహానందిలోని శివరాత్రి మహోత్సవానికి ఏటేటా తమ "ఖజానా"లోని సొమ్ము వెచ్చి చేవారంటే — ఈ ఆలయం యొక్క పవిత్రతా ప్రాశస్త్యమూ ఎటువంటిదో తెలుస్తుంది. ఏమంటే ముస్లిం రాజులు కూడా ఈ క్షేత్రం విషయంలో శ్రద్ధ వహించి తీరవలసి వచ్చింది.

ఈ ఆలయం నిర్మింపబడిన పరిసరాలలోని ప్రకృతి దృశ్యాలను బట్టి యాత్రికులకు మహానంది యాత్రా స్థలమే కాక విహార యాత్రా స్థలముకూడా అవుతోంది కొండల చేరికవల్లా-ఏటికి ఏడాది పొడుగునా ఎడతెగక గుడి చుట్టూ పారే నీటి బుగ్గల చలువ వల్లా - నిసర్గసిద్ధమైన ఏకాంత పావనత్వం వల్లా-యీ ప్రదేశం యాత్రికులను సర్వకాలాలలోనూ ఆకర్షిస్తూనే వుంటుంది. నల్లమలల ప్రకృతి సౌందర్యానికి యీ ప్రదేశాన్ని 'చెక్కిలిచుక్క' అంటారు. ఈ ఆలయ తీర్థం తన ఔషధీ గుణంచేత ప్రసిద్ధి కెక్కింది. ఈ ధాతు జలం ఏడాది పొడుగునా కవోష్ణంగానే వుంటుంది. ప్రధాన తీర్థం ఆలయ ముఖ మంటపం ముందు వుంది ఇది అరవై అడుగుల చదరపు తొట్టె! మధ్యలో ఒక మంటపం వుంది. యాత్రికులు మునగటానికి వీలుగా ఎప్పుడూ అయిదు అడుగుల లోతు నీరు వుండేటట్లు యీతొట్టె యొక్క జల నిస్సరణ, ప్రసరణ మార్గములు అమర్చబడి వున్నాయి. ఈ నీరు ఎక్కడినుండి వస్తుందో ఇప్పటి వరకు ఎవ్వరికీ తెలియదు. తొట్టెలోనికి నీటిపానుదల కనిపిస్తుందేగాని సరిగ్గా తూము లెక్కడినుండి వున్నాయో తెలియదు. ఈ తీర్థంలోకి నీరు అయిదు బుగ్గల్లో

నుంచి వస్తోంది. వాటిని శ్రీశైలధార, నరసింహధార, దైవోదినీతీర్థం, నంది తీర్థము, కైలాస తీర్థము అని పిలుస్తారు. స్ఫటికనిర్మలమైన ఈ నీరు ఎప్పుడూ కవోష్ణమై వుంటుంది.

లింగాకారమై వున్న ఇచ్చటి మూలవిరాట్టు భారతవర్షంలోని ఇతర లింగాలకంటే విలక్షణమై అసదృశమైవుంది. ఇది రెండుచోట్లసొట్టు పడిన పుట్టు శిల! కాని వైష్ణవులకు కూడా ప్రతిపత్తి విషయములైన సాల గ్రామములతో కూడియున్నందు వల్ల యీ లింగము యొక్క మహిమ అమేయమని భావింపబడుతోంది. శ్రీశైలంలో మాదిరిగానే లింగం ఇక్కడకూడా పీఠత్రయ విరహితమై భూమికి ఉపరితలం మీదనే కాన వస్తుంది. అక్కడమాదిరిగానే ఇక్కడా స్వామిని అందరూ ముట్టుకోవచ్చును. మనసారా, చేతులారా పూజించుకోవచ్చును.

ప్రస్తుతం ఈ విధమైన లింగాకారాన్ని గూర్చి యిచ్చటి స్థల పురాణంలో నచ్చిక కలిగించే గాధ ఒకటి యిలా వున్నది. పూర్వం నవ నంది మండలాన్ని నందుడనే మహారాజు ఏలుతున్నాడు. మహానంది ఆ నవ నంది మండలంలో చేరికయై వుంది. ఆ మహారాజునకు ఒక తలంపు కలిగింది. స్వామి విగ్రహానికి తైలాభ్యంజనం చేసి పాలతో అభిషేకం చెయ్యాలని! ఎక్కడెక్కడి ఆవులమందలను రప్పించాడు. గోపవరం అనే పల్లెనుండి వచ్చిన మందలో ఒక కట్టి ఆవు వుంది. ఆ రాజుచేసే అభిషేకంలో యీ కట్టిఆవు పాలే ఎక్కువగా ఉపయోగింప బడేవి. ఆ ఆవు అడవులలో స్వేచ్ఛగా తిరుగుతూ మేస్తూవుండేది. కొన్నాళ్ళకు అది అడవిలో చాలా సేపు కనబడకుండా వుండటం చాలా పర్యాయాలు గమనించారు. అభి షేకంలో వినియోగింపబడే దానిపాలు క్రమంగా తరగిపోవటమూ గమనిం చారు. పాలెందుకు తరగిపోతున్నాయో గమనించటానికి ఒకనాడు గొల్లవాడు ఆవువెంట అడవికి వెళ్లాడు. ఒక చీమలపుట్ట చుట్టు తిరుగుతూ ఆవు మేయటం గమనించాడు. కొంచెంసేపటికి ఆవు పుట్టమీద నిలబడివుంది! ధారగా పాలుపుట్టలోనికి కారుతున్నాయి. చివరికి కృష్ణుని రూపంలో వున్న ఒక శిశువు చీమల పుట్టలోనుంచి పైకి తొంగిచూచి ఆవుకు దర్శనమిచ్చాడు. తరువాత నెమ్మదిగా ఆవు మందలోకి ఈ సంగతి వచ్చింది. గొల్లడు రాజుతో చెప్పాడు తన విశ్వాసాన్ని పరీక్షించటానికి పరమేశ్వరుడే అలా శిశు రూపంలోవచ్చాడని రాజు సూటిగాఊహించాడు. మరునాడు రాజుకూడా ఆవు వెంట అడవికి వెళ్లి ఒక దట్టమైన పొదలో దాగి ధ్యాన నిమగ్నుడై పరమేశ్వరుని దర్శన క్షణం కోసం ఎదురుచూస్తూ వున్నాడు. ఆవు పుట్టను సమీపించి చుట్టూ తిరిగి భక్తి నిశ్చలమై నిలబడి వుంది. పరమేశ్వరుడు శిశువుగా కనబడి ఆవు పాలు ఆరగించాడు.

అద్భుతాక్రాంతుడైన రాజు తొట్రిల్లడంతో పండుటాకులు మరమర లాడాయి. ఆ సవ్వడికి మనసు చెదరి ఆవు బెదరి భయభ్రాంతయై పుట్టను గిట్టలతో మట్టగించింది. శిశువు అదృశ్యమైపోయినాడు. పుట్ట మెట్టి తేమగా వున్నందు వల్ల ఆవు గిట్టల అచ్చు దానిమీద అత్తుకుంది. తలవని తలంపుగా జరిగిన యీ దైవాపచారానికి రాజు భయపడి పరమేశ్వరుణ్ణి క్షమించమని ప్రార్థించాడు. రాజు ప్రార్థనకు సంతుష్టుడై ఆవు మట్టగించిన ఆ చీమల పుట్ట తేను అరి తనంతట మహానంది వద్ద స్వయం భూలింగమై వెలిసేటట్లు పరమేశ్వరుడు సంకల్పించాడు. అందువల్లనే గిట్టల రెండు గుర్తులూ మహానంది లింగం మీద నేటికీ కనిపిస్తాయి.

ఆలయం ముందు పెద్ద నంది వున్నది. బహుశః యీ ప్రదేశానికి 'మహా నంది' అనే వాడుక ఆ నంది వల్లనే వచ్చివుంటుంది. ఆలయం వెనుక వున్న చెరువును 'రుద్రగండం' అంటారు. అచ్చట విష్ణు గుండమనీ బ్రహ్మ గుండమనీ ఇంకా రెండు చెఱువులున్నాయి.

ప్రధానాలయం ప్రక్కన అమ్మవారి ఆలయం వున్నది. అమ్మవారి ముందున్న శ్రీ చక్రం ఆది శంకరులు ప్రతిష్ఠించినదంటారు. అమ్మవారి కన్నుల ఎదట ఏకాగ్రంగా పరమేశ్వరుణ్ణి ధ్యానించినవారికివారిసంస్కారానుభూతమైన దర్శనం కలుగుతెందని యిచ్చటి జనప్రచురమైన విశ్వాసం! అమ్మవారి ముందున్న ముఖ మంటపం యిటీవల భైరవ జ్యోస్యుల మహానందయ్యగారు కట్టించినది.

ప్రధానాలయం వెనుక మూడు చిన్న గుడులున్నాయి. ఒక్కొక్క-లింగంతో ఈ మూడు లింగాలను ఆరాధించినట్లయితే స్థూల, సూక్ష్మ, కారణ, శరీరాలకు అతీతమైన తురీయ స్థితి సిద్ధిస్తుందని ప్రసిద్ధి.

మహా నందికి చుట్టూ పది మైళ్ళ వలయంలో తొమ్మిది నంది ఆలయములున్నాయి, వాటి పేర్లివి:— 1. పద్మనంది, 2. నాగనంది, 3. వినాయక నంది, 4. గరుడ నంది, 5. బ్రహ్మ నంది. 6.సూర్యనంది 7. విష్ణు నంది, 8. సోమనంది, 9. శివనంది. నిజానికి ఇది 'నంద్యాల' అనే, 'నంద్యాలయ' మునకు తద్భవ రూపమే!

ఇచ్చటి ఉత్సవాలలో శివరాత్రి చాలా ముఖ్యమైన ఉత్సవం. శ్రీశైలానికి వచ్చే యాత్రికులందరూ సామాన్యంగా యిచ్చటికీ వస్తారు. కార్తీక మాసంలో శ్రద్ధాన్వితులైన యాత్రికులు ఉషః కాలంలో ప్రప్రథమంగా మల్లికార్జున స్వామిని సేవించి యిచ్చటికి రెండు మైళ్ళ దూరంలో వున్న పద్మనందిని సేవించి - అచ్చటికి మైలు దూరంలో పడమరగా ఉన్న

నాగ నందిని సేవించి - చేరువనే ఉన్న బ్రహ్మ నందినీ, సోమ నందినీ, శివ నందినీ సేవించుకొని - అచ్చటికి ఈశాన్యంగా మూడు మైళ్ళలో వున్న విష్ణు నందిని సేవించి-అచ్చటి నుండి కదిలి వినాయక నందినీ, మహానందినీ, సూర్యనందినీ సేవించి యాత్ర ముగిస్తారు. ఈ నవనందుల సేవ సూర్యుడస్తమించే లోగా పూర్తి చేసుకోవాలని సంప్రదాయజ్ఞులంటారు.

ఈ ప్రదేశం "నవనంది"గా మారటానికి ఉన ప్రసిద్ధములైన గాథలు రెండు వున్నాయి. ఒకటి—కృతయుగంలో పర్వతుడనే మహర్షికి ఇద్దరు కొడుకులు శిలాదుడని-నందీ అనీ. పెద్దవాడైన శిలాదుడు తన తీవ్ర తపశ్చర్య వల్లనే ఆ పేరు పొందాడు. ఏమంటే ఆయన రాళ్ళు తిని తపస్సు చేశాడు! ఆ విశిష్టమైన తపస్సుకు సంతుష్టుడై పరమేశ్వరుడు శిలాదుణ్ణి ఒక పుణ్య పర్వతంగా చేసి దానిమీద నివసించటం మొదలు పెట్టాడు. ఈ పర్వత శ్రేణిలో సుప్రసిద్ధమైన శ్రీశైలం ఒదే! అదేరీతిగా రెండవ కుమారుడు నంది కూడ పరమేశ్వరుణ్ణి గూర్చి తపస్సు చేశాడు. శివుడీయనను నందిగా మార్చి తనకు వాహానంగా చేసుకొన్నాడు. నంది తపస్సు చేసిన ప్రదేశం లోని భాగమే యిప్పటి మహానంది వున్న ప్రదేశం! రెండవ గాథ—ఈ ప్రదేశాన్ని క్రీ.శ. 11 శతాబ్దంలో నందవంశపు రాజులు పరిపాలించారు. వారు తమ కులదైవమైన నందికి అనేకాలయాలు నిర్మించి ఆరాధించారు. ఇచ్చటి నంది అలయాలు విజయనగర రాజులతో సహా అనేక రాజవంశాల ఆదరణను పొందాయి.

ఇచ్చట యాత్రికులకు మంచి వసతులున్నాయి. మహానంది యాత్రా స్థలమేకాక ప్రకృతి రమణీయ స్థలం కూడా కావటమే దీనికి కారణం. ఇచ్చటి ప్రధానోత్సవం శివరాత్రి! దసరా, ఉగాదులకు కూడా యిచ్చట ఉత్సవాలు జరుగుతాయి. ఈ దేవాలయం దూర సమీప ప్రాంత జనాలను సమానంగా ఆకర్షిస్తోంది. దేశ కాలముల అలజళ్ళకు చలించని దృఢ విశ్వాసానికి ప్రతీకగా మహానంది నిలిచి వుంది.

మౌన విలీనమైన అభివ్యక్తితో చక్రనేమిక్రమ ప్రాప్తములైన మానవజాతి యొక్క పతనాభ్యుదయములకు సాక్షియై మహానంది ప్రణవానుసంధానం చేస్తున్నట్లు వుంటుంది.

శ్రీ కూర్మం

శ్రీకాకుళం జిల్లాలో వంశధారా నది ప్రాంతములో ఉన్న క్షేత్రం శ్రీకూర్మం. ఇది సూర్య క్షేత్రమైన అరసవిల్లికి సమీపంలో వున్నది. శ్రీహరి కూర్మ రూపంలో వేలసిన కారణాన, కూర్మనాధస్వామి అంటారు వంశధారా నది పుట్టుకకు, శ్రీ కూర్మ క్షేత్రానికి సన్నిహిత సంబంధం పౌరాణికమైనదని చెప్పుకుంటారు.

కృత యుగంలో శ్వేతుడనే చక్రవర్తి భార్య ఏకాదశీ వ్రత నియమంలో ఉండగా, ఆయనకు భార్యయందు ఆసక్తి కలిగిందట. రాజు రాణి భవనానికి వస్తున్నట్లు కబురు చేసాడు. మగడి కోరిక నెరవేర్చినచో వ్రత భంగము. రాణికి ఏమి చేయుటకు తోచలేదు. శ్రీహరిని ధ్యానించినది. వెంటనే. ఆమె భవన సమీపంలోవున్న వెదురు పొదనుంచి జలప్రవాహం పుట్టుకు వచ్చింది. ఆ ప్రవాహం కొద్ది సేపటిలో రాజ మందిరానికి మధ్య అడ్డుగా ఏర్పడింది. రాజు ఆశ్చర్యపడి మంత్రిద్వారా తన భార్య వ్రతనిష్ఠ తెలిసికొని, ఆమె హరిభక్తి మహిమకు ఆనందపడ్డాడు. అది మొదలు తాను ఈశ్వరానుగ్రహం సంపాదించడానికి తపస్సు ప్రారంభించాడు. శివానుగ్రహ ఫలంగా నారదుడు వచ్చి ఆయనకు నారాయణ మంత్రోపదేశం చేశాడు. చిరకాలం అభీష్టసిద్ధికై రాజు చేసిన తపస్సుకు మెచ్చి చక్రతీర్థంలో కూర్మరూపంతో మహావిష్ణువు సాక్షాత్కరించాడు. ఆ స్వామియే కూర్మనాధుడు. భార్యా భర్తల భవనాలకు నడుమ ప్రవహించిన ఆ నది వంశధారా నది. శ్వేత రాజునకు ఆ విధంగా ప్రత్యక్షమైన స్వామి చక్రతీర్థంలో తపస్సు చేసే వక్రాంగ మునిని కూడా అనుగ్రహించాడు. కూర్మనాధస్వామి శ్వేతరాజును, నారదుని వెంటబెట్టుకొని అక్కడ వున్న శ్వేత పర్వతంపై అధివసించాలని భావించాడు. కాని, చిర తపోనిష్ఠతో దుర్బలతనువై వున్న శ్వేతరాజు పర్వతం ఎక్కలేక పోయాడట, కూర్మనాధుని హుంకారంతో ఆ కొండ శృంగిపోయి సమతలం అయింది. అక్కడ స్వామి తన చక్రంతో ఒక జలకుండం ఏర్పరిచాడు. దాని పేరు చక్రకుండం, శ్వేత పుష్కరిణి, సుధాకుండం అని కూడా వ్యవహరిస్తారు. ఈ సుధా కుండం నుంచి శ్రీమహాలక్ష్మి వుద్భవించి స్వామిని చేరినదంటారు.

కొంత కాలానికి కూర్మనాథస్వామి భిల్లరాజును అనుగ్రహించి పశ్చిమాభిముఖుడై దర్శనం ఇచ్చాడు. కూర్మనాయకి కూడ పశ్చిమాభిముఖియై వుంటుంది. భిల్లరాజు పుష్కరిణికి మెట్లు కట్టించాడు. శ్వేత రాజు వలన ఆలయ నిర్మాణం జరిగింది. దూర్వాసుడు శ్రీ కూర్మనాథుని దర్శనం చేసినాడని. బలరాముడు తీర్థయాత్రలో ఈ స్వామిని సేవించాడని చెప్పుకుంటూరు.

పూర్వం ఈ స్వామిని కూర్మేశ్వరుడని వ్యవహరించేవారని, అసలు-ఇది శైవ క్షేత్రమని, శ్రీ రామానుజులవారు విష్ణు తీర్థ స్థలముగా మార్పు చేశారని చెప్పడం కలదు. కూర్మనాథస్వామి మూర్తి కాక, గోవిందరాజ స్వామి, చక్రనారాయణస్వామి, బలినారాయణ స్వామి, నయనారాయణ స్వామి అనే మూర్తులు కూడ ఇక్కడ గోచరిస్తాయి. పుష్కరిణి గట్టున వున్న శ్వేత మృత్తికను వైష్ణవులు తిరుమణి నామములకై ఉపయోగిస్తారు. ఈ క్షేత్రములో ఉన్న అష్ట తీర్థములను భక్తులు పరమపావనంగా భావిస్తారు. కూర్మనాథస్వామి అభిషేక జలము. ప్రసాదము స్వీకరించి అనేకులు రోగ విముక్తులై అభీష్ట సిద్ధి పొందుతున్నారని. స్వామికి సహస్ర నామార్చనలు చేయడం శనిదోష నివారకమని భక్తుల విశ్వాసము. జ్యేష్ట బహుళ ద్వాదశి నాడు కూర్మ నాథస్వామి జయంతి జరుపుతారు.

REH01A422 96

ప్రచురణ
డైరెక్టరు,
సమాచార, పౌర సంబంధ శాఖ,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు-500001

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కేంద్ర ముద్రాణాలయములో
డైరెక్టరుగారిచే ముద్రించబడింది.

మనసు ఫౌండేషన్
పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	REH01 AN22
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	02/10/23
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	101
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI, 6, 24, 80, 95
లేని పేజీలు	NO
తయారు చేసినది	Mounika
పేజీలు విడదీసినది	Mouni
స్కాన్ చేసినది	Hema
పరీక్ష చేసినది	Amrutha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	good